www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 గురువారం

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 11, ఏప్రిల్ 2024

సంపుటి: 5 సంచిక: 322, పేజీలు: 12, వెల: రూ.5/-

## మానవీయ విలువలకు అద్దం పట్టే రంజాన్..

- శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్
- లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీక: ముఖ్యమంత్రి రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్ 11(వెలుతురు): పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకుని ముస్లిం సమాజానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. ఖురాన్ బోధనల ప్రభావం సమాజంపై ఎంతగానో ఉంటుందని, రంజాన్ మాసంలో చేపట్టిన ఉపవాస దీక్షలు స్వియ క్రమశిక్షణ, జీవితంపట్ల సానకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. సహనం, పరోపకారం, త్యాగం వంటి మానవీయ విలువలు రంజాన్ మాసం పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

ముస్లింలకు సీఎం రేవంత్‌రెడ్డి రంజాన్ మిగతా.. 2లో

## రేవంత్‌కు ప్రతిష్టాత్మకం మల్కాజిగిరి

- బిజెపికి కూడా పట్టుదలగా భావిస్తున్న సీటు
- పలు నియోజకవర్గాల్లో గట్టి పోటీ

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు): మల్కాజిగిరి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి కీలకంగా మారింది. ఇక్కడి నుంచి ఎంపిగా గెలిచిన రేవంత్ రెడ్డి సిఎం కావడంతో..ఇప్పుడీ సీటు ప్రతిష్టాత్మకంగా మారింది.




అలాగే తెలంగాణ నుంచి ఎక్కువ సీట్లు గెలవడం కూడా సిఎం రేవంత్ రెడ్డికి అసవరం. లేకుంటే కాంగ్రెస్ ప్రతిష్ట మసకబారగలదు. ఈ క్రమంలో అనేక సీట్లను దక్కించుకోవడం కోసం రేవంత్ సొతంంగా వ్యహాలు రచిస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ.. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక బరిలో నిలిచిన రేవంత్ మల్కాజిగిర ఇనుంచి విజయం సాధించారు. రాజకీయంగా మరింత ఉన్నతస్థాయికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే మల్కాజిగిరిలో ఈసారి అలాంటి సీన్ రిపీట్ కానుందా అనే ఆసక్తి నెలకొంది. రాష్ట్రంలో ప్రస్తుతం అత్యంత కీలక పదవుల్లో ఉన్న ఇద్దరు నేతలకు 2019 ఎన్నికలు పూర్తిగా కలిసి వచ్చాయని చెప్పవచ్చు. 2018 డిసెంబర్ 7న జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అలాగే, నగరంలోని అంబర్‌పేట అసెంబ్లీ నుంచి ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పోటీచేసి కొద్దిపాటి తేడాతో ఓటమి పాలయ్యారు. అయితే, పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు నేతలను అసెంబ్లీ ఎన్నికలు తీవ్ర నిరాశకు గురిచేసినప్పటికీ.. పార్లమెంట్ మిగతా.. 2లో

## నిబంధనలకు తూట్లు.. పార్టీలకు బాండ్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11,(వెలుతురు): ఎలక్టోరల్ బాండ్ల వివాదంలో మరో కొత్త కోణం. కంపెనీ ఏర్పాటైన మూడేళ్ల తర్వాతే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే అర్హత లభిస్తుదని నిర్దేశిత చట్టం స్పష్టం చేస్తున్నప్పటికీ.. పలు కంపెనీలు ఆ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘించాయి. పార్టీలకు విరాళాలు సమర్పించుకున్నాయి. దాదాపు 20 కంపెనీలు.. ఈ విధంగా ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి రాజకీయ పార్టీలకు రూ.103



కోట్ల విరాళం ఇచ్చాయని ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'హిందూ' వెల్లడించింది. ఈ కంపెనీల్లో చాలావరకు హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్నవేనని, వీటి ద్వారా ఆర్థిక లబ్ధి పొందిన పార్టీల్లో కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ అగ్రస్థానంలో తెలిపింది.

అక్రమ నిధులను అడ్డుకోవటానికి కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 182 ప్రకారం.. ఒక కంపెనీ ఏర్పాటై మూడు ఆర్థిక సంవత్సరాలు పూర్తయిన తర్వాతే.. ఆ కంపెనీ ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ రాజకీయపార్టీలకు విరాళం ఇచ్చే అర్హతను సాధిస్తుంది. పార్టీలకు షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధుల వరద ప్రవహించకుండా ఈ నిబంధన అడ్డుకుంటుంది. దీనిని ఉల్లంఘిస్తే సదరరు కంపెనీ ప్రతినిధులకు ఆర్నెళ్ల జైలు శిక్షతోపాటు ఆ కంపెనీ విరాళంగా ఇచ్చిన సొమ్ముకు ఐదు రెట్ల సొమ్మును జరిమానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి స్పష్టమైన నిషేధం ఉన్నప్పటికీ.. దాదాపు 20 కంపెనీలు నిబంధనలను ఉల్లంఘిస్తూ రూ.103 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను 2021 ఏప్రిల్-2023 జూన్ మధ్య కొనుగోలు చేశాయి. ఆ సమయానికి ఆ కంపెనీలు ఏర్పాటై మూడేళ్ల గడువు పూర్తి కాలేదు. అయినప్పటికీ, అవి బాండ్లు కొని పార్టీలకు ఇచ్చాయి. ఈ బాండ్ల ద్వారా బీఆర్ఎస్ రూ.31.5 కోట్లు, బీజేపీకి రూ.26 కోట్ల విరాళాలు లభించాయి. కాగా, ఈ 20 కంపెనీల్లో 12 కంపెనీలు హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయాలను కలిగి ఉన్నాయి. సదరు 12 కంపెనీలు మొత్తంగా రూ.37.5 కోట్ల బాండ్లను పార్టీలకు విరాళం ఇవ్వగా.. వీటిలో 75శాతం నిధులు బీఆర్ఎసకు లభించగా, మిగిలిన 25శాతం బీజేపీ, కాంగ్రెస్, టీడీపీలకు దక్కాయి.

కళ్లు తెరిచి ఏడాది కాకముందే డొనేషన్లు ఈ 20 కంపెనీల్లో ఐదు కంపెనీలు.. ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసే నాటికి తొలి వార్షికోత్సవాన్ని కూడా జరుపుకోలేదు. అంటే, అవి ఏర్పాటై ఏడాది కూడా కాలేదు. మరో ఏడు కంపెనీలు రెండేళ్లలోపువి. మిగిలిన ఎనిమిది కంపెనీలు మూడేళ్లలోపువి. మరింత విచిత్రమైన విషయం ఏమిటంటే, ఈ 20 కంపెనీల్లో పలు కంపెనీలు కరోనా కారణంగా ఆర్థికమాంద్యం నెలకొన్న 2019 తర్వాత ఏర్పాటయ్యాయి. అయినప్పటికీ, కళ్లు తెరిచిన కొన్ని నెలల్లోనే కోట్లాది రూపాయల బాండ్లను కొనుగోలు చేశాయి. ఉదాహరణకు.. హైదరాబాద్‌కు చెందిన టీ షార్ప్ ఇన్ఫ్రా డెవలపర్స్, టీ షార్ప్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ 2023లో ఏర్పాటయ్యాయి. ఉనికిలోకి వచ్చిన కొన్ని నెలల వ్యవధిలోనే రూ.7.5 కోట్ల బాండ్లను కొని బీఆర్ఎసకు అందించాయి. మిగతా.. 2లో

## రాధాకిషన్ రావుకు 12 వరకు రిమాండ్ పొడిగింపు

- ఒక్కొక్కరే బయటకు వస్తున్న బాధితులు
- షేర్లు బలవంతంగా రాయించుకున్నట్లు కేసు

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు): ఫోన్ ట్యాపింగ్ కేసు టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావుకు ఈనెల 12 వరకు నాంపల్లి కోర్టు రిమాండ్ పొడిగించింది. నేటితో రాధాకిషన్ రావు కస్టడీ ముగియడంతో ఆయనను ఉదయం నాంపల్లి కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. దీంతో రాధాకిషన్‌కు ఈ నెల 12 వరకు రిమాండ్ కొనసాగిస్తున్నట్లు కోర్టు తెలిపింది. జైల్‌లో లైబ్రరీకి వెళ్లేందుకు అనుమతించడం లేదని ఈ సందర్భంగా కోర్టుకు రాధా కిషన్ తెలిపారు. జైల్ సూపరింటెండెంట్‌ను కూడా



కలవనీయడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులను కోర్టు ప్రశ్నించింది. లైబ్రరీతో పాటు జైలు సూపరింటెండెంట్‌ను కలిసేలా అనుమతిస్తూ కోర్టు ఆదేశించింది. ఇకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు అయిన మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు బాధితులు ఒక్కొక్కరిగా బయటకొస్తున్నారు. 2024 ఏప్రిల్ 4 బుధవారం నాడు టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావు పై మరో కేసు నమోదైంది. క్రియా హెల్త్ కేర్ సంస్థ డైరెక్టర్లతో కలిసి తనపై ఉన్న షేర్లు బలవంతంగా రాయించుకున్నారని చైర్మన్ వేణుమాధవ్ చెన్నుపాటి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. అంతే కాక తనపై ఉన్న యాజమాన్య హక్కులను కూడా మార్పిడి చేశారని బాధితుడు పోలీసులకు తెలిపారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు రాధా కిషన్ రావుతో సహా ఇన్ స్పెక్టర్ గట్టుమల్లు, ఎస్ ఐ మల్లికార్జున్ పలువురు పోలీస్ అధికారులపై కేసు నమోదు చేశారు. 2018 నవంబర్ లో తనను టాస్క్ ఫోర్స్ ఆఫీస్ తీసుకువెళ్లి పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించారని మిగతా.. 2లో

## కాంగ్రెస్‌ను పడగొట్టే ఖర్మ మాకు లేదు




- రాముడికి మొక్కుదాం..బిజెపిని తొక్కుదాం
- ఫోన్ ట్యాపింగ్ కాదు..మంచినీళ్లపై దృష్టి పెట్టండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు): రాముడు మాకు కూడా దేవుడే. రాముడికి మొక్కుదాం.. ఓటుతో ఎన్నికల్లో బీజేపీని తొక్కుదాం అంటూ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఘట్‌కేసర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు అన్నారు కేటీఆర్. ఫోన్ ట్యాపింగ్ మీద పెట్టిన శ్రద్ధ.. మంచినీళ్ల మీద పెట్టమని హితవు పలికారు. రైతు బంధు, మిగతా.. 2లో

## భువనగిరి ఎంపి గెలుపే లక్ష్యం

- నేతలకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో జరగగా సిఎం రేవంత్ తదితరులు పాలొగన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈనెల 21న నామినేషన్ వేయనున్న నేపథ్యంలో అదే రోజు భువనగిరిలో బహిరంగ సభ నిర్వహించాలని సీఎం సూచించారు. మిగతా.. 2లో



## కాంగ్రెస్‌లో వెన్నుపోటు రాజకీయాలు

- సొంత గ్రూపు ప్రయత్నాల్లో సిఎం రేవంత్
- బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు): కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డికి కంఫర్ట్‌గా లేదని.. ఆయన సొంత దుకాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌ని ఓడించే ప్రయత్నం చేస్తున్నారని స్వయంగా సీఎం చెబుతున్నారని.. వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని స్వయంగా రేవంత్ అనుకుంటున్నారన్నారు. పీసీసీ పదవి వేరే.. సీఎం పదవి వేరేనన్నారు. సీఎం పదవి కోసం పదిమంది పోటీపడుతున్నారని.. సెకండ్ పొజిషన్ కోసం కాంగ్రెస్‌లో పోటీపడుతున్నారన్నారు.



భట్టి బీ ట్యాక్స్ అని కాంగ్రెస్ వాళ్లే లీకులు ఇచ్చారన్నారు. చంద్రబాబుకు, రేవంత్‌కు సేమ్ పోలికలు ఉన్నాయన్నారు. ఎల్లో కాంగ్రెస్, గ్రీన్ కాంగ్రెస్, గాంధీ కాంగ్రెస్ పేరుతో మూడు గ్రూప్‌లు ఉన్నాయని.. 25 మందితో మిగతా.. 2లో

## కవిత కేసులో సిబిఐ ఇంటరాగేషన్

- సవాల్ చేస్తూ కవిత పిటిషన్
- 26కు వాయిదా వేసిన కోర్టు

న్యూఢిల్లీ,ఏప్రిల్10(వెలుతురు): ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సీబీఐ ఇంటరాగేషన్ చేయడాన్ని కవిత తరపు న్యాయవాదులు తప్పుబట్టారు. సీబీఐ ప్రశ్నించడాన్ని సవాల్ చేస్తూ మిగతా.. 2లో




## దేవుడి ఫోటోతో కాదు.. మోడీ ఫోటోతో రండి

- కరీంనగర్‌కు ఏం చేశారో వినోద్, బండి చెప్పాలి
- అంజన్న ఆశిస్సులతో 17 ఎంపి స్థానాలు మావే
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

జగిత్యాల,ఏప్రిల్10(వెలుతురు): దేవుడు మీకేనా.. మాకు కాదా.., దేవాలయాలకు ఏం చేశావ్ బండి సంజయ్ అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. రాముడి పేరుతో రాజకీయాలు మానాలని అన్నారు. దేవుడు అందరికీ



దేవుడేనని అన్నారు. మంగళ సూత్రాన్ని అమ్ముకున్న నీకు కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడివని నిలదీశారు. కొండగట్టు అంజన్నను లిక్కర్ రాణి మోసం చేసిందని, పెద్ద విగ్రహం పెడతామని శఠగోపం పెట్టిందన్నారు. అందుకే అంజన్న అగ్రహించాడని, బీఆర్ఎస్, బీజేపీలవి మోసపూరిత హామీలని మిగతా.. 2లో



## లాస్య నందిత సోదరికే కంటోన్మెంట్ టిక్కెట్

- నివేదిత పేరును ఖరారు చేసిన కెసిఆర్

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు): కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సాయన్న మరో తనయ నివేదిత పేరును పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. పార్టీ ముఖ్యులు, స్థానిక నేతలతో చర్చించిన అనంతరం దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదితను అభ్యర్థిగా ప్రకటించినట్లుగా బీఆర్ఎస్ పార్టీ అధికారిక ప్రకటన చేసింది.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో ఆ స్థానంలో ఉప ఎన్నిక వచ్చిన సంగతి తెలిసిందే. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తె నివేదిత. 2023 ఫిబ్రవరిలో సాయన్న కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. 2023 నవంబరులో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాయన్న కుమార్తె లాస్య నందితకు కేసీఆర్ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో లాస్య నందిత విజయం సాధించారు. కానీ, ఎన్నికల ఫలితాలు విడుదలైన మూడు నెలల వ్యవధిలోనే లాస్య నందిత ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

# రేవంత్‌కు ప్రతిష్టాత్మకం మల్కాజిగిరి

మొదటిపేజీ తరువాయి..

ఎన్నికలు వరంగా మారాయి. కొడంగల్‌లో ఓడిన రేవంత్‌రెడ్డి.. 2019 ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విజయదుందుభి మోగించారు. గ్రేటర్‌లోని మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి తన సమీప ప్రత్యర్థిపై 80,392 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. అలాగే, అంబర్‌పేటలో ఓడిపోయిన కిషన్‌రెడ్డి.. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి బరిలోకి దిగి విజయకేతనం ఎగురవేశారు. తన సమీప ప్రత్యర్థిపై 62,114 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కేవలం నాలుగు నెలల్లోనే ఇద్దరు నేతలకు విజయం వరించింది. ఇదిలా ఉండగా, పార్లమెంట్‌లోకి అడుగు పెట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి దశ మారిపోయింది. అప్పట్లో రాష్ట్ర కాంగ్రెస్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయనకు రెండేళ్లలో టీపీసీసీ ప్రెసిడెంట్ పదవి లభించింది. తాజా ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఎంపీగా గెలుపొందిన కిషన్‌రెడ్డికి మోదీ ప్రభుత్వంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి పదవి లభించింది. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. 119 స్థానాల్లో కేవలం 39 సీట్లను దక్కించుకుని ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది. అయితే, 64 సీట్లను కైవసం చేసుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తోంది. ఈ మేరకు గ్రేటర్‌లోని ఆయా సెగ్మెంట్ల నుంచి బలమైన అభ్యర్థులను బరిలో నిలిపింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానం నుంచి బరిలో దిగుతున్నారు. ఆయనను కాంగ్రెస్ తరఫున రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సునీతా మహేందర్ రెడ్డి ఢీకొంటున్నారు. హుజూరాబాద్‌లో ఓటమి చెందిన రాజేందర్‌కు మల్కాజిగిరి కలిసి వస్తుందా.. లేదా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యేగా గెలుపొందిన దానం నాగేందర్.. సికింద్రాబాద్ పార్లమెంట్‌లో విజయకేతనం ఎగురవేసి డబుల్ విక్టరీని సొంతం చేసుకుంటాడా.. లేదా అనే ఆసక్తి నెలకొంది. ఇకపోతే కడియం కావ్య బిఆర్ఎస్ టిక్కెట్ పొంది, తిరిగి కాంగ్రెస్‌లో చేరి పరీక్షించుకోబోతున్నారు. ఆమెకు పోటీగా బిఆర్ఎస్‌నుంచి బయటకు వచ్చిన ఆరూరి రమేశ్ బిజెపి నుంచి పోటీ పడుతున్నారు. చేవెళ్లలో ప్రస్తుత ఎంపి రంజిత్ రెడ్డి కూడా కారు దిగి చేయి అందుకున్నారు. మొత్తంగా పలు నియోజకవర్గాల్లో పార్టీలు మారిన నాయకులు పోటీ పడుతున్నారు.

# నిబంధనలకు తూట్లు.. పార్టీలకు బాండ్లు

**మొదటిపేజీ తరువాయి..**

2021 నవంబరులో ఏర్పాటైన అస్క్ అస్ లాజిస్టిక్స్ కంపెనీ.. ఏడాదిన్నర కూడా కాకముందే రూ.22 కోట్ల బాండ్లను కొని డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీలకు అందించింది. అలాగే, కోయంబత్తూరుకు చెందిన హెచ్‌హెచ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ రూ.15 కోట్ల బాండ్లను బీజేపీకి, రూ.5 కోట్ల బాండ్లను బీజేడీకి సమర్పించింది. అప్పటికి ఆ కంపెనీ ఏర్పాటై మూడేళ్లు పూర్తి కాలేదు.

ఈ జాబితా ఈ 20 కంపెనీలకే పరిమితం కాదని 'హిందూ' తెలిపింది. కంపెనీల విలీనం తర్వాత ఏర్పాటైన కొత్త కంపెనీలను, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో లేని కంపెనీలను తాము పరిశీలించలేదని వెల్లడించింది. కార్పొరేట్ శాఖ వెబ్‌సైట్‌లోని సమాచారం ఆధారంగా ఆయా కంపెనీల ఆవిర్భావ వివరాలు సేకరించామని తెలియజేసింది.

బాండ్ల పథకానికి ముందే చట్టానికి సవరణ కంపెనీల చట్టం, 1956 ప్రకారం రాజకీయపార్టీలకు ప్రైవేటు కంపెనీలు విరాళాలు ఇవ్వటంపై నిషేధం ఉంది. 1985లో ఈ చట్టంలోని 'సెక్షన్ 293-ఏ'కు సవరణ జరిపి నిషేధాన్ని తొలగించారు. అయితే, ఆ సందర్భంగా కొన్ని షరతులు విధించారు. వాటి ప్రకారం, 1. పార్టీలకు ప్రభుత్వ సంస్థలు విరాళం ఇవ్వకూడదు 2. విరాళం ఇచ్చే ప్రైవేటు కంపెనీ కనీసం మూడేళ్ల కిందట ఏర్పాటై ఉండాలి 3. మూడేళ్ల కాలవ్యవధిలో వచ్చిన నికర లాభాల్లో 7.5 శాతానికి మించి విరాళం ఇవ్వరాదు. కంపెనీల చట్టం, 2013లో కూడా ఈ నిబంధనలను సెక్షన్ 182 కింద కొనసాగించారు.

అయితే, నరేంద్ర మోదీ ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత, ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టటానికి ముందు 2017లో సెక్షన్ 182కి సవరణ జరిపారు. దాని ప్రకారం, 7.5 శాతం పరిమితిని తొలగించారు. మూడేళ్లలోపు కంపెనీలు విరాళాలు ఇవ్వొద్దనే నిబంధనను మాత్రం కొనసాగించారు. 7.5 శాతం పరిమితిని ఎత్తివేయటాన్ని అప్పట్లో ఈసీ, ఆర్బీఐ వ్యతిరేకించాయి. ఈ చర్య వల్ల షెల్ కంపెనీల ద్వారా రాజకీయపార్టీలకు నల్లధనం ప్రవహించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి.

'హిందూ' కథనంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ.. అక్రమ నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవటానికి ఉన్న రక్షణలను కూడా మోదీ పర్యవేక్షణలో అడ్డగోలుగా ఉల్లంఘించినట్లు దీనిద్వారా తెలుతోందన్నారు.

## మానవీయ విలువలకు అద్దం పట్టే రంజాన్..

**మొదటిపేజీ తరువాయి..**

శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ఆనందంగా జరుపుకొని అల్లా దీవెనలు అందుకోవాలని ఆకాంక్షించారు. అన్ని సేవలకు మించి మానవసేవ అత్యున్నమైనదని చాటి చెప్పే రంజాన్... లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీక అన్నారు. పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దానధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా కలిసిమెలిసి సుఖసంతోషాలతో జీవించేలా అల్లా ఆశీర్వదాలు ఉండాలని రేవంత్‌రెడ్డి ప్రార్థించారు.

నేడు 'ఈద్ ఉల్ ఫితర్' పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులపాటు జరిగిన రంజాన్ ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు, పేదలకు సంతర్పణలు తెలంగాణ వ్యాప్తంగా గొప్ప ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయన్నారు. తమ హయాంలో లౌకికవాద సాంప్రదాయాలను పాటిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలబెట్టామన్నారు. రాష్ట్రంలోని ముస్లిం కుటుంబాలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలందరూ అల్లా దీవెనలు అందుకోవాలని, ఈద్- ఉల్- ఫితర్ వేడుకల్లో ఆనందంగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## మాదిగలను దూరం చేసుకోవడం సరికాదా

**గతంలో సిఎం మాదిగలను దూరం పెట్టలేదు**

**మాజీమంత్రి మోత్కుపల్లి శకునాలు**

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు): తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో మాదిగ జాతికి కాంగ్రెస్ పార్టీ ఒక్క టికెట్ కూడా కేటాయించకపోవడం దురదృష్టకరమని ఆ పార్టీ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలను అంటరానివారిగా చూడొద్దని రేవంత్ రెడ్డిని మోత్కుపల్లి హెచ్చరించారు.

చాలా బారువెక్కిన హృదయంతో మాట్లాడుతున్నాను. నీతి నిజాయితీగా బతికిన నేను ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పార్టీలో చేరాను. నాకు ఎమ్మెల్యే టికెట్ రాకపోయినా బాధపడలేదు. కానీ మొత్తం మాదిగ జాతిని దూరం పెట్టడం దురదృష్టకరం. 17 లోక్‌సభ స్థానాల్లో మూడు ఎస్సీలకు రిజర్వ్ చేయబడ్డాయి. వాటిలో ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించలేదు. మాదిగ కులానికి సీట్లు లేవన్నట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. ఇలా మమ్మల్ని దూరం పెడితే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ఏంటి..? అని మోత్కుపల్లి ప్రశ్నించారు. నేను చాలా మంది ముఖ్యమంత్రులను చూసాను. కానీ రేవంత్ రెడ్డిలా మాదిగలను దూరం పెట్టినవాళ్లను చూడలేదు. సీఎంను, మంత్రులను అడుగుతున్నా.. మీకిది న్యాయమేనా..? కేసీఆర్ మాదిగలకు టికెట్లు ఇచ్చారు. కానీ కాంగ్రెస్ ఎందుకు మాదిగలను దూరం పెడుతోంది. ఇది కాంగ్రెస్‌కు నష్టం చేస్తుంది. రేవంత్ రెడ్డికి అన్నగా ఈ మాట చెబుతున్న.. ఎవరో చెప్పిన మాటలు విని మాదిగలకు అన్యాయం చేయొద్దు. మాదిగలకు టికెట్లు ఇవ్వకపోవడం చారిత్రాత్మక తప్పు. రేవంత్ రెడ్డి ఆలోచించుకొని, తన తప్పును సరిదిద్దుకోవాలని మోత్కుపల్లి నర్సింహులు సూచించారు.

మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై మాట్లాడుదామంటే



సీఎం నాకు సమయం ఇవ్వడం లేదు. మాదిగ జాతికి న్యాయం చేయండి. నేను మానసికంగా కృంగిపోతున్నా. మాదిగలకు జరుగుతున్న అన్యాయం చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న ప్రతి మాదిగ బాధపడుతున్నాడు. ఒకే కుటుంబంలో రెండు, మూడు టికెట్లు ఇవ్వాల్సిన అవసరం ఏముంది.? ఒక్క సీటుకు కూడా మా మాదిగలు అర్హులు కారా..? మాదిగ కులానికి పార్లమెంట్‌లో కూర్చునే అవకాశం కల్పించండి. మమ్మల్ని అంటరానివారిగా చూడొద్దు. తాను వరంగల్ ఎంపీ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నా అని మోత్కుపల్లి పేర్కొన్నారు.

# వందరోజుల్లో రెండువందల మంది ఆత్మహత్యలు

**రైతుల సమస్యలపై ఇదేనా కాంగ్రెస్ తీరు**

**కెసిఆర్ పరామర్శిస్తే ఎద్దేవా చేస్తారా**

**ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విమర్శలా**

**మెదక్ ఎంపి స్థానం ఎప్పటికే బిఆర్ఎస్‌దే**

**ప్రచారంలో బిఆర్ఎస్ ఎమ్మెయే హరీష్ రావు**

సంగారెడ్డి,ఏప్రిల్10(వెలుతురు): వందరోజుల పాలనలో రెండువందల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ..ఇదేనా రైతుల సంఓఏమం కోరే పాలన అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు చేశారు. రైతుల వద్దకు కేసీఆర్ పోయి పరామర్శిస్తే తట్టుకోలేక.. రేవంత్ రెడ్డి నోటి కొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి భాష జుగుప్సాకరంగా ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ విధంగా మాట్లాడడం సరికాదన్నారు. బుధవారం, పఠాన్ చెరు మండలం, రుద్రారంలోని, సిద్ధి గణపతి దేవాలయ, ఆవరణలో బీఆర్ఎస్ మెదక్ లోక్ సభ ఎన్నికల ప్రచార రథాలను హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మార్పు కావాలని అధికారంలోకి వచ్చి ప్రజలను మాయచేస్తోందన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి లోకల్ కాదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన తెల్లాపూర్‌లోనే ఉంటున్నారని, అభ్యర్థి గుణగణాలు చూసి ప్రజలు ఓటేయాలని సూచించారు. పార్లమెంట్‌లో మన సమస్యలపై గళం విప్పే వాళ్లు కావాలా?.. గులాం గిరి చేసే వారు కావాలో? ప్రజలు నిర్ణయించుకోవాలని హరీష్ రావు అన్నారు. 2004 నుంచి ఇప్పటి వరకు గులాబీ జెండా మెదక్ పార్లమెంట్‌లో ఎగురుతోందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటులో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంత ఎత్తుకు లేసిందో.. అంతగా తుస్సుమనిపించిందన్నారు. వందరోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పినా.. ఇప్పటికీ ఎలాంటి హామీలు నెరవేరలేదని హరీష్ రావు విమర్శించారు. ఇప్పటికే పేద మహిళలకు ఫించన్లు ఇస్తామన్న రేవంత్ రెడ్డి 42 లక్షల మందికి బాకీపడ్డారన్నారు. నిరుద్యోగ భృతి, పేద మహిళలకు ఫించన్లు ఇచ్చిన తరువాతే కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు, రైతులకు రుణమాఫీలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు.పటాన్ చెరులోని రుద్రారం గ్రామ పరిధిలో గణెళిష్ గడ్డకు మనకు అచ్చొచ్చిన స్థలమని ఎంపి గెలుపు పక్కా అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. మెదక్ పార్లమెంటులో 2004 నుండి 2024 వరకు బిఆర్ఎస్ పార్టీ గెలిచిందన్నారు. కాంగ్రెస్ పాల పొంగు లెక్క అయ్యిందని, హామీలు ఇచ్చి కాంగ్రెస్ మొత్తం మరిచి పోయిందని, హామీలు అమలు చేయక ముఖం చాటేసిందని, ప్రభుత్వం వచ్చి 125 రోజులు అయినా రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పదివేల రూపాయలు మా అక్కా చెల్లలకు చెల్లించాకే కాంగ్రెస్ ఓటు హక్కు అడగాలని, పింఛన్లు ఇవ్వకుండా చోద్యం చూస్తున్నారని, నిరుద్యోగ భృతి మీద రోజుకో మాట మాట్లాడుతున్నారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని దుయ్యబట్టారు. రైతులకు హామీలు ఇచ్చి మోసం చేశారని, అభయహస్తం అక్కరకు రాని హస్తం అయ్యిందని ఎద్దేవా చేశారు. కెసిఆర్ కిట్టు బంద్ అయ్యిందని, తిట్లు వచ్చాయని, వరికి 500 బోనస్ ఇవ్వలేదు అని అడిగారు. 15 వేల బోనస్ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని, భాష, సంస్కారం ఉండాలి కదా అని, వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200 మంది రైతులు చనిపోయారని, ఫేక్ వార్తలతో ఎన్నో రోజులు ఉండరని, మీలాంటి వారికి గుణపాఠం తప్పదని హరీష్ రావు హెచ్చరించారు. మొన్నటి ఎన్నికల్లో 38 వేల ఓట్ల మెజార్టీతో మహిపాల్ రెడ్డిని గెలిపించారని, పటాన్ చెరులో ఉంటారని, రేపు ఎంపిగా వెంకట్రామిరెడ్డి ఉమ్మడి మెదక్ కు సేవలు అందిస్తారని చెప్పారు. గల్లీ గల్లి తెలిసిన వ్యక్తి వెంకటామ్రిరెడ్డి అని, పార్లమెంట్ లో తెలంగాణ గళం విప్పుతాడని, ఎంతో మందికి సాయం చేశారని, వంద కోట్లతో విద్యా నిధి ఏర్పాటు చేశారని, బిజెపి నేత రఘునందన్ మంచిగా పని చేస్తే దుబ్బాకలో ఎందుకు గెలవలేదని ప్రశ్నించారు. ఎన్నో హామీలిచ్చి అమలు చేయలేదని, అందుకే రఘునందన్ ను 54 వేల ఓట్లతో ఓడించారని ఎద్దేవా చేశారు. వెంకట్రామి రెడ్డి అధికారికంగా అద్భుతమైన సేవలు అందించారని, పని చేసే కష్టపడే మనస్తత్వం ఉన్న వ్యక్తి అని హరీష్ రావు ప్రశంసించారు. టాన్ చెరు అభివృద్ధికి గళం విప్పుతారని, గళం ఎత్తేవారు కావాలా? గులాం గిరీ చేసే వారు కావాలా? అని అడిగారు. భవిష్యత్తులో అధికారం లోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీ అని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

# ఐపిఎల్ బెట్టింగ్ దందాపై పోలీసుల నిఘా

**మియాపూర్‌లో ఆన్‌లైన్ ముఠా పట్టివేత**

హైదరాబాద్,ఏప్రిల్10(వెలుతురు):

ఐపీఎల్ వచ్చిందంటే చాలు.. క్రీడాభిమానుల సందడి కన్నా బెట్టింగ్ రాయుళ్ల హంగామానే ఎక్కువైపోతుంది. రహస్యంగా బెట్టింగ్ దందాను నడిపిస్తూ.. లక్షల నుంచి కోట్ల దాకా భారీ మొత్తాన్ని పోగేసుకుంటున్నారు. అటు.. బెట్టింగ్స్ వేస్తున్న వాళ్లు రోడ్డుపాలవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు రంగంలోకి దిగి.. బెట్టింగ్ ముఠాల ఆటకట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఎక్కడ దాక్కున్నా.. వెతికి మరీ పట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే.. సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఆల్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను పట్టుకున్నారు. మొత్తం ఆరుగురి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. గుంటూరులోని నర్సారావు పేటకు చెందిన శాకమూరి వెంకటేశ్వరరావు అలియాస్ చిన్ను ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం నడుస్తోంది. మియాపూర్ పీఎస్ పరిధిలోని మాతృశ్రీ నగర్‌లో ఉన్న శ్రీనిధ సర్వీస్ అపార్ట్‌మెంట్ అడ్డాగా ఈ బెట్టింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నట్టు సమాచారం అందింది.

దీంతో.. పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి, నిందితుల అడ్డాకు వెళ్లి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 'క్రికెట్ లైవ్ గురు', 'లక్కీ ఆన్‌లైన్ యాప్'ల ద్వారా ఈ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 43,57,461 రూపాయలతో పాటు ల్యాప్ టాప్స్, కొన్ని మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో 50 మంది దాకా ఫండర్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు వారి ఆచూకీ కనుగొనే పనిలో నిమగ్నమయ్యారు. ఈ బెట్టింగ్ లావాదేవీల కోసం నిందితులు ఐదు బ్యాంక్ ఖాతాలను వినియోగించినట్లు తెలిసింది. ఈ ఐదు ఖాతాల్లో మూడున్నర లక్షలు ఉండగా.. ఆ మొత్తం అమౌంట్‌ని ఫ్రీజ్ చేసేశారు. నిందితుల్లో ప్రధాన నిందితుడైన వెంకటేశ్వరరావుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## రాధాకిషన్ రావుకు 12 వరకు రిమాండ్ పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి..**

వేణుమాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాధా కిషన్ రావు అరెస్ట్ కావడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసానని తెలిపారు. రాధాకిషన్ తో సహా నలుగురు అధికారులపై ఐపీసీ సెక్షన్ 386,365,341, 120(బీ) రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు తెలుస్తుంది. మరోవైపు రాధా కిషన్ రావుకు ఏప్రిల్ 12వరకు రిమాండ్ పొడిగించింది నాంపల్లి కోర్టు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన ఆయన ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో ఉన్నారు. ఇవాళ్టితో రాధా కిషన్ రావు కస్టడీ ముగియడంతో కోర్టులో హాజరుపరిచారు పోలీసులు. ఈ సందర్భంగా చంచల్ గూడ జైలులో జైలు సూపరిండెంట్ ను కలవనివ్వడం లేదని.. లైబ్రరీకి వెళ్లనివ్వడం లేదంటూ మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకోచ్చారు రాధా కిషన్ రావు. సూపరిండెంట్ ను కలిసేందుకు అలాగే.. లైబ్రరీకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని మేజిస్ట్రేట్ ఆదేశించింది. అనంతరం రాధా కిషన్ రావును చంచల్ గూడ జైలుకు తరలించారు పోలీసులు.

## భువనగిరి ఎంపి గెలుపే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..**

మే తొలి వారంలో నిర్వహించే సభకు ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. గెలుపు కోసం ప్రజలను కలిసి నేరుగా ఓట్లు కోరాలని అన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగ ఆముందుకు సాగాలన్నారు. మనం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల ముందు పెట్టాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజగోపాల్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి చామల కిరణ్



కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతోపాటు ముఖ్యనాయకులు హాజరయ్యారు. భువనగిరిలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం నాయకులు , కార్యకర్తలు కృషి చేయాలని సీఎం కోరారు.

## కాంగ్రెస్‌ను పడగొట్టే ఖర్మ మాకు లేదు

**మొదటిపేజీ తరువాయి..**

దళిత బంధు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్, బతుకమ్మ చీరలు సహా అన్ని రద్దు చేశారని విమర్శించారు. రాహుల్ భారత్ జోడో యాత్ర అని దేశమంతా తిరుగుతుంటే రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ నా పెద్దన్న అంటారని ఎద్దేవా చేశారు. లిక్కర్ స్కామ్ జరగలేదని రాహుల్ అంటే లేదు లిక్కర్ స్కామ్ జరిగిందని రేవంత్ అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్?లో రాహుల్, రేవంత్ రెండు నాలుకలు అని విమర్శించారు.ఖచ్చితంగా రేవంత్ రెడ్డి కేసులు తప్పించుకోవడం కోసం బీజేపీలో చేరుతారని కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక్క సీటు కూడా రాదన్న రేవంత్ రెడ్డి తాను విసిరిన ఛాలెంజ్ పట్ల సప్పుడు చేయలేదన్నారు. ఈటలకు ఓటు వేసినా ఇక్కడ ఉండరు.. హుజురాబాద్ వెళ్ళిపోతారని విమర్శనాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచిన లోకల్ అభ్యర్థి రాగిడిని గెలిపించాలని కోరారు. రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం.. అంటూ నినాదాలు చేశారు. రాముడి పేరు చెప్పుకుని రాజకీయం చేసే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్, ప్రధాని మోదీ ఇద్దరూ కలిసి తెలంగాణను ఆగం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

## కాంగ్రెస్‌లో వెన్నుపోటు రాజకీయాలు

**మొదటిపేజీ తరువాయి..**

తన వర్గం ఎమ్మెల్యేలకు తోడుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తెచ్చుకోవాలని రేవంత్ చూస్తున్నార న్నారు. రేవంత్‌కు పోటీగా 25 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ఉత్తమ్ కామెంట్ చేశారని.. సీఎం స్థాయిలో ఉండి కుట్ర చేస్తున్నారనడం ఆయన రేవంత్ అసమర్థతకు నిదర్శనమన్నారు. గేట్లు ఓపెన్ చేసినా, విండోలను ఓపెన్ చేసినా ఎవరు కాంగ్రెస్‌లోకి వెళ్లడం లేదన్నారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్‌లో కంఫర్ట్ లేదని.. సొంత దుకాణం కోసం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారన్నారు. గేట్లు ఎత్తేమని చెబుతున్నారు కదా.. ఎక్కడ ఎమ్మెల్యేలు? అంటూ ప్రశ్నించారు. తాము గేట్లు ఎత్తాల్సిన అవసరం లేదని.. కాంగ్రెస్ పార్టీని ఎవరు ఏమి చేయాల్సిన అవసరం లేదని.. వాళ్ల మధ్య విభేదాలే వాళ్లను వీక్ చేస్తాయన్నారు. తమ మా ఎమ్మెల్యేలు ఎవరితో టచ్‌లో లేరని.. బీజేపీ ప్రజలను నమ్ముకుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో వాళ్లలో వాళ్లే కొట్టుకుంటారన్నారు. ప్రభుత్వం కూలిపోతుందని.. ముఖ్యమంత్రి వెంట భారీ వ్యవస్థ ఉన్నప్పటికీ కుట్ర జరుగుతుందని రేవంత్ అంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఐదుగురు షిండేలు ఉన్నారని.. రేవంత్ రెడ్డ్ ఏ అంటే పార్టీలో ఉంటే.. నా వెంట ఎంత మంది వస్తారు ప్లాన్ బీ అంటే.. పార్టీ నుంచి బయటకు వచ్చి సొంతంగా దుకాణం పెట్టుకుంటే ఎంత మంది వస్తారు ? అన్నారు. రేవంత్ టెన్షన్ తట్టుకోలేక ఓ ఐపీఎస్ అధికారి గుండెపోటుతో మరణించారని ఆరోపించారు.

## కవిత కేసులో సిబిఐ ఇంటరాగేషన్

**మొదటిపేజీ తరువాయి..**

ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై ఈనెల 26న సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ జరుగనుంది. ఇప్పటికే కోర్టులో వాదనల సందర్భంగా కవితను తీహార్ జైల్లో విచారించామని కోర్టుకు సీబీఐ తెలిపింది. అయితే పిటిషన్‌పై రిప్లై కాపీ ఇవ్వలేదు. దీనిపై రిప్లై ఇవ్వాల్సిన అవసరం లేదని సీబీఐ తెలిపింది. అటు కవిత తరఫున రాణా, మోహిత్ రావు వాదనలు వినిపించారు. సీబీఐ తమకు రిప్లై కాపీ ఇవ్వలేదని కవిత తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సీబీఐ విచారణపై శనివారం సాయంత్రం 5:30 గంటలకు ఆర్డర్ వచ్చిందని తెలిపారు. అయితే కవితను 6వ తేదీన మధ్యాహ్నం 12:30 గంటలకే సీబీఐ విచారించిందని చెప్పారు. ఆర్డర్ రాకుండానే సీబీఐ విచారణ జరిపిందని కవిత తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. ముందుగా విచారించాలంటే మరోసారి అప్లికేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని జడ్జి సూచించారు. దీంతో 26వ తేదీన వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని సీబీఐ చెప్పింది. ఈ క్రమంలో ఈ కేసు తదుపరి విచారణను కోర్టు ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు వాయిదా వేసింది.

## దేవుడి ఫోటోతో కాదు.. మోడీ ఫోటోతో రండి

**మొదటిపేజీ తరువాయి..**

మండిపడ్డారు. బీఅర్ఎస్, బీజేపీలవి మోసపు హామీలని పొన్నం ప్రభాకర్ దుయ్యబట్టారు. ఇకపోతే డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఉన్నచోట్ల కాంగ్రెస్ ఓట్లు ఆడగదని.. ఇందిరమ్మ ఇండ్లు ఉన్నచోట బీఆర్ఎస్ ఓట్లు అడగవద్దంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. మంత్రి కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు పొన్నం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. కాంగ్రెస్ పార్టీ వాగ్దానం ఇస్తే ఎట్టి పరిస్థితుల్లోనైనా పక్కాగా అమలు చేసి తీరుతుందని చెప్పారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులతో తెలంగాణలో 17 ఎంపీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్లలో కేసీఅర్, వినోద్ కుమార్ కరీంనగర్ పార్లమెంటుకు ఏం చేశారో చెప్పాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. బండి సంజయ్ మతపరమైన అంశాలు కాకుండా ప్రజలకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఎన్నడూ కారులోంచి కాలు కింద పెట్టని వినోద్ కుమార్... ఇవాళ మార్నింగ్ వాక్ పేరుతో ఓటర్లను ప్రజలను మోసం చేస్తున్నారని పొన్నం విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, అప్పుడే పేదల కష్టాలు తీరుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ పార్లమెంటు స్థానానికి పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం అందరం కలిసి కృషి చేస్తామని చెప్పారు. కొండగట్టు అంజన్న సన్నిధి నుండే ఎన్నికల పోరును ప్రారంభిస్తున్నానని తెలిపారు. బండి సంజయ్, వినోద్ కుమార్ లు అబద్ధాల ప్రచారం మానుకొని నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని హితవు పలికారు.బీజేపీ ఎంపీ బండి సంజయ్ పై తీవ్ర విమర్శలు చేశారు. నరేంద్రమోదీ ఫోటో పెట్టుకుని ఎన్నికలకు వెళ్ళే దమ్ముందా బండి సంజయ్? అంటూ ప్రశ్నించారు.

# జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

**- కలెక్టర్ శశాంక**




**రంగారెడ్డి (వెలుతురు):** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ శశాంక జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండుటెండల్లోనూ ఎంతో నియమ నిష్ఠలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు నిర్వర్తించడం గొప్ప విషయమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో జీవించాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నెల రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ముస్లిం సోదరులు, అదే స్ఫూర్తితో గురువారం నాటి ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ను కూడా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.

# రాజకీయ వేదికలపై నుంచి 'అసత్యాల వెల్లువ'

**బిజెపిపై రాహుల్ విమర్శ**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10(వెలుతురు):** కాంగ్రెస్ మేనిఫెస్టోపై 'ముస్లిం లీగ్ ముద్ర' ఉందని బిజెపి పదే పదే ఆరోపిస్తుండడంతో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. దేశాన్ని విభజించాలని చూసిన శక్తులతో ఎవరు చేతులు కలిపారో చరిత్ర సాక్షిగా ఉందని ఆయన అన్నారు. రాజకీయ వేదికలపై నుంచి 'అబద్ధాలు




వల్లె వేయడం' ద్వారా చరిత్ర మారదని రాహుల్ స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరు అని, భారత్‌ను సదా సంఘటితం చేసిన కాంగ్రెస్ ఒక వైపు ఉందని, దేశాన్ని విభజించే యత్నం చేసినవారు రెండవ వైపు ఉన్నారని ఆయన 'హిందీలో 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. దేశాన్ని విభజించాలని కోరుకున్న శక్తులతో చేతులు కలిపి, వారికి బలం ఇచ్చినది ఎవరో, దేశ సమైక్యత, స్వాతంత్ర్యం కోసం పోరాడింది ఎవరో చెప్పేందుకు చరిత్ర సాక్షి అని రాహుల్ పేర్కొన్నారు."క్విట్ ఇండియా ఉద్యమం'సమయంలో బ్రిటిష్ వారి పక్కన ఎవరు నిలబడ్డారు? భారతీయ జైళ్లు కాంగ్రెస్ నాయకులతో నిండిపోయినప్పుడు దేశాన్ని విభజించిన శక్తులతో రాష్ట్రాల్లో ప్రభుత్వాన్ని ఎవరు నడిపారు?' అని ఆయన అడిగారు. రాజకీయ వేదికలపై నుంచి 'అసత్యాలు వల్లె వేయడం' ద్వారా చరిత్ర మారదని రాహుల్ అన్నారు.

# భవిష్యత్తును చూసి ఆస్వాదించాలనుకుంటే భారత్‌కు రండి

**భారతదేశ అభివృద్ధి ప్రయాణంపై అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ప్రశంసలు**

**న్యూఢిల్లీ/వాషింగ్టన్ ఏప్రిల్ 10(వెలుతురు):** మనదేశ అభివృద్ధి ప్రయాణంపై అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ప్రశంసలు కురిపించారు. ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని



కొనియాడారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. " మీరు భవిష్యత్తును చూసి ఆస్వాదించాలనుకుంటే అందుకోసం పనిచేయాలనుకుంటే భారత్‌కు రండి. ఈ దేశంలో అమెరికా దౌత్య కార్యాలయానికి నాయకత్వం వహించే గొప్ప అవకాశం నాకు దక్కినందుకు గర్వపడుతున్నా" అని గార్సెట్టి తెలిపారు. భారత్‌తో భాగస్వామ్య బంధానికి అమెరికా ఎంతో విలువనిస్తుందని, తెలిపారు. " మేం ఇక్కడికి పాఠాలు బోధించేందుకు రాలేదు. నేర్చుకోవడానికి వచ్చాం" అంటూ ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహనను నొక్కి చెప్పారు.భారత్, అమెరికా మధ్య బంధం కొత్త శిఖరాలకు చేరుకుందని అగ్రరాజ్య జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ అన్నారు. సాంకేతికత, భద్రతతో పాటు ఇతర రంగాల్లో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతోందని వైట్‌హౌస్ మీడియా సమావేశంలో తెలిపారు. అమెరికా గడ్డపై ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర కేసులోభారతీయుడిపై అభియోగాలు రావడం, ఇరు దేశాల మధ్య బంధంపై ప్రభావం చూపించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల వేళ సలివాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల ఈ కేసుపై ఢిల్లీ లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి మాట్లాడుతూ దర్యాప్తునకు భారత ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.

# యాపిల్ పరికరాల ఉత్పత్తి కేంద్రంగా భారత్..

**రూ.14 బిలయన్ డాలర్ల మార్కెట్‌కు చేరువ**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10 (వెలుతురు):** భారత్‌లో యాపిల్ ఐఫోన్ల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు బ్లూమ్ బర్గ్ నివేదిక వెల్లడించింది. బుధవారం వెలువడిన ఈ నివేదికలోని వివరాల ప్రకారం.. 2023లో భారత్‌లో యాపిల్ సంస్థకు చెందిన ఐఫోన్ల ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. ఆ ఏడాది సుమారు 14 బిలియన్ల డాలర్ల ఖరీదైన ఐఫోన్లను భారత్‌లో తయారు చేశారు. ఇది గతంతో పోల్చితే రెండింతలని అధికారులు చెబుతున్నారు.అయితే చైనాపై యాపిల్ కంపెనీ దృష్టి సారించకపోవడం వల్ల భారత్ లో యాపిల్ ఉత్పత్తి జోరు పెరిగినట్లు తెలుస్తోంది. మన దేశంలో సుమారు 14 శాతం యాపిల్ ఉత్పత్తులు జరుగుతున్నట్లు బ్లూమ్ బర్గ్ వెల్లడించింది. అంటే ప్రపంచవ్యాప్తంగా 7 యాపిల్ పరికరాలు ఉత్పత్తి అయితే అందులో ఒకటి భారత్‌లోనే తయారవుతుందన్నమాట. భారత్‌లో ఉత్పత్తి పెంచడం వల్ల ఇన్నాళ్లూ చైనాపై ఆధారపడ్డ యాపిల్ సంస్థ ఇప్పుడు ఆ దేశంపై తన అవసరాన్ని తగ్గించుకుంటోంది.







# మెదక్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే సంక్షేమ రాజ్యం

**బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఇద్దరూ దొంగలే**

**కేసీఆర్ పదేళ్లలో కానిది 100 రోజుల్లో చేశాం**

**మంత్రి కొండా సురేఖ**

**పటాన్‌చెరువు, (వెలుతురు న్యూస్):** పటాన్‌చెరులోని రామచంద్రాపురంలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్త లను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే సంక్షేమ రాజ్యం వస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదన్నరేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే చేసి చూపిందని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాల కారణంగా మేడిగడ్డ ప్రాజెక్టులో పగుళ్లు ఏర్పడి నీళ్లు నిల్వ






చేయలేని పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కట్టిన ప్రాజెక్టులను చూసి బిఆర్ఎస్ బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భూ కబ్జాలకు పాల్పడిన భూ బకాసురు డు అని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, చెరుకు శ్రీని వాస్‌రెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొల్లూరి నరసింహారెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ వినయ్‌గౌడ్, ఎంపీపీ రవీందర్ గౌడ్, బొల్లారం మున్సిపల్ చైర్మన్ అంతిరెడ్డి గారి అనిల్ కుమార్, పీసీసీ మెంబర్లు, బ్లాక్ కాంగ్రెస్, మండల ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు శ్రీశైలం, రవీందర్, నారాయణరెడ్డి, ఎన్ఎస్‌యుఐ సభ్యులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, మహిళా కాంగ్రెస్ సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు

**ఎక్కడైనా సమస్య ఏర్పడితే సత్వరమే పరిష్కరించాలి**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

**రంగారెడ్డి (వెలుతురు):** తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఒకవేళ ఎక్కడైనా సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, వేసవి కాలం ముగిసి, వర్షాలు వచ్చే వరకు తాగునీటి సరఫరాను అనునిత్యం నిశితంగా పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయిలో తాగు నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని అన్నారు.

వార్తా పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక , నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్క రించేందుకు తీసుకుంటున్న చర్యలు , నీటి పునరుద్ధరణ వివ రాలు తెలియజేయాలని అన్నారు. తాగు నీటికి సంబంధించి ప్రజలు ఎక్కడ కూడా ఆందోళనలు చేయాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలని సీఎస్ తెలిపారు.

ప్రతి జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, క్షేత్ర స్థాయిలో వచ్చే ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి క్రమం తప్పకుండా సమాచారం సేకరించాలని అన్నారు.

పట్టణాలలో ఏర్పడిన నూతన కాలనీలు, చివరి ఆవాస ప్రాంతాలు తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, పట్టణాలలో, గ్రామాలలో తాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సిఎస్ సూచించారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను సత్వరం



పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, తాగునీటి సరఫరాను ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు.

వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధి కారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సిఎంఆర్ రా రైస్ డెలివరీ పై కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ సూచించారు.

యాసంగి ధాన్యం కొనుగోలు అంశాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధర పై పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం జరుగుతుందని, ధాన్యం కొనుగోలు అంశంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే త్వరితగతిన సంబంధిత రైతుకు చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలకు కనీస మౌలిక సదుపాయాల కల్పన పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకుని రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మత్తులు తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

పాఠశాలలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ నియమించాలని , పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి పాఠశాలలో అవసరమైన పనులు పాఠశాలలు ప్రారంభం అయ్యే లోపు పూర్తి చేయాలని సీఎస్ సూచించారు.

వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, ఉపాధి హామీ పనుల నిర్వహణ సమయంలో కార్మికులకు అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అన్నారు .

వడ గాల్పులు వీస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అత్యవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని, బయటకు వస్తే అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వడ గాల్పులు గురైన వ్యక్తులను వెంటనే అవసరమైన ప్రథమ చికిత్స చేసి సమీప ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు,డిపిఓ సురేష్ మోహన్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ల అవగాహన సమావేశం

**రంగారెడ్డి (వెలుతురు):** రంగారెడ్డి జిల్లా, GHMC హయత్‌నగర్ సర్కిల్, మన్సూరాబాద్ డివిజన్, ప్రగతినగర్‌లో నిర్వహించబడింది. పై ఫోటో O/O జిల్లా నుండి జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి పద్మజా రమణను చూపుతోంది. కలెక్టరేట్ రంగారెడ్డి జిల్లా ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోస్ (టాస్కా), రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీ కె. మధుసూదనరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సమావేశాన్ని ఆదర్శ సీనియర్ సిటిజన్స్ అసోస్ సహకారంతో నిర్వహించారు. , అధ్యక్షులు శ్రీ బి. వీరా రెడ్డి మరియు కార్యదర్శి శ్రీ ఇ సత్యన్నారాయణ. శ్రీమతి బి. సుజని జిల్లా బాలల అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి కూడా సమావేశంలో ప్రసంగించారు. ప్రగతినగర్‌లోని సీనియర్ సిటిజన్లు ఓటింగ్ శాతాన్ని మెరుగుపరచడానికి క్రెడిట్ స్కోర్ మరియు బ్యాంక్ వడ్డీకి లింక్ చేయడం వంటి చర్యలను ప్రతిపాదించారు. అలాగే ఓటర్ల జాబితాలోని నకిలీ పేర్లను తొలగించేందుకు ఐరిస్ రికగ్నిషన్ సిస్టమ్‌తో ఓటర్ల కార్డును అనుసంధానం చేయాలని సూచించారు. పోలింగ్ అధికారి అనుమతితో సీనియర్ సిటిజన్లకు (60 ఏళ్లు పైబడిన వారు) ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయబడతాయి.

85 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న



వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్లు మరియు మంచాలకు పరిమితమైన లేదా కదలలేని వ్యక్తులు, అలాంటి వ్యక్తులకు ఇంటి ఓటింగ్ అందించబడుతుంది. అటువంటి వ్యక్తులు లేదా వారి సంరక్షణ ఇచ్చేవారు సూచించిన చివరి తేదీలోగా బూత్ స్థాయి పోలింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకుంటారు. 85 ఏళ్లు పైబడిన వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్లు మరియు నడవలేని వారు ముందస్తు దరఖాస్తుతో పోలింగ్ అధికారులు రవాణా మరియు చక్రాల కుర్చీని అందిస్తారు. ప్రగతినగర్‌తోపాటు సమీపంలోని పన్నెండు కాలనీలకు చెందిన వృద్ధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సంపాదకీయం..

## మోడీ గ్యారెంటీ అంటే జైలుకు పంపడమేనా!

మోడీ గ్యారెంటీ అంటే...విపక్ష నేతలను జైళ్లకు పంపించడమేనని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు సత్యదూరం కాదు. జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, కేజ్రీవాల్ అరెస్ట్ తరవాత విపక్షాల్లో కొంత భయం వచ్చింది. అయితే తప్పులు చేయనిదే ఇడి, సిబిఐ ఏమీ చేయలేవని తెలుసుకోవాలి. అలాగే చట్టాలకు తాము అతీతం అన్న భ్రమలను పాలకులు వీడాలి. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ విషయంలో ఇదే వ్యాఖ్య చేసింది. సిఎం అయినంత మాత్రాన అవినీతి కేసుల్లో తప్పించుకోలేరని, అందిరిలాగే సిఎంకు కూడా చట్టం వర్తిస్తుందని తెలిపింది. అవినీతి చర్యలకు పాల్పడే వారు ఎంతటి ఉన్నతస్థానంలో ఉన్నా శిక్షకు గురి కావాల్సిందే. జగన్, కెసిఆర్ విషయంలోనూ అవినీతి కేసులను తవ్వి తీయాల్సిందే. అలాగే విపక్షాలు కూడా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అప్పులు చేసి, ఆస్తులు కూడబెట్టామని ప్రగల్భాలు పలుకుతున్నాయి. వేలకోట్ల అక్రమంగా సంపాదించి వ్యక్తిగత ఖజానాను నింపుకుంటున్నాయి. తమ ముందున్న అన్ని మార్గాలను ఇందుకు వేదికగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఇందకు ప్రత్యక్ష ఉదాహరణ తెలుగు రాష్ట్రాలని చెప్పవచ్చు. తెలంగాణను లూటీచేసి, అప్పుల పాలు చేసిన కెసిఆర్ అధికారం కోల్పోవచ్చు గాక..చేసిన నష్టం పూడ్చడ మెలా అన్నది కూడా ముఖ్యమే. ఎపిలో ఇంతకంటే దారునమైన పరిస్థితితులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రాంతీలయ పార్టీల నేతలు చేస్తున్న అక్రమాలను నిలదీసేదెవరన్నదే ముఖ్యం. నిలదీయడమే కాదు.. అప్పులను ఎలా కడతారు..ఎవరు కడతారన్నది కూడా ముఖ్యమే. అధికారం అనుభవించి, అప్పులు చేసిన వారు జవాబుదారీ తనం లేకుండా పోతే ఎలా? ఇకపోతే ప్రతిపక్షాలను వెంటాడే ముందు అధికార పక్షంలో అవినీతి జలగలను కూడా వదిలించాలి. అప్పుడే మోడీ చర్యల నిజాయితీ తెలుస్తుంది. ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్య వ్యవస్థను సృష్టించడం సాధ్యం కాదు. తెలంగాణలో కెసిఆర్ కూడా ఇలాగే చేసి దెబ్బ తిన్నారు. విపక్ష కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను అణగదొక్కితే తమకు తిరుగులేదని భావించారు. కాంగ్రెస్ ముక్త భారత్ కోసం మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం వేయని ఎత్తులు లేవు. ఆర్థికంగా ప్రతిపక్షం పీకనొక్కడం ద్వారా కాంగ్రెస్ ముక్త్ భారత్' అన్న మోడీ 'కల' నెరవేర్చు కునేందుకు పన్నాగం పన్నుతూనే ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రూపాయి పుట్టకుండా చేశారు. ఖాతాలను స్తంభింప చేశారు. దేశంలో అధికార పక్ష నేతల నుంచి కార్పొరేట్ సంస్థల అధి నేతల వరకు ఎంతో మంది పన్నుఎగవేత దారులున్నారు. అంతెందుకు నిన్నగాక మొన్న నీరవ్ మోడీ ఆస్తులు వేలానికి లండన్ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇలా పన్నులు ఎగవేస్తున్న నేతల చిట్టా తీయాలి. మన దేశానికి చెల్లించాల్సిన పన్ను బకాయి లెంతగా ఎగవేశారన్నది కూడ ఆపారిపోయిన వారి విషయంలో లెక్కలు వేయాలి. దేశం వదిలి పారిపోయిన విజయ్ మాల్యా లాంటి వారిని ఎందుకు ఇంక ఉపేక్షిస్తున్నామో తెలుసుకోవాలి. కార్పోరేట్ కంపెనీటలకు పన్నులు మాఫీ చేయడం వంటి చర్యలు సహించరానదిగా భావించాలి. అలాంటి వారిని వదిలేసి దేశంలో అనేకులపైన దాడులు చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు జరిమానాలు విధిస్తూ, నోటీసులు మీద నోటీసులు జారీ చేయడం దేనికి సంకేతం? అంటే..మమతా బెనర్జీ చెప్పినట్లుగా విపక్షాలను బొక్కలో తోయమడే తమ లక్ష్యమని నిరూపించుకుం టున్నాని అనుకోవాలి. 370 సీట్లు గ్యారంటీ అంటూ మోడీ లెక్కలు వేయడం వెనకా ఈ కుట్ర దాగివుందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మొత్తంమీద కాంగ్రెస్‌కు సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను స్తంభింప చేసింది. ఎన్నికలు జరగనున్న సమయంలో ఇలా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాలు జప్తు చేయడం అంటే ఆ పార్టీని ఆర్థికంగా నిస్తేజం చేయడమే. అంటే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ నాయకుల పర్యటన కోసం కనీసం రైలు టికెట్లు కొనే స్థితిలో కూడా లేకుండా చేయాలని మోడీ ప్రభుత్వం కుట్రగా ఉందిన రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు గమనార్హం. లెక్కలు చూపడంలో కాం గ్రెస్ అలస్యం చేసిన మాట వాస్తవం. అయితే పద్దతి ప్రకారం, చట్టం ప్రకారం కాగ్రెస్‌పై చర్యలు తీసుకుని ఉంటే విమర్శలు రావు. 2017-18 నాటి లెక్కలు చూపనందుకు కూడా కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేశారని రాహుల్ తెలిపారు. నిజానికి రాజకీయ పార్టీలు ఆదాయం పన్ను లెక్కలు కరెక్ట్‌గా చూపాలి. లెక్కలు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలి.

ఈ విషయంలో కాంగ్రెస్ పొరపాటు చేసిందనే అనుకున్నా బ్యాంకు ఖాతాలు జప్తు చేయించడానికి ఎన్నుకున్న సమయం ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత తీవ్రమైన చర్య తీసుకోవడం వెనక విపక్షాలను ఎన్నికల సమయంలో ఆర్థికంగా దెబ్బచేయాలన్న కుట్ర దాగి ఉందను కోవడానికన్నా మించిన కారణం ఏమీ కనిపించడం లేదు. ప్రజాస్వామ్యం గొంతునొక్కడానికే తమ బ్యాంకు ఖాతాలు జప్తు చేశారని కాంగ్రెస్ ఆక్రోశిం చింది. కాంగ్రెస్ విషయంలోనో, వామపక్షాలపైనో ఈ దుర్నీతికి పాల్పడిందని సరిపెట్టుకోవడానికి వీల్లేదు.

తప్పు చేసిన వారిని శిక్షించండంలో వెనకాడవద్దు. ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారందరూ తీవ్రంగా పట్టించు కోవలసిన అంశమిది. ఎన్నికల బాండ్లలో బీజేపీ బండారం బయట పడిన వెనువెంటనే కేంద్రం కాంగ్రెస్‌పై ఆదాయ పన్నుశాఖ ను ఉసిగొల్పిందన్న విమర్శలూ ఉన్నాయి. ఎన్నికల ముంగిట లెక్కా పత్రం,హద్దూ పద్దూ లేని జరిమానాలు విధించి ప్రతిపక్షాలను ఎన్నికల ప్రచారం కూడా చేసుకో నీయకుండా ముందే ముందరి కాళ్లకు బంధాలు వేస్తోంది. మరో వైపు జార్ఖండ్ సీఎం సోరెన్, ఢిల్లీ సీఎం కేజీవ్రాల్‌లను అరెస్టు చేయడం,ఇతరులను దర్యాప్తుల పేరుతో వేధించడం, ఇదంతా గమనిస్తే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కమలదళం వేస్తున్న ఎత్తుగడలుగా భావించాలి. చట్టం అందరికీ ఒకేలా ఉండాలి. అందరినీ ఒకేలా చూడాలి. అధికార, విపక్షం అన్న విభేదాలు అస్సలు రాకూడదు. అవినీతి విషయంలో కూడా అందరినీ ఒకే గాటన కట్టాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం మనగులుగుంది.



## సుప్రభాత స్నేహం - సంతులిత సమ్మోహనం

- శ్రీతేజ కలం

సకలం సద్భావం
సతతం సంబరం !!

సంభావ్యం సశేషం
సునిశితం సమున్నతం !!

సర్వం సస్యశ్యామలం
సువిశాలం సంవిధానం !!

సద్గుణం సంతులితం
సులోచనం సంబోధనం !!

స్థిమితత్వం సుచరితం
స్థితప్రజ్ఞ తత్త్వం సంకల్ప మోక్షం !!!



- శశికాంత్ మెంచు
(91)789-316-9944

# ధరల పెరుగుదలను అరికట్టాలి

ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించ లేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మీద పెరగలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించివేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగుతోంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. అప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకోగలం. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరుతోంది. ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడానికో, వారి

బకాయిలను మాఫీ చేయడానికో వినియోగిస్తోంది. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ వుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. టోకు ధరల సూచి జనవరి 2021తో పోల్చితే జనవరి 2022 నాటికి 13 శాతాన్ని దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు



ముందు అంచనా వేసినట్టు 9.2 శాతం కాకుండా 8.9 శాతమే ఉండబోతుందని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఒమిక్రాన్, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజా ఉదాహరణాలు.

ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారులమీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది.

దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది.

# ఆటపాటలే పిల్లలకు గెలుపు బాటలు

కోపం, ఆవేశం, బాధ లాంటివి కలిగినా అవన్నీ ప్రక్కనపెట్టి సర్దుకొని ఆటలు ఆడవ లసినదేనని, గెలుపు ఓటములు సహజమని, ఎవరూ నేర్పకుండానే వారికి అలవడుతాయి. ప్రతి ఆటకు వేరువేరు నియమాలు ఉంటా యని, వాటిని తప్పకుండా పాటిస్తేనే ఆటలు ఆడగలమని అప్రయత్నంగానే చిన్నారులు నేర్చుకుంటారు. మార్కెట్‌లో తక్కువ ధరలో దొరికే మెదడుకు మేత ఆటలు, పజిల్స్ తయారు చేయడం, సుడోకు నింపడం, రూబిక్ క్యూబ్ కలపడం, తికమక ఆట వస్తువులు, కలర్ బ్రిక్స్ లాంటివి చిన్నారులకు అందుబా టులో ఉంచి నేర్పించడం వల్ల సమయాన్ని సద్వినియోగ పరుచుకుంటూ ఏకాగ్రతను పెంచుకోగలుగుతారు.

వేసవి సెలవులు అంటే చిన్నారులకు ఎంతో ఇష్టం. ఎంత సేపూ మొబైల్ ఫోన్లలో గేమ్స్, టివిలో సినిమాలు కాకుండా చిన్నారులకు ప్రత్యేకంగా ఏమైనా నేర్పించవచ్చని ఆలోచించండి. తల్లిదండ్రులారా మీ పిల్లలకు ప్రత్యేక, వినూత్న ఆలోచనలు కలిగేలా ప్రోత్సహించండి. 'బాల్యపు ఆనందాలను వేసవి సెలవుల్లో ఇంట్లో తల్లిదండ్రులు, పెద్దలు చిన్నారులకు అందించడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా పూర్వప్రాథమిక విద్య నేర్చుకొనే పిల్లల నుండి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే వయసున్న చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం ఎంతైనా అవసరం. కాబట్టి ఈ రెండు నెలలు ప్రణాళిక బద్ధంగా చిన్నారులతో గడుపుచు వారికి ఆనందాన్ని, విజ్ఞానాన్ని అందించండి. దీనికి మీరు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాల్సి అవసరం ఏమి లేదు. మీ ఇంట్లో మీ పిల్లలతో ఆడుతూ%శా% పాడుతూ నేర్పించవచ్చు.

పిల్లల్లో చదువుతో పాటు సృజనాత్మకత పెంచడానికి వివిధ ప్రక్రియలు పెంపొందించవచ్చు. బొమ్మలు వేయడం నేర్పాలని అనుకుంటే కలర్ పెన్సిల్స్, క్రేయన్స్, కొన్ని వాటర్ కలర్స్ ఉంటే చాలు. నచ్చిన బొమ్మ గీయడం, గీతలతో బొమ్మలు, నమూనాలు, సున్నాలతో బొమ్మలు, రంగులు వేయడం, వస్తువులను చూసి బొమ్మలు గీయడం, మట్టితో బొమ్మలు, అగ్గిపుల్లను అతికిస్తే బొమ్మ, చేతి గాజు ముక్కలతో బొమ్మలు, ఇసుక అంటించి బొమ్మలు వేయడం, పప్పులు, ధాన్యాలు అతికించి బొమ్మలు, పెన్సిల్ చెక్కతో బొమ్మలు ఇలా ఇంట్లో ఉన్న రకరకాల పదార్థాలతో, వ్యర్థాలతో ప్రతి దానికీ అర్థాన్ని కల్పిస్తూ నేర్పించ వచ్చు. ఇలా చేయడం వల్ల చిన్నారుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. దీని వల్ల మంచి ఆలోచన విధానం పెరిగి, తమ తోటి పిల్లలతో వారు రూపొందించిన చిత్రానికి కథ, మాటలు అల్లి వారి భాషలో వ్యక్తీకరిస్తారు. మనము ఊహించిన దాని కంటే వినూత్నంగా వారు వాటి గురించి చెప్పగలుగుతారు.

ఇంకా మిగిలిన సమయాల్లో పిల్లలకు భారత, భాగవత, రామాయణ, పంచతంత్ర కథలు చెప్పండి, వారితో తిరిగి చెప్పించండి. ఇలా చేయడం వల్ల వారిలో ధారణశక్తి పెరిగి స్పష్టంగా మాట్లాడడం, తప్పులు లేకుండా, భయం లేకుండా మాట్లాడడం అలవాటు అవుతుంది. సుమతీ శతకం, వేమన శతకం లాంటి శతకాల నుండి నీతి పద్యాలు నేర్పించండి. వారు వినేలా, తిరిగి చెప్పేలా చూస్తే వారు ఉత్సాహంగా నేర్చుకుంటారు. రాగయుక్తంగా పాడడం వల్ల వారు పాటలు పడడం అంటే ఇష్టపడే అవకాశం ఉంది. చిన్నారులు ఒకసారి ఇటు వైపు ఆలోచించడం మొదలు పెడితే ఇక వారికి కాలమే సరిపోదు. మీరు కేవలం పరిశీలకులుగా మాత్రం ఉంటే చాలు. ఇలా చేయడం వల్ల వారిని ఉన్నతులుగా ఎదగడానికి అవకాశం కల్పించిన వారు అవుతారు. అంతేకాక చిన్నారులను అన్ని రంగాల్లో ప్రోత్సహించిన వారు కూడా అవుతారు.

మీ తీరిక వేళల్లో ఇంట్లో కూర్చొని 'మరుగున పడనున్న' గ్రామీణ ఆటలను నేర్పించవచ్చు. పులి మేక, పచ్చీసు, గవ్వలాట, అష్ట చెమ్మ, కచ్చకాయలు, కైలాసం లాంటి ఆటలు ఆడే విధానం



ఒకసారి నేర్పిస్తే వారు ఆడుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల ఆట నియమాలు, గెలుపు ఓటములు సమంగా స్వీకరించడం, గెలవడానికి ప్రయత్నించడం నేర్చుకుంటారు. ఆటలాడుతూ పెరిగిన పిల్లలు ఓటమికి అతిగా కుంగిపోవడం గాని, ఒక్క గెలుపుతో ఇక చెయ్యాల్సింది లేదన్నట్టు ఉండడం గాని చెయ్యరు. ఆటలలో ప్రతి చిన్న వ్యక్తిగత విజయం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతు, చదువులలో నెమ్మదిగా ఉండే పిల్లలకు తన నైపుణ్యానికి జట్టులో లభించే గుర్తింపు వల్ల ఆత్మగౌరవం పెరిగి చదవడంలో ఆసక్తి పెంచుకుంటాడు.

ఇంట్లో ఉండే చిత్తు పేపర్స్‌తో పాము, తరాజు, పంచపాల, తుపాకీ, జల్లెడ, చొక్కా, కేమెరా, గులాబీ పువ్వు, పూలబుట్టి, రాకెట్, పడవ, కత్తి పడవ, తల, ఇల్లు లాంటి ఎన్నో రకాల బొమ్మలు తయారు చేయడం కూడా నేర్పించవచ్చు. దీనికి మీరు కేవలం అతికించడానికి గమ్, కొన్ని రంగు కాగితాలు, పాత దినపత్రికలు అందుబాటులో ఉంచితే చాలు. మీరు ఊహించని బొమ్మలు కూడా తయారు చేసి మీకు బహుమతిగా ఇస్తారు. పిల్లల్లో సహజంగా ఉన్న తెలివి తేటలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అందుకే మీ పిల్లలకు మీరు మంచి నడవడికతో పాటు సృజనాత్మకత పెంచే అన్ని సహజసిద్ధ ఆటలు, పనులు నేర్పించండి.

కోపం, ఆవేశం, బాధ లాంటివి కలిగినా అవన్నీ ప్రక్కనపెట్టి సర్దుకొని ఆటలు ఆడవలసినదేనని, గెలుపు ఓటములు సహజమని, ఎవరూ నేర్పకుండానే వారికి అలవడుతాయి. ప్రతి ఆటకు వేరువేరు నియమాలు ఉంటాయని, వాటిని తప్పకుండా పాటిస్తేనే ఆటలు ఆడగలమని అప్రయత్నంగానే చిన్నారులు నేర్చుకుంటారు. మార్కెట్‌లో తక్కువ ధరలో దొరికే మెదడుకు మేత ఆటలు, పజిల్స్ తయారు చేయడం, సుడోకు నింపడం, రూబిక్ క్యూబ్ కలపడం, తికమక ఆట వస్తువులు, కలర్ బ్రిక్స్ లాంటివి చిన్నారులకు అందుబాటులో ఉంచి నేర్పించడం వల్ల సమయాన్ని సద్వినియోగ పరుచుకుంటూ ఏకాగ్రతను పెంచుకోగలుగుతారు. నాటి కాలంలో పిల్లలకు అన్నం తినిపించాలంటే ఇంట్లో నుండి చిన్నారులని వాకిట్లోకి లేదా ఆరుబయటకు తీసుకు వెళ్లి చందమామను చూపించడమో లేదా పాట పాడుతూ ప్రకృతి దృశ్యాలు చూపిస్తూ గోరుముద్దలు తిని పించేవారు. కానీ నేటి కాలంలో అలా జరగడం లేదు. ఆకాశాన్ని, ప్రకృతిని చూపించే తీరికా లేదు. పాట పాడుతూ తినిపించేటంత ఓపిక లేదు.

అందుకు వారు ఎంచుకున్న మార్గం 'పిల్లల చేతిలో సెల్ ఫోన్ పెట్టడం పిల్లవాడి నోట్లో ముద్ద పెట్టడం' అనే టెక్నిక్‌ను వాడుకున్నారు. తల్లిదండ్రులకూ కావలసింది పిల్లవాడు తినడం మాత్రమే. పిల్లవాడికి కావలసినది మొబైల్ ఫోన్ మాత్రమే. అసలు పిల్లవాడు ఏమి చేస్తున్నాడో, ఏమి తింటున్నాడో, ఎంత తింటున్నాడో ఎవరికీ తెలియదు. ఈ పద్ధతికి అలవాటైన పిల్లలు సెల్ ఫోన్ చేతిలో పెట్టి బొమ్మలు చూపితే గానీ అన్నం తినము అనే స్థాయికి చేరుకున్నారంటే వారిని ఏ స్థాయికి తీసుకు వచ్చామో తల్లిదండ్రులు గమనించాలి.

అందుకే చిన్నారులతో ఎక్కువ సమయం గడుపుచు, కొత్త కొత్త విషయాలు నేర్పిస్తూ, సృజనాత్మకత పెరిగేలా వివిధ ప్రక్రియలు నేర్పిస్తూ ఈ వేసవి సెలవులు ఉపయోగించుకొని ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం మీ చేతిలోనే ఉందని గుర్తిస్తారని, నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులని, అలాంటి ఉత్తమ పౌరులుగా మీ చిన్నారులను తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను.

# రైతు సంక్షేమం లక్ష్యంగా..

రైతు సంక్షేమం కోసం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసారని నిజామాబాద్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేసిన ఘతన కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. కానీరైతులను ఆదుకునేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని అన్నారు. అందుకే ధర్నాలతో తమ నిరసనను తెలియచేస్తున్నామని అన్నారు. ధాన్యం పండించిన రైతులను ఆదుకోని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో చేపట్టిన రైతు సంక్షేమకార్యక్రమాల వల్ల ధాన్యం దిగుబడులు పెరిగాయన్నారు. కానీ ఇప్పుడు పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరంను వృథా ప్రాజెక్టుగా చూపి పబ్బం గడుపుకోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రె లు పంపిణీ చేశారన్నారు. అన్ని వర్గల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు చేసి అమలు చేశారని వివరించారు. గోదావరి నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ లో నింపి అక్కడి నుంచి వివిధ ప్రాంతాల రైతులకు సాగునీరు అందించారని అన్నారు. ఇలా చేయడం వల్లనే ధాన్యం దిగుబులు పెరిగాయన్నారు. బిఆర్ఎస్ ఆందోళనలతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. ఇప్పటికే తమ ఆందోళనతలో రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టులను నిర్మించడంతో ధాన్యం దిగుబడులు పెరిగాయని అన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతీ వరి గింజను తక్షణం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ



మొండి వైఖరికి ప్రజలు,రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు

**- మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



**మేడిపల్లి వెలుతురు:** రంజాన్ పర్వదినం (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముస్లిం సోదరసోదరీమణులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల మాసం క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ,క్షమ,దయ,ఉపకారం, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటూ ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక ప్రార్థనలు, దానధర్మాలు చేస్తుంటారన్నారు.తెలంగాణ సమాజం గంగా, జామునా తహజీబ్" మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## రజక సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ..

**శేరిలింగంపల్లి, వెలుతురు:**
శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో రజక సంగం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చాగంటి అశోక్ తోపాటు డివిజన్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్ నేతతో కలిసి స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ రజక సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందు సాంప్రదాయం ప్రకారం ఉగాది పర్వదినం నుండి నూతన పంచాంగం కార్యక్రమంలో భాగంగా క్యాలెండర్ అవిష్కరించడం శుభపరిణామం అన్నారు. చాకలి ఐలమ్మ పోరాట ప్రతిమను ప్రతి ఒక్క రజక సంగం నాయకులు అలవర్చికొని పేద రజక కుటుంబాలకు అండగా నిలవాలని అన్నారు. రజక సంగం సభ్యులకు తన సహాయ సహకారాలు ఎల్లపుడు ఉటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరి చిన్నోల శ్రీను, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు శ్రీను రజక, ఎం వెంకటయ్య, నరసయ్య, ఆంజనేయులు, బంగారయ్య, జంగయ్య, ఎస్ వెంకటయ్య, తిరుపతయ్య నారాయణ, గోవింద్, వెంకటయ్య, మల్లేష్, సాయి, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
## ఉగాది సంబరాలు

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఏప్రిల్10:**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటలో బుధవారం రోజున మల్లినాధసూరి తెలుగు శాఖ మరియు జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట వారి సంయుక్తంగా ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి.హెచ్ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సంవత్సరం ప్రకృతి కొత్తదనం




నింపుతూ నూతనత్వం పంచుతుందని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో సిద్దిపేట బడిపిల్లల పుస్తక పరిచయం జరిగింది సుమారు 30 మంది సిద్దిపేట కవులు మరియు కళాశాల విద్యార్థులు కవితాగానం చేశారు ఉగాది పచ్చడితొ షడ్రుచులు అస్వాదించారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెళ్ళి రాజమౌళి ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలుగు విభాగం అధ్యక్షులు మహేందర్ మహేందర్ రెడ్డి కవులు మాడుగుల మురళీధరశర్మ పప్పుల రాజిరెడ్డి శ్రీనివాస్ బస్వ రాజ్ కుమార్ శివకుమార్ సరస్వతీ లక్ష్మీ జలజారాణి మాధవీలత సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.


## ఎండిన ఎకరం వరి పొలం

**చిన్నగూడూర్ వెలుతురు న్యూస్:**
చిన్నగూడూరు మండలంలోని మన్నెగూడెం గ్రామంలో రైతు మానంపల్లి చంద్రయ్య కు చెందిన ఒక ఎకరం వ్యవసాయ భూమి నీటి ఎద్దడి వలన నీరు లేక వరి పూర్తిగా ఎండిపోవడం



జరిగింది, రైతు చంద్రయ్య మాట్లడుతూ తన పొలం పెట్టుబడికి అప్పు చేసి మరి వరి వేసానని తనకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు




### పీర్జాదిగూడలో ఆర్ వి ఫౌండేషన్
# చలివేంద్రాలు ప్రారంభం...

**ఆర్ వి ఫౌండేషన్ ద్వారా తుంగతుర్తి రవి సేవలు ఆదర్శనీయం**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్**

**తన వంతు సామాజిక బాధ్యతగా ప్రతి సంవత్సరం చలివేంద్రాలు ఏర్పాటు**

**ప్రజలందరూ చలివేంద్రాలు వినియోగించుకోవాలని తుంగతుర్తి రవి విజ్ఞప్తి**

**మేడిపల్లి, వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యంలో ప్రజల, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చలివేంద్రాలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు,మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాలు ప్రారంభించారు.ఈ



సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఆర్ వి ఫౌండేషన్ స్థాపించి తుంగతుర్తి రవి పేదలకు ఉచిత వైద్య శిబిరాలు,రక్తదాన శిబిరాలతో పాటు ప్రతి సంవత్సరం మండువేసవిలో పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో రద్దీ ఎక్కువగా ఉండే అనేక ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి వేలాదిమంది ప్రజల దాహార్తిని తీర్చుతున్నాడని అందుకు తుంగతుర్తి రవిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు.అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ తన వంతు సామాజిక బాధ్యతగా గత కొన్ని సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రద్దీ ఎక్కువగా ఉండే మేడిపల్లి పోలీస్ స్టేషన్,హనుమాన్ టెంపుల్ విష్ణుపురి కాలనీ,కార్య సిద్ధి వినాయక ఆలయం మేడిపల్లి, పీర్జాదిగూడ కమాన్ మొత్తం నాలుగు ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని,వాహనదారులు,ప్రజలు ఉద్యోగులు,చలివేంద్రాలను వినియోగించుకోవాలని ఈ వేసవిలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తుంగతుర్తి రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమం లో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు,యువజన నాయకులు,మహిళా నాయకులు, కార్పొరేషన్ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి

**తెలంగాణలో 70 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంట్ స్థానం కూడ ఇవ్వని కాంగ్రెస్ పార్టీనీ ఓడిస్తాం**

**పార్లమెంటు సీట్లలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం**

**ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం**

**ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ**

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 10 (వెలుతురు):**
బుధవారం రోజున శంకర్ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ఎమ్మార్పీఎస్ శంకర్ పల్లి మండల అధ్యక్షులు బండ్లగూడెం శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, కార్యదర్శి బ్యాతల శివ శంకర్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ నాని భాను ప్రసాద్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సీట్లలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే, రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. దళితుల్లో 20% గళ్ళ మాలలకు రెండు సీట్లు కేటాయించి, ఊరుకొక్కరు లేని బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చిన రేవంత్ రెడ్డి, దళితుల్లో 75% గల మాదిగలకు ఒక్క సీటు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ లో మల్లు కుటుంబానికి, గడ్డం వివేక్ కుటుంబానికి ఉన్న విలువ మాదిగ జాతికి లేదని, అందుకు కేటాయించిన స్థానాలే సాక్ష్యమని అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానానికి స్థానికేతరుడై ఉన్నా, స్వయంగా డిప్యూటీ సీఎం సోదరుడైనా, తాను కేబినెట్ హోదాతో ఢిల్లీలో తెలంగాణ ప్రత్యేక ప్రతినిధిగా నియమించబడి ఉన్నా కూడా మల్లు రవి గారికే అట్టి స్థానాన్ని కేటాయించడం, అదే విధంగా పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో రెండు నియోజకవర్గాల నుండి ఒకే కుటుంబం నుంచి గడ్డం వివేక్, గడ్డం వినోద్ లు చెన్నూరు, బెల్లంపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నా ,మళ్లి ఆ




పార్లమెంట్ స్థానాన్ని వారి కుటుంబానికే ఇప్పించుకోవడం, వరంగల్ లో మాదిగలను రాజకీయంగా అడుగడుగునా అనిచివేసిన రాజకీయ అవకాశవాధి, ఊరికి ఒక్కరు లేని బైండ్ల కులానికి చెందిన శ్రీహరి గారికి ఇవ్వడం చూస్తుంటే అది అర్థం అవుతుందని గుర్తుచేశారు. తెలంగాణ లో నాలుగు శాతం జనాభా కలిగిన తమ రెడ్డి కులానికి ఆరు సీట్లను కేటాయించుకున్న రేవంత్ రెడ్డి, 12 శాతం జనాభా గల మాదిగలకు స్థానమే లేకుండా చేయడం, 50% జనాభా కలిగిన బీసీలకు 2 స్థానాలే కేటాయించి ద్రోహం చేశాడని, కాంగ్రెస్ ముమ్మాటికీ ప్రజా ప్రభుత్వం కాదు, రెడ్ల, మాలల ప్రభుత్వమేనని అన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయని ఇదే ధోరణిని అవలంబిస్తే కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని రెండు పార్లమెంట్ స్థానాలను మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎం పి స్థానాల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి గారి వైఖరికి నిరసనగా పది రోజుల పాటు నిరసన కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు చన్నగల్ల నర్సింలు మాదిగ, ఎం ఎస్ ఎఫ్ శంకర్ పల్లి మండల కన్వీనర్ డప్పు శ్రీకాంత్ మాదిగ, కో కన్వీనర్ మనోజ్ మాదిగ, మొయినాబాద్ మండల కన్వీనర్ కొండిగారి మహేందర్ మాదిగ, కో కన్వీనర్ రాజు మాదిగ, చేవెళ్ల మండల అధ్యక్షులు ఊరెంట ప్రవీణ్ కుమార్ మాదిగ, ఉపాధ్యక్షులు చేవెళ్ల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యగా మారిన వాహనాల పార్కింగ్..

**ఫిర్యాదు చేసిన పట్టించుకోని జిహెచ్ఎంసి అధికారులు..**

**ఫిర్యాదు దారుడు హైకోర్టును ఆశ్రయించడంతో ఆగమేఘాల మీద తొలగింపు చర్యలు..**


**ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి.. ఏకాంత్ గౌడ్**



**శేర్లింగంపల్లి, వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజక వర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని ముంబై జాతీయ ప్రధాన రహదారి వెంబడి రోడ్డును కబ్జా చేసి ర్యాంపు లను నిర్మించి వాహనాలను పార్కింగ్ చేస్తూ నిత్యం ట్రాఫిక్ ను సృష్టిస్తున్న పలు షాపింగ్ మాల్స్‌పై చర్యలు తీసుకోవాలని శేర్లింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్ గతంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, కూకట్‌పల్లి జిహెచ్ఎంసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఈ విషయంపై మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంతో నిత్యం ప్రజలు ట్రాఫిక్ సమస్యతో నరకయాతన అనుభవిస్తుం డడంతో ఏకాంత గౌడ్ ఈనెల మూడోవ తేదీన హైకోర్టును ఆశ్రయించారు.

అయితే బుధవారం హైకోర్టు వాదనలు ఉన్నందున కూకట్ పల్లి జిహెచ్ఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పలు షాపింగ్ మాల్స్ అక్రమంగా ఆక్రమించుకొని ఏర్పాటు




చేసుకున్న అక్రమ పార్కింగ్‌ను ఆగమేఘాల మీద తొలగించారు. ఈ సందర్భంగా ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించే దిశగా ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారుడు ఏకాంత్ గౌడ్ అధికారులను కోరారు.



## రంజాన్ సంద్భంగా ముస్లింలకు పండ్లు పంపిణీ చేసిన టీపీసీసీ సెక్రెటరీ గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఏప్రిల్10:**
ఈద్–ఉల్–ఫితర్ (పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపి టీపీసీసీ సెక్రెటరీ గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి పండ్లు పంపిణి చేసారు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. మరో సారి జిల్లా ప్రజలకు ముస్లిం సోదర సోదరిమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు
ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ముందస్తుగా ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఎంతో భక్తి శ్రదలతో ఉపవాసం ఉంటారని ఆ అల్లా ఆశీస్సులతో సిద్దిపేట ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు
ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి హుస్సేన్ అమీర్ సల్మాన్ షకీల్ తదితరులు పాల్గొన్నారు

## పేదింటి అమ్మాయి వివాహానికి అండగా నిలిచిన ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మెన్ చక్రధర్ గౌడ్

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఏప్రిల్10:**
ప్రార్ధన చేసే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నానుడికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ అధినేత చక్రధర్ గౌడ్ మరియు వర్గల్ మాజీ ఉప సర్పంచ్




పసుల రమేష్ ముదిరాజ్ అమ్మా నాన్నను కోల్పోయిన పేదింటి అమ్మాయి వివాహానికి అన్నలుగా అండగా నిలబడుతున్నారు. చక్రధర్ గౌడ్ ఆర్ధిక సహాయంగా 10,000/- రూపాయలు అందజేయగా రమేష్ ముదిరాజ్ పుస్తె మట్టెలు అందజేసారు.

## అల్లా దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**ముస్లిం సోదర సోదరిమణులకు జిల్లా ప్రజలకు పవిత్ర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు**

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఏప్రిల్10:**



ఈద్–ఉల్–ఫితర్ (పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో ఒకటి రంజాన్ అని కొనియాడారు చెడు భావనల్ని అధర్మాన్ని ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు ఈ పవిత్ర మాసం దీక్షలు ప్రేమ దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని అన్నారు లౌకికవాదం మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని పేర్కొన్నారు. కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణ వారిదిన్నారు ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. మరో సారి జిల్లా ప్రజలకు ముస్లిం సోదర సోదరిమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు

## నిరుపేద కుటుంబాలకు బియ్యంతో పాటు ఆర్ధిక సహాయం అందించిన ఫార్మర్ ఫ్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్

**సిద్దిపేట రూరల్, వెలుతురు ఏప్రిల్10:**
సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామానికి చెందిన ఒక నిరు పేద కుటుంబంలోని గనగోని అశోక్ గౌడ్ దశదిన కర్మా చెయ్యడానికి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం వారి గ్రామస్థులు చక్రధర్ గౌడ్ కి తెలియజేయగా బుదవారం 1కింటాలు బియ్యం 10000 రూపాయిల ఆర్థిక సహాయం





అందజేసారు సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన ఒక నిరు పేద కుటుంబంలోని పైవర్ధ సత్తయ్య గురువారం రోజున మరణించిగా వారి దశదిన కర్మా చెయ్యడానికి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం వారి గ్రామస్థులు చక్రధర్ గౌడ్ కి తెలియజేయగా 1కింటాలు బియ్యం 5000 రూపాయిల ఆర్థిక సహాయం అందజేసిన ఫార్మర్ ఫ్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్





## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది ఉత్సవం...

**కరీంనగర్, వెలుతురు, ఏప్రిల్ 10:**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కరినగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని రెవెన్యూ క్లబ్ లో ఏర్పాటుచేసిన ఉగాది ఉత్సవ వేడుకల కార్యక్రమంలో ముందుగా గర్రెపల్లి మహేశ్వర శర్మ పంచాంగ శ్రవణ కార్యక్రమం జరిగింది. అనంతరం ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనిధి చిట్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ హనుమండ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ఉగాది అంటే తెలుగు వారి పండుగ, తెలుగు సంవత్సరం ఈరోజు నుండే ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యంగా రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ ను ప్రారంభించిన పరమ పూజనీయ డాక్టర్ హెడ్గేవార్ జన్మదినం, ఉగాది నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉగాది ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషకరంగా ఉందన్నారు. ముఖ్య వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ మాట్లాడుతూ ఉగాదిలో ఉగ అంటే నక్షత్ర గమనమని, సృష్టి ఆరంభమైన దినమే ఉగాది అన్నారు. కొత్త సంవత్సరం అంటే విదేశీయులు చెప్పిన ప్రకారం జనవరి ఒకటి కానీ , డిసెంబర్ 31కి జనవరి ఒకటికి ఎలాంటి మార్పు జరగదన్నారు. చైత్ర శుద్ధ పాడ్యమిన ప్రకృతిలో మార్పు వస్తుందని, అందుకే ఉగాది మనందరికీ నూతన సంవత్సరమన్నారు . ఇప్పటివరకు కలియుగం ప్రారంభమై 195 కోట్ల సంవత్సరాలు పైన పూర్తయిందని, ఈ సంవత్సరాన్ని కలియుగాబ్ది5126 గా చెప్పబడుతుందన్నారు. అలాగే హిందువుల కలియుగ ఆరాధ్య దైవమైన శ్రీరాముడు 14 సంవత్సరాల అరణ్యవాసాన్ని పూర్తిచేసుకుని అయోధ్యకు బయలుదేరిన రోజన్నారు. ఉగాది పండుగకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవరావ్ బలరామ్ హేడ్గే వార్ పుట్టింది ఈ ఉగాది పర్వదినం రోజు నేన్నారు. 99 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఆర్ఎస్ఎస్ అనే చిన్న విత్తనం నేడు ఎన్నో శాఖలుగా విస్తరించిందన్నారు. 1925 సంవత్సరంలో నాగ పూర్‌లో విజయదశమి రోజున డాక్టర్ జి కేవలం ఆరుగురు సభ్యులతో రాష్ట్రీయ స్వయంసేక సంఘ్ ను ప్రారంభించారని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 65 వేల శాఖలు ఉన్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్గనైజేషన్‌గా ఏర్పడిందని, ప్రముఖ హిందూ జాతీయవాద సంస్థగా ఎదిగిందన్నారు. ఆర్ఎస్ఎస్ సామాజిక సంస్థగా క్రియాశీలంగా ఉందని,2025 విజయదశమి నాటికి ఆర్ఎస్ఎస్ వందేళ్ళ ప్రస్థానానికి చేరుకుంటుందన్నారు. దేశం కోసం, భరతమాత సేవ కోసం పనిచేయాలనుకునే అభిమానం ఉన్న ప్రతి ఒక్కరూ ఆర్ఎస్ఎస్ లో చేరవచన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు డాక్టర్ రమణాచారి, బాలరాజు, హనుమండ్ల శ్రీనివాస్, దక్షిణా మూర్తి, భాను, సందీప్ , శంకరయ్య, గికూరి శ్రీనివాస్, రాజశేఖర్, సుధాకర్, పుల్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరిమణులకు రంజాన్ శుభాకాంక్షలు

### బుడ్డ భాగ్యరాజ్ గారు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మెదక్ జిల్లా వెలుతురు ఏప్రిల్ 10:**
ఈద్–ఉల్–ఫితర్ (పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో ఒకటి రంజాన్ అని కొనియాడారు. చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు. ఈ పవిత్ర మాసం దీక్షలు , ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు.
గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని అన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని పేర్కొన్నారు.
కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణ వారిదిన్నారు. ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని



ఆయన ఆకాంక్షించారు. మరో సారి ముస్లిం సోదర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.





## బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జోగిని చిట్టిబాబు, అడిచర్ల రాజు

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 10:**
భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కరీంనగర్ జిల్లాకు చెందిన జోగిని చిట్టిబాబు, అడిచర్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి ఆనంద్ గౌడ్ నియామకపు ప్రకటన విడుదల చేశారు. తమపై నమ్మకంతో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ కు , నియమకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకులందరికీ ఈ సందర్భంగా చిట్టిబాబు, అడిచర్ల రాజు లు ధన్యవాదాలు తెలియజేశారు. బిజెపి, ఓబిసి మోర్చా బలోపేతానికి , జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గెలుపు కోసం తమ వంతు శయ శక్తుల కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు.

## బడుగుల ఆశాజ్యోతి పూలే...

జ్యోతిరావు పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో గోవిందరావు చిన్నాబాయి దంపతులకు జన్మించాడు వెలుగును సూచిస్తూ అతని తల్లిదండ్రులు అతనికి జ్యోతి అనే పేరు పెట్టారు. ఆ రోజుల్లోనే కుమారునికి చదువు చెప్పించాలనే ఆలోచన తండ్రి గోవిందరావుకి కలిగింది.
అయితే బ్రాహ్మణేతరులకు విద్య నేర్పే సంప్రదాయం ఆనాడు లేదు దింతో పూలే తండ్రి తన కుమారుడికి విద్యా నేర్పించడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
తండ్రి పట్టుదలతో పూలే క్రమంగా మరాఠీ భాష పై పట్టు సాధించారు.పగలు తండ్రికి పనిలో సహాయపడుతు రాత్రిళ్లు గుడ్డి దీపం వెలుగులో చదువుకునేవాడు,క్రమంగా ఆయన ఇంగ్లీష్ భాషపై కూడా పట్టు సంపాదించాడు.

నాటి ఆచారాల ప్రకారం ఆయనకు 13 ఏళ్ళకే వివాహం జరిపించారు. వధువు పుణె వద్ద ఉన్న కవాడీ గ్రామానికి చెందిన సావిత్రిబాయి పెళ్లి సమయానికి ఆమె వయస్సు ఎనిమిదేళ్లు.

నిమ్న వర్గాల బాలికల కోసం పూలే పాఠశాల స్థాపించినప్పుడు ఆయన ఉపాధ్యాయునిలు దొరక్క ఇబ్బంది పడుతున్నాడని గమనించిన ఆమె తను స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారారు.

అప్పట్లో మహారాష్ట్ర లో వచ్చిన కరువు కాటకాలల్లో ఆమె చేసిన సేవలు అపూర్వం. రాష్ట్రంలో ప్లేగువ్యాధి ప్రబలిన రోజుల్లో రోగులకు సేవ చేస్తూ ఆ ప్లేగు వ్యాధికే ఆయె బలయ్యారు.

జ్యోతిరావ్ పూలే జీవితంలో జరిగిన ఓ ఘటన ఆయన జీవన గమనాన్ని మార్చేసింది ఓ బ్రాహ్మణ స్నేహితుని ఆహ్వానాన్ని మన్నించి వివాహానికి వెళ్లిన పులేకి ఊరేగింపులో బ్రాహ్మణులు తప్ప ఎవరు ఉండకూడదన్న మాటలు సూలల్లా తాకాయి.

అది వర్ణవ్యవస్థపై ఆయన తిరుగుబాటుకు నాదిగా మారింది. శూద్రులు పడుతున్న బాధలు ఎదుర్కొంటున్న అవమానాల నుంచి వారిని విముక్తి చేయాలని పూలే సంకల్పించారు. తాను బ్రాహ్మణికానికి వ్యతిరేకం కానీ బ్రాహ్మణులకు కాదని ప్రకటించి అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా జ్యోతిరావుపూలే పోరాటం చేశారు.

విద్యా ద్వారానే నిమ్న వర్గాలకు అణచివేత నుంచి విముక్తి లభిస్తుందన్న దృఢ విశ్వాసంతో ఆయన వారి విద్యా వ్యాప్తి కోసం కృషి చేశారు. విద్యా సంస్థల స్థాపనకు సహృదయులైన



విదేశీయుల నుంచి సైతం విరాళాలు సేకరించేవారు.

ఆయన సేవలకు విదేశాలలో కూడా ప్రచారం లభించడంతో బ్రిటిష్ ప్రభుత్వం 1852లో పూణే కళాశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా ఆయనను సన్మానించింది. ఒకానొక సమయంలో అగ్రవర్ణాల వారు ఆయన పేరు ప్రఖ్యాతులు చూసి ఓర్వలేక ఆయనను హత్య చేయించడానికి కూడా ప్రయత్నించారు. అయితే వాటన్నింటి నుంచి ఆయన విజయవంతంగా బయటపడ్డారు.

ఆ రోజుల్లోనే ఆయన సతీసహగమనం రూపుమాపడానికి కృషి చేశారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు ఆయనను ఆదర్శంగా తీసుకొని తరువాత కాలంలో ఆంధ్ర రాష్ట్రంలో కందుకూరి వీరేశలింగం,ఉన్నవ లక్ష్మీనారాయణ లాంటివారు వితంతు వివాహాలను జరిపించారు.

వితంతువుల కోసం పూలే ఒక శరణాలయం కూడా స్థాపించారు. దేశంలోని విద్యారంగ పరిస్థితులను పరిశీలించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం 1882లో ఇండియన్ ఎడ్యుకేషన్ కమిషన్‌ను నియమించింది.దాని అధ్యక్షుడు హంటర్ పేరిట.

హంటర్ కమిషన్ గా పేరుపొందింది. పూలే ఆ కమిషన్ ముందుకు వెళ్లి తన వాదన వినిపించారు.

రైతుల నుంచి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఆ డబ్బును కేవలం అగ్రవర్ణాల చదువు కోసం మాత్రమే ఖర్చు పెడుతోందని విశ్వవిద్యాలయాలు అగ్రవర్ణాల వారికి మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఆరోపించారు.

బ్రాహ్మణ పురోహితులు లేకుండా ఆత్మ సాక్షిగా,పెద్దల సాక్షిగా,నిరాడంబరంగా దండలు మార్చుకొని పెళ్లి చేసుకునే పద్ధతిని ఆరోజుల్లోనే ప్రవేశపెట్టిన మానవతావాది జ్యోతిరావ్ పూలే.

జ్యోతిరావ్ పూలే రాసిన పుస్తకాలన్నీ సమాజ అభివృద్ధికి దోహదపడ్డాయి. ఆయన రచనల్లో ముఖ్యమైనవి గులాంగిరి అమెరికాలో బానిసత్వాన్ని రద్దు చేసిన లింకన్ తో ఉత్తేజితుడై ఆయన గులాంగిరి ని రచించారు.

శాస్త్రాలు,పురాణాల్లో పేర్కొన్న విషయాల గురించి ముఖ్యంగా అవతారాల గురించి జ్యోతిభా దీనిలో తీవ్రంగా చర్చించి బ్రాహ్మణుల మీద తిరుగుబాటు జెండా ఎగురవేశారు. జ్యోతిబాపూలే జీవితం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ లాంటి అనేక మందికి ఆదర్శంగా నిలిచింది.

పూలే గడిపిన సాధారణ జీవితం సత్యనిష్ఠగరిష్ఠత అహింసాయుత విధానాలు సత్యాగ్రహం మార్గాలు తనను ఎంతో ప్రభావితం చేశాయని గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్నారు. దీన్నిబట్టి పూలే ప్రభావం ఆయనపై ఎంతగా ఉందో తెలుసుకోవచ్చు. విశ్వవిద్యాలయాల్లో కుల రక్కసి విజృంభిస్తున్న నేపథ్యంలో జ్యోతిరావు పూలే బోధనలు, రచనల అవసరం సమాజానికి ఇప్పుడు ఎంతైనా ఉంది.

**(ఏప్రిల్ 11 మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా..)**



**- గుండమల్ల సతీష్ కుమార్**
**9493155522.**





# కరీంనగర్ డంపింగ్ యార్డులో భారీ అగ్ని ప్రమాదం

**దట్టమైన పొగలతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పరిసర ప్రాంతాల ప్రజలు.**

**ఫైరింజన్‌లతో మంటలర్పిన అదుపులోకి రాని మంటలు, పొగ**

కరీంనగర్, వెలుతురు, ఏప్రిల్ 10:
నగరపాలక సంస్థకు చెందిన డంప్‌యార్డులో మళ్లీ అగ్గి రాజుకుంది. గత మూడు రోజులుగా కరీంనగర్ డంపింగ్ యార్డ్ లో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వెలువడి తీవ్రమైన వాయు కాలుష్యం చోటు చేసుకుంటోంది. దీంతో పరిసర ప్రాంతాలైన ఆటోనగర్, కోతిరాంపూర్, లక్ష్మీనగర్, హనుమాన్ నగర్, గణేష్ నగర్, కమాన్ ఏరియా, గాయత్రినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ప్రజలు ఉక్కిరిబిక్కి రవుతున్నారు. ఎండ వేడికితోడు డంప్‌యార్డు నుంచి దట్టమైన పొగ వస్తుండడంతో ఊపిరాడక విలవిలలాడు తున్నారు. కళ్ల మంటలతో ఇబ్బందులు పడుతున్నారు. మానేరు ఒడ్డున ఉన్న డంప్‌యార్డు బైపాస్ రోడ్డుకు ఆనుకుని



ఉండడంతో పెద్దపల్లి బైపాస్‌పై వెళ్లే ప్రయాణికులకు రోడ్డు కనబడని పడని విధంగా పొగ కమ్మేసింది. డంప్‌యార్డులో మంటలు అంటుకోవడంతో నగరపాలక సంస్థ అధికారులు, పాలకవర్గం ఫైర్ ఇంజిన్ లను పంపి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా విఫలం చెందినట్లు స్థానికులు చెప్తున్నారు.

**పట్టని ప్రజారోగ్యం.. మొద్దు నిద్ర వీడని బల్దియా**

ఏ కాలమైనా డంపింగ్ యార్డ్ తో సమస్యలు వస్తున్నప్పటికీ , పట్టించి పట్టించుకోనట్లుగా అధికారుల తీరు ఉంటోంది. చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేస్తే జరిమానా విధించే బల్దియా అధికారులు, డంపింగ్ యార్డ్ నిర్వహణ పై నిర్లక్ష్య వైఖరి వహించడం విమర్శలకు తావిస్తోంది.
బయో మైనింగ్ పేరిట యంత్రాన్ని కొనుగోలు చేసి చెత్తను రీసైక్లింగ్ చెయ్యాలని చూసినా ఆ ప్రయత్నం ఎడారిలో ఒయాసిస్ గా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారాన్ని చూపించాల్సింది ప్రజలు కోరుతున్నారు.






## షాందాసాని ఫౌండేషన్ సహకారంతో వృద్ధులకు, అనాథ పిల్లలకు
# వస్తువులు పంపిణీ చేస్తున్న సంస్థ చైర్మన్ కళ్లెపు శోభారాణి

నర్సంపేట వెలుతురు ఏప్రిల్ 10:
వరంగల్ జిల్లా, నర్సంపేట పట్టణ శివారు స్లమ్ ఏరియాలో షాందాసాని ఫౌండేషన్, షిరిడి సాయి బాబా హాంకాంగ్ వారి సహకారంతో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కళ్లెపు శోభారాణి ఆధ్వర్యంలో ఎలాంటి ఆసరా లేని నిరుపేద వృద్ధులకు దుప్పట్లు మరియు అనాథ పిల్లలకు విద్యా సామాగ్రితో పాటు న్యూట్రిషన్ ఫుడ్, పండ్లు, స్వీట్లు పంపిణి చేయడం జరిగింది.
అనంతరం సంస్థ చైర్మన్ మాట్లాడుతూ షాందాసాని ఫౌండేషన్ షిరిడి సాయి బాబా హాంకాంగ్ వారి సహకారంతో గతంలో కూడా జిల్లాలో పలు ప్రాంతాల్లో పేద వృద్ధులకు, అనాథ పిల్లలకు ఇలాంటి పంపిణి కార్యక్రమాలు విజయవంతంగ నిర్వహించడం జరిగింది. అందులో భాగంగానే ఈ మధ్య కాలంలో నర్సంపేట ప్రాంతంలో సర్వే నిర్వహించిన రిపోర్ట్ షాందాసాని ఫౌండేషన్ వారికి సమర్పించిన పిదప ఈ అవకాశం ఇవ్వడం జరిగింది అన్నారు. షాందాసాని ఫౌండేషన్ షిరిడి సాయి బాబా హాంకాంగ్ వారు భారత దేశ వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలతో పాటు అనేక రకాల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు తమదైన శైలిలో దేశ ప్రజల మన్ననలు పొందుతున్నారు.
ఒక సందర్భంలో భాగంగా మన శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఇలాంటి గొప్ప అవకాశం ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా ఇంత గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహించుటకు మాకు అవకాశం కల్పించిన షాందాసాని ఫౌండేషన్ షిరిడి సాయి బాబా హాంకాంగ్ వారికి హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలువుకుంటున్నామని అన్నారు.
ఈ కార్యక్రమంలో నర్సంపేట మునిసిపాలిటి కౌన్సలార్ కె. సురేష్, పి.మౌనిక, ఎస్.ఏచ్.జి ప్రతినిధులు ఎం. సునిత, ఈ. శ్రవంతి, ఏరియా హెల్త్ అధికారి ఆర్. అన్నపూర్ణ, సంస్థ కో'ఆర్డినేటర్ ఈ.రమేష్ స్థానిక పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# భువనగిరి కోటలో కాంగ్రెస్ జెండా ఎగిరేయండి

**రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయండి : ఎమ్మెల్యే సమక్షంలో సీఎంని కలిసిన నర్సింహా, లింగస్వామి**

వెలుతురు న్యూస్ నారాయణపూర్:
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దంగుల నర్సింహ, ఉప్పల లింగస్వామి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కలిసి అభినందించారు...అనంతరం సీఎం వారితో మాట్లాడుతూ భువనగిరి, మునుగోడు పరిధిలో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుకోసం అత్యధిక మెజార్టీతో మీరంతా కృషి చేయాలని ఆయన అన్నారు.. మండల స్థాయిలో ఉన్న కార్యకర్తలను మునుగోడు స్తాయిలో ప్రతి కార్యకర్తను ప్రలోభేతం చేసి అభ్యర్థి గెలుపు కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు.
ఈ సందర్భంగా ముద్దంగుల నర్సింహ,ఉప్పల లింగస్వామి మాట్లాడుతూ కచ్చితంగా పార్టీకి మా మునుగోడు ఎమ్మెల్యేకి కట్టుబడిగా పనిచేస్తామని పేర్కొన్నారు..గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళికేంద్రంలో ప్రధాని గా రాహుల్ గాంధీని చేయడమే మా లక్ష్యం అన్నారు..







# రాజీవ్ రతన్ పార్థీవ దేహానికి ఘనంగా నివాళులు

రంగారెడ్డి (వెలుతురు):
బుధవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు మాక్ ప్రాజెక్ట్ లోని సీనియర్ ఐపీఎస్ అధికారి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ కీ.శే. రాజీవ్ రతన్ నివాసంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర డిజిపి రవి గుప్తా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక రాజీవ్ రతన్ పార్థీవ దేహానికి పుష్ప గుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు ఆర్పించారు. అనంతరం పార్థీవ దేహని జూబ్లీహిల్స్ మహాప్రస్తానమునకు తరలిం చారు. రాజీవ్ రతన్ మంగళవారం ఉదయం తీవ్ర గుండెపోటుతో మృతి చెందారు.



## తెల్లాపూర్‌లో చలివేంద్రం
# ప్రారంభించిన కాట శ్రీనివాస్ గౌడ్

తెల్లాపూర్ వెలుతురు ఏప్రిల్ 10:
తెల్లాపూర్ మున్సిపాలిటీ తెల్లాపూర్ గ్రామంలోని ఏలియెన్ స్పేస్ స్టేషన్ వద్ద మంధాడ నరేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో వారి తండ్రి స్వర్గీయ మంధాడ రంగారెడ్డి గారి జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రం ను పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారు ప్రారంభించారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్ గారు మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకూ






పెరిగిపోతున్నదని నిత్యం పరిసర ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని, బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

# బోర్వెల్స్‌కు మరమ్మత్తులు చేయండి..

**జలమండలి జనరల్ మేనేజర్ గారికి వినతి పత్రం ఇచ్చిన మహాలక్ష్మి రామన్ గౌడ్**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:
బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ హిమాయత్ నగర్




డివిజన్‌లో ఉన్న బోర్వెల్స్‌ను సరిచేయాలని జలమండలి జనరల్ మేనేజర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేష్, జాకి, మల్లేష్, శేఖర్, హితేష్, జగదీష్, అనీష్, అభిషేక్ పాల్గొన్నారు.

# అంగన్వాడి స్కూల్ పిల్లలకు పండ్లు అందజేత



యాదగిరిగుట్ట వెలుతురు ఏప్రిల్ 10:
భారతీయ జనతా పార్టీ యాదగిరిగుట్ట పట్టణంలో అంగన్వాడి స్కూలు విజిట్ చేయడం అంగన్వాడి స్కూల్ పిల్లలకు పండ్లు పంచడం జరిగినది యాదగిరిగుట్ట సీనియర్ నాయకురాలు బొమ్మగాని రాజమణి, పట్టణ అధ్యక్షురాలు బొడ్డు సుజాత ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షురాలు రంగరేఖ బిజెపి ఉపాధ్యక్షురాలు బోడరాధ గుర్రం వసంత రచ్చ హేమలత మహేశ్వరం సత్తమ్మ ఈ కార్యక్రమం చేయడం జరిగినది.


## హంస ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ శిక్షణ పొందిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్

**హంస ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె చాంద్**

వెలుతురు న్యూస్,రామన్నపేట: యాదాద్రి జిల్లా ఉగాది పండుగ సందర్భంగా రామన్నపేట పట్టణ కేంద్రంలోని హంస ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ లో శిక్షణ పొందిన మధురిమ, మైముదా, శారద, లకు తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ హంస ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కే




చాంద్ శిక్షణ పొందిన మహిళకు ఉగాది పండుగ సందర్భంగా తన వంతు సహాయంగా ఉచితంగా కుట్టు మిషన్ అందజేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీలు తన శ్వాసక్తితో ఎదగాలని మరియు బీద మహిళలకు ఆర్థిక సహాయం చేయుటకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కూనూరు శ్రీనివాస్ ,రాఘవుల కన్నయ్య ,మహమ్మద్ షేక్ లతీఫ్, ఎస్ కృష్ణ, బి రాజు తదితరులు పాల్గొన్నారు.



### శునక జాతులపై నిషేధం ఉత్తర్వులను

# కొట్టేసిన కర్ణాటక హైకోర్టు

**బెంగళూరు, ఏప్రిల్ 10(వెలుతురు):**
కొన్ని శునక జాతులపై నిషేధం విధిస్తూ కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను కర్ణాటక హైకోర్టు బుధవారం కొట్టేసింది. శునక జాతులపై నిషేధం విధించే ముందు సదరు శునకాల ఓనర్లతోపాటు అందుకు సంబంధించిన సంస్థల నిర్వాహకులను సంప్రదించి.. ఆ తర్వాత ఈ నిషేధం విధించారా? అని హైకోర్టు ప్రశ్నించింది. పెంపుడు జంతువులు ఎవరినైనా గాయపరిచినా.. అందుకు బాధ్యత వహించాల్సింది వాటి యజమానులేనని.. వారికి నగదు చెల్లించాల్సి ఉందని ఈ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది.అయితే దేశవ్యాప్తంగా ఇటీవల శునకాల దాడుల చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పశు సంవర్ధక మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. ఈ తరహా శునకాలను పెంచడం కానీ. విక్రయించడం కానీ చేయరాదని సదరు నిపుణుల కమిటీ అభిప్రాయ పడుతూ.. ఆ మంత్రిత్వ శాఖకు నివేదిక అందజేసింది. దీంతో 23 శునక జాతులపై కేంద్రం నిషేధం విధించింది. అందుకు మార్చి 13వ తేదీన రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం సర్క్యులర్ జారీ చేసింది. ఆ సర్క్యులర్‌లో నిషేధం విధించిన పలు శునకాల జాతుల పేర్లను పొందు పరిచింది.

# రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం షాక్

### హోర్డింగ్స్‌పై ప్రచురణ కర్తల పేర్లు తప్పనిసరిగా ముద్రించాలి

**న్యూ ఢిల్లీ ఏప్రిల్ 10(వెలుతురు):**
రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసే హోర్డింగ్స్ విషయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం జాయింట్ డైరెక్టర్ అనూజ్ చండక్ ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల ప్రచార ఖర్చును అంచనా వేయడానికి హోర్డింగ్స్‌పై ప్రచురణ కర్తల పేర్లు తప్పనిసరిగా ముద్రించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇటీవల కాలంలో ప్రచురణ కర్తల పేర్లు లేకుండా ఎన్నికల ప్రచారానికి సంబంధించిన బ్యానర్లు, హోర్డింగ్స్ ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎన్నికల సంఘం రంగంలోకి దిగి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు జరిగే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలి ప్రాంతాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయని అధికారులు తెలిపారు. అలాగే ఎన్నికల




సంబంధిత సామాగ్రి, హోర్డింగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఈసీ సూచించింది. ఛీఫ్ ఎలక్షన్ కమీషనర్ రాజీవ్ కుమార్, జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనూజ్ చండక్ తెలిపారు.ప్రజాప్రతినిధ్య చట్టం 1951 ప్రకారం ఎన్నికల ప్రచారంతో సంబంధం ఉన్న కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లకార్డులు, బ్యానర్లపై ప్రచురణ కర్త పేరు లేకుండా ముద్రించడానికి వీలులేదన్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ప్రభుత్వ ఖర్చుతో రాజకీయ ప్రకటనలు ఇవ్వరాదని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ తమ ప్రకటనలను ముందుగానే సర్టిఫికేషన్ చేయించుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు సూచించారు.

### టెట్ 2024 దరఖాస్తు గడువు

# మరో 10 రోజులు పొడిగింపు

**హైదరాబాద్ (వెలుతురు):**
టెట్ 2024 దరఖాస్తు గడువును పొడిగించింది తెలంగాణ ప్రభుత్వం. బుధవారంతో టెట్ దరఖాస్తు గడువు ముగియడంతో.. దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు మరో అవకాశం కల్పింది. మరో 10 రోజులు గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 20వ తేదీ వరకు గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది విద్యాశాఖ. ఈ నెల 11 నుండి 20వ తేదీ వరకు అప్లికేషన్ ఎడిట్ చేసుకోవడానికి అవకాశాన్ని కూడా కల్పించింది.మంగళవారం సాయంత్రం నాటికి మొత్తం 1,93,135 మంది దరఖాస్తు చేసుకున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. పేపర్ 1కు 72,771 దరఖాస్తులు రాగా..పేపర్ 2కు 1,20,364 వచ్చాయని తెలిపింది. ఇక, టెట్ పరీక్ష మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనుంది. జూన్ 12న ఫలితాలను వెల్లడిస్తారు.




# ఉత్సాహంగా సాగిన 2కె రన్

**ప్రతి ఓటరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**ఓటును మించిన ఆయుధం లేదు...... రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్**

**బుల్లెట్ కన్నా బ్యాలెట్ గొప్పది**

**మే,13 న ప్రతి ఓటరు ఓటింగ్ లో పాల్గొని ఓటు వేయాలి....**

**హైదరాబాద్ జిల్లాఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్**

**హైదరాబాద్,ఏప్రిల్10,(వెలుతురు):**
ఓటును మించిన ఆయుధం లేదని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవా లని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం శేర్లింగంపల్లి జోన్ కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుండి హైటెక్స్ రోడ్ మెటల్ చార్మినార్ వరకు 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో నిర్వహించిన 2కె రన్ ఉత్సాహంగా సాగింది. వివిధ వర్గాల వారు స్వచ్ఛందంగా 2కె రన్ లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతి చాటారు. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ ,ట్రాన్స్ జెండర్లు,యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్స్, సైకిలిస్ట్ అసోసియేషన్స్, పోలీసులు, విద్యార్థిని విద్యార్థులు, పెద్ద ఎత్తున 2కె రన్‌లో భాగస్వాముల య్యారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుండి ప్రారంభమైన 2కె రన్ ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఐ ఓట్ ఫర్ షూర్, ప్రకాశంవంతమైన దేశం కోసం ఓటు వేయాలి అనే నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ వివిధ వర్గాల వారు పరుగులో పాల్గొన్నారు.












ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, స్వేచ్ఛయుతంగా నైతిక ఓటింగ్ చేయాలని సూచించారు. రాష్ట్రంలో 3.30 కోట్ల ఓటర్లు ఉన్నారని, ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనట్లైతే ఓటు వృధా అవుతుందన్నారు. ఒక వ్యక్తికి దేశంలో ఎక్కడైనా ఒకచోట మాత్రమే ఓటు ఉండాలన్నారు. పద్దెనిమిదేళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై క్షేత్ర పరిధి పరిశీలనతో చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. బాధ్యతగల పౌరులుగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని,"సి"విజిల్ యాప్ ను మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి పిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల లోపు విచారణ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2 కె రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోవారిని,చుట్టుపక్కల వారిని తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచాలన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ, బుల్లెట్ కన్నా బ్యాలెట్ పవర్ గొప్పదని, మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు.

హైదరాబాద్ నగరం అన్నింటా ముందున్నా, ఓటింగ్ శాతం లో 50శాతం మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతమైనప్పటికీ, అందరూ చదువుకున్న వాళ్ళు ఉన్నప్పటికీ, ఓటు వేయడంలో నిరాసక్తత చూపుతున్నారన్నారు. ఓటర్ జాబితాలో తమ పేరు ఉన్నది లేనిది చెక్ చేసుకోవాలని, లేనట్లయితే ఈ నెల 15 లోగా ఫారం-6లో దరఖాస్తు చేసుకుని ఓ టు హక్కు పొందాలన్నారు. ఓటు హక్కు ఉన్న అందరూ మే 13న జరుగు పోలింగ్ ప్రక్రియలో పాల్గొని నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు వేయాలని, అదేవిధంగా మిగతా వారిని చైతన్య పరచాలని కోరారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ, శేర్లింగంపల్లి పెద్ద నియోజక వర్గమని, ఏడు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని, ఆదాయం, చదువులో మాత్రమే కాదు, సామాజిక బాధ్యతలో కూడా ముందున్నామని నిరూపించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఓటర్ సర్వీస్ పోర్టల్ లో ఓ టర్లు తమ వివరాలను చెక్ చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసేలా ఇంటిలో, ఆఫీసులలో, బంధువులు, స్నేహితుల వద్ద ఓటు వేయడంపై మాట్లాడి అవగాహన కల్పించి అందరూ ఓటేసేలా చైతన్యం చేయాలని కోరారు.

అనంతరం అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 2 కె రన్ లో టాప్ గా వచ్చిన 5 గురికి మెమొంటోలు అందజేసారు.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిభా సింగ్, శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఏసిపి,ఆయా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా చర్యలు చేపట్టాలి

**జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రఘునాథ స్వామి, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా , ఏప్రిల్ 10(వెలుతురు):**
రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు, ఎండా తీవ్రత ఎక్కువగా ఉండే సమయాలలో నేరుగా సూర్య కిరణాలూ తాకే స్థలాలలో పని చేసే వారు వడదెబ్బకు గురి కాకుండా ఉండేలా నివారణ చర్యలు చేపట్టాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు.

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ లోని వి సి హాల్ లో బుధవారం జాతీయ కార్యక్రమం వాతావరణ మార్పు మరియు మానవ ఆరోగ్యంపై అనే అంశం పై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశానికి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రఘునాథ స్వామితో కలిసి అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు, నేరుగా సూర్య కిరణాలూ తాకే స్థలాలలో పని చేసే వారు వడదెబ్బ కు గురి కాకుండా ఉండేలా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య, విద్య, డిసాస్టర్ మానెజ్మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశు సంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ, కాలుష్య నివారణ, మున్సిపల్ కమీషనర్ శాఖల వారు సమన్వయంతో పని చేయాలన్నారు. వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు కూడళ్ల దగ్గర, పార్కుల వంటి స్థలాల వద్ద చలి వేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి త్రాగు నీటిని, చలి వేంద్రాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. బయటికి వెళ్లే ప్రతి ఒక్కరు తలా పై టోపీ, టవల్ ధరించాలని, ఓ ఆర్ ఎస్ పౌడర్ కలిపిన నీటిని వెంట తీసుకువెళ్లాలని తెలిపారు.

. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను యూ పి హెచ్ సి , పి హెచ్ సి కేంద్రాలకు ఏ ఎన్ ఎం, ఆశ వర్కర్లతో పంపిణి చేయించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికీ శీతల పానీయాలు కాకుండా , మంచి నీళ్లు, ఓ ఆర్ ఎస్ కలిపిన నీళ్లు వెంటనే త్రాగించాలి, నీడ ఉండే ప్రదేశాలలో ఉండేలా చూడాలన్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉండే ప్రదేశాలలో నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ముగాజీవాలకు, పక్షులకు మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. అనంతరం వడ దెబ్బ నుండి రక్షించుకుందాం అనే గోడ పత్రికను అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సాంబశివ రావు, డి ఏ ఓ రేఖ, డి జి డబ్ల్యూ ఓ రేవతి, డి డబ్ల్యూ ఓ కృష్ణ రెడ్డి, మున్సిపల్ కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు








# ఖరీదైన జలపాతం!

జలపాతాలను అడవుల్లోనే చూస్తాం. ప్రకృతి అందించిన అద్భుతాల్లో ఇది కూడా ఒకటి. కానీ చైనాలో ఓ జలపాతం ఉంది. ఏకంగా 108 అడుగుల ఎత్తులో ఉంటుంది. దాన్ని చూడాలంటే దక్షిణ చైనాలోని గీయాంగ్ ప్రావిన్స్‌కి వెళ్లాల్సిందే. చుట్టూరా అడవులు పరుచుకున్న ఎత్తయిన పర్వతాల నడుమ ఆ నగరం ఎంతో అందంగా ఉంటుంది. అయితే ఈ జలపాతం ఉండేది నిజమైన అడవిలో కాదు.... మనుషులు తిరిగే కాంక్రీట్ జంగిల్‌లో ఉంటుంది. 121 మీటర్ల పొడవైన బిల్డింగ్‌లోని 108 అడుగుల ఎత్తులో ఉండే ఈ జలపాతం మానవ నిర్మితం. దీని పేరు



'లీబియన్ ఇంటర్నేషనల్ బిల్డింగ్'.. సిటీలోకి అడుగుపెడితే కూడా అడవిలో తిరిగినట్టు ఉండాలన్న ఆలోచనతో దీన్ని నిర్మించారు. ఈ ఆకాశహర్మ్యంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, విలాసవంతమైన హోటళ్లు, రకరకాల ఆఫీసులు ఉన్నాయి.

ఈ నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతోంది. రీసైకిల్ చేసిన నీటిని నాలుగు భారీ పంపుల ద్వారా పైకి తోడేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఒకసారి నీళ్లను తోడటానికి ఎనిమిది వేల రూపాయలకు పైగా ఖర్చవుతోందట. సాంకేతికతలో ప్రపంచం కన్నా ఒక అడుగు ముందే ఉండే చైనాలో ఉన్న వింతలు విశేషాల్లో ఇది కూడా ఒకటి. ఈ జలపాతం చూడటానికి బాగానే ఉన్నా, దీని నిర్వహణ తలకు మించిన భారం కావడంతో దీన్ని పెద్దగా వినియోగించడం లేదు. ఈ రెండేళ్లలో కేవలం ఆరుసార్లు మాత్రమే ఈ అద్భుతాన్ని చూసే అవకాశం సందర్శకులకు కలిగింది. అయితేనేం భారీ కృత్రిమ జలపాతంగా రికార్డుల్లోకెక్కింది.

# కూల్‌గా సిమ్లా చుట్టేద్దాం...





**వేసవి తాపం నుంచి దూరంగా వెళ్లి, ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకుంటే సిమ్లాను ఎంచుకోండి. ఈ సమయంలో సిమ్లా వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి.**

## ఏం చూడాలి?

**మాల్‌రోడ్ :** సిమ్లాలో ఇది ప్రధాన రోడ్డు. ఇక్కడ అన్ని రకాల వ్యాపార భవనాలుంటాయి. ఇక్కడ కేఫ్‌లు, రెస్టారెంట్‌లు, థియేటర్‌లు టూరిస్టులతో బిజీగా ఉంటాయి. ఈ స్ట్రీట్‌ను తప్పనిసరిగా చూడాల్సిందే.

**వైసెరెగల్ లాడ్జ్ :** ఇది ఒకప్పుడు బ్రిటిష్ వైస్రాయ్ ఆఫ్ ఇండియాకు నివాసంగా ఉండేది. అద్భుతమైన ఆర్కిటెక్చర్ ఆకట్టుకుంటుంది. చరిత్రాత్మకమైన సిమ్లా ఒప్పందం ఇందులోనే జరిగింది. ఇందులో అలనాటి ఫొటోలు, పుస్తకాలు, ఇతర చారిత్రక అంశాలకు సంబంధించిన ఆధారాలను చూడొచ్చు.

**క్రీస్ట్ చర్చ్ :** ఇండియాలో రెండో అతి పురాతనమైన చర్చ్ ఇది. సిమ్లాకు ల్యాండ్‌మార్క్‌గా నిలిచింది. క్లాక్ టవర్, గ్లాస్ విండోస్, పురాతన గ్రంథాలలో నుంచి సేకరించిన విలువైన సమాచారం ఇక్కడ చూడొచ్చు. రాత్రివేళ ఈ చర్చ్ అందాలు కనువిందుచేస్తాయి.

**కల్కాసిమ్లా రైలులో ప్రయాణం :** పర్వతాల మధ్య నుంచి టాయ్ ట్రైన్‌లో ప్రయాణం చేయడం మధురానుభూతిని అందిస్తుంది. 96 కి.మీల ప్రయాణం ఆద్యంతం ఆకట్టుకుంటుంది.

**హిమాచల్ ఎంపోరియం :** స్థానికంగా తయారుచేసే హ్యాండీక్రాఫ్ట్స్‌ను కొనాలంటే ఈ ఎంపోరియంను సందర్శించాలి. చేతి ఉత్పత్తులు తక్కువ ధరలో లభిస్తాయి. ఈ ఎంపోరియం మాల్‌రోడ్‌లో ఉంటుంది.

**హిమాలయన్ బర్డ్ పార్క్ :** ప్రకృతి ప్రేమికులు తప్పక సందర్శించాల్సిన ప్రదేశం ఇది. వైసెరెగల్ లాడ్జ్ ఎదురుగా 2వేల మీటర్ల ఎత్తులో ఉంటుంది.

**సీతారామ్ అండ్ సన్స్:** సిమ్లా వెళితే ఇక్కడే భోజనం చేయాలి. లక్కర్ బజార్‌లో ఉన్న ఈ హోటల్ సిమ్లాలో చాలా ఫేమస్. గత ఆరు తరాల నుంచి వాళ్లు ఈ హోటల్ వ్యాపారంలో ఉన్నారు.

## ఎప్పుడు వెళ్లాలి?

మార్చి నుంచి జూన్ మధ్య : వేసవిలో సిమ్లాలో టెంపరేచర్ 25 డిగ్రీలు ఉంటుంది. జూన్‌లో అత్యధికంగా 30 డిగ్రీల వరకు నమోదవుతుంది.

జూలై నుంచి అక్టోబర్ : వర్షాలు కురిసే ఈ సీజన్‌లో ఆగస్ట్ నెలలో ఎక్కువ చిత్తడిగా ఉంటుంది.

నవంబర్ నుంచి ఫిబ్రవరి : ఈ సమయంలో మంచు కురుస్తూ ఉంటుంది. డిసెంబర్‌లో మంచు అధికంగా కురుస్తుంది.

## ఎలా చేరుకోవాలి?

**విమానంలో :** సిమ్లాకు 22 కి.మీల దూరంలో జబర్‌హట్టి విమానాశ్రయం ఉంది. అయితే కొన్ని కారణాల వల్ల ఇక్కడికి కమర్షియల్ ప్లేన్స్ రాకపోకలు సాగించవు. మరో ఎయిర్‌పోర్టు అంటే చండీఘడ్‌లో ఉంది. సిమ్లా నుంచి దూరం 115 కి.మీ.

**రోడ్డు మార్గంలో:** ఢిల్లీ నుంచి సిమ్లాకు 340కి.మీల దూరం ఉంటుంది. చండీఘడ్ నుంచి 115 కి.మీల దూరం ఉంది. ఈ నగరాల నుంచి బస్సులో సిమ్లా చేరుకోవచ్చు. ప్రైవేటు ట్యాక్సీలు కూడా అందుబాటులో ఉంటాయు.

**రైలులో:** ఢిల్లీ నుంచి కల్కాకు రైలులో చేరుకోవచ్చు. కల్కా నుంచి సిమ్లాకు టాయ్ ట్రైన్ సౌకర్యం ఉంది. ఢిల్లీ నుంచి కల్కా రైల్వే స్టేషన్‌కు రైలు ప్రయాణం సుమారు 4 గంటలు.

## ఏం తీసుకెళ్లాలి?

వేసవిలో సిమ్లా టూర్ ప్లాన్ చేసుకున్నట్లయితే తేలికపాటి కాటన్ దుస్తులను తీసుకెళ్లాలి. సాయంత్రం వేళల్లో ఉష్ణోగ్రతలు బాగా పడిపోతాయు. కాబట్టి లైట్ జాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలి. సన్‌గ్లాసెస్ తీసుకెళ్లడం మరిచిపోవద్దు.

# 'క్లూ' ఇచ్చేస్తుంది!

మీరు ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న వింతలూ, విశేషాలు ఏమిటో తెలుసుకోవాలనుకుంటారు. టూర్‌కు బయలుదేరే సమయానికి ఏది అందుబాటులో ఉందో తెలిస్తే... మీ సమయం, డబ్బు రెండూ వృథా కావు. దీని కోసం మీ ఫోన్‌లో 'క్లూక్' యాప్ ఉండాల్సిందే. ఉదాహరణకు మీరు హైదరాబాద్‌లోని రామోజీఫిలింసిటీ, సాలార్‌జంగ్ మ్యూజియంలను చూడాలనుకుంటే ఈ యాప్‌నుంచే నేరుగా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. 'పర్యాటక స్థలాలు, ప్రత్యేక షోలు, బెస్ట్ ఫుడ్స్ అండ్ మస్ట్ ఈట్స్'... ఇలా విభాగాల వారీగా ప్రాంతాలను ఈ యాప్‌లో విభజించారు. అంతేకాదు, అసలు మీరు టూర్‌కు వెళ్లే సమయానికి ఫలానా ప్రదేశంలో ప్రవేశం ఉంటుందో లేదో కూడా ఇది చెప్పేస్తుంది. విదేశాలకు వెళ్లినప్పుడు కూడా అక్కడి టికెట్లను మన కరెన్సీలోనే బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. సరసమైన ధరలకు హోటల్ గదులను కూడా పొందవచ్చు. గూగుల్, ఐఓఎస్ వినియోగ దారులకు ఈ యాప్ అందుబాటులో ఉంది.



# సోలో జర్నీ... సో హ్యాపీ



- ఒంటరి ప్రయాణాలను ఇష్టపడుతున్న మహిళలు
- ప్రయాణ నిర్ణయాలలో వారిదే అగ్రతాంబూలం
- సెక్యూరిటీ సమస్యే కాదంటూ ఉద్ఘాటన
- సోలో ట్రావెలర్ల కోసం ప్రత్యేక గ్రూప్‌లు
- ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్న కంపెనీలు

ఒంటరిగానా..!? వామ్మో ఇంకేమైనా ఉందా! అసలే రోజులు ఎలా ఉన్నాయి. ఆకతాయిల కళ్లలో పడితే.. మహిళల విషయంలో ఇలాంటి భయాలు చాలా మందికి అనుభవమే. కానీ, ఇటీవలి కాలంలో విడుదలవుతున్న పలు ట్రావెల్ సంస్థల అధ్యయనాలను పరిశీలిస్తే సోలో ఉమెన్ ట్రావెలర్ల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. మరీ ముఖ్యంగా ఢిల్లీ, ముంబై, మన హైదరాబాద్ లాంటి నగరాల్లో.

మహిళల్లో 45 % మంది సోలోగా ప్రయాణించడానికి ఇష్టపడుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 'ఒంటరిగా ఈ ప్రపంచాన్ని చుట్టొచ్చేస్తాం..' అని సవాలు విసురుతున్నారు చాలా మంది. మహిళల ఈ ఆత్మవిశ్వాసమే ప్రయాణ నిర్ణయాలలో 80% వరకూ వారివే ఫైనల్ కావడానికి కారణమవుతున్నాయి. వివాహమైనా, కాకపోయినా, విడాకులు తీసుకున్నా.. ఎలాగైనా సరే ఆమె నాయకత్వంలోనే ప్రయాణ నిర్ణయాలు జరుగుతున్నాయని అధ్యాయాలు చెబుతున్నాయి.

మహిళలు ఒంటరిగా లేదంటే జంటగా అయినా ప్రయాణించడంలో తమ నిర్ణయాలతో ప్రభావం చూపుతున్నారు. అంతేకాదు.. వీరిలో 70 శాతం మంది భారతదేశంలో పలు ప్రాంతాలను తిరిగి వచ్చామని చెబుతున్నారు. ఇటీవలి కాలంలోనే మహిళలు ఒంటరిగా ప్రయాణించటం వేగంగా పెరుగుతుందని మేక్ మై ట్రిప్ మొదలు కాక్స్ అండ్ కింగ్ వరకూ ప్రతి ఒక్క ట్రావెల్ సంస్థ చెబుతోంది. ప్రత్యేకంగా ప్యాకేజీలూ విడుదల చేస్తున్నాయి. ఈ దసరా సీజన్ కోసమూ మహిళలు.. మరీ ముఖ్యంగా ఒంటరిగా పలు ప్రాంతాలను సందర్శించడానికి ఇష్టపడుతున్నారని, గుజరాత్ లాంటి ప్రాంతాలకు బుకింగ్‌లు ఎక్కువగానే ఉన్నాయంటున్నారు నిర్వాహకులు.

## అన్వేషించాలి.. తెలుసుకోవాలి...

వివాహం కాని వారే కాదు... పెళ్లయి మహిళలు సైతం సోలోగా ప్రయాణించడానికి ఇష్టపడుతున్నారు. గతంలో మగవారు సోలోగా ట్రావెల్ చేయడం ఎక్కువగా ఉండేది కానీ ఇప్పుడు మాత్రం మహిళలు వీరితో పోటీపడుతున్నారు. ఎందుకింత మార్పు అని అంటే.. మహిళలు స్వతంత్ర్యంగా ఆలోచించడం పెరగడం, వారి ఆదాయం వృద్ధి చెందడం, ఖర్చు చేయడానికి వెనుకాడకపోవడం కారణాలు. నిజానికి నేటి మహిళలు కెరీర్ పట్ల ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు. ఆఫీసు.. ఇల్లు.. మాత్రమే పరిమితం కావాలని ఎవరూ కోరుకోవడం లేదు. కొత్త ప్రదేశాలను అన్వేషించాలి.


మరింతగా తెలుసుకోవాలనేది ఎక్కువ మంది కోరిక. అదే వారిని సోలో ట్రావెలింగ్ వైపు మొగ్గు చూపేలా చేస్తోంది. దీనికి తోడు సౌకర్యవంతమైన బుకింగ్ ఆప్షన్స్, అత్యుత్తమ భద్రత వంటివి వీరు ధైర్యం చేయడానికి తోడ్పడుతున్నాయి. ఇదే విషయమై ఓ ఐటీ కంపెనీ ఉద్యోగిని వాసంతి మాట్లాడుతూ 'సోలో ట్రావెలింగ్ వల్ల మాకు ఆత్మవిశ్వాసం కలుగుతుంది' అని అన్నారు. లార్వెన్ టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు చెందిన అజయ్ కె రామిడి మాట్లాడుతూ 'ఏదో ఒక ప్రదేశాన్ని చూడడం కాకుండా సాహస యాత్రలను చేయాలని పర్యాటకులు కోరుకుంటున్నారు. సోలో ఉమెన్ ట్రావెల్ అనేది ఇప్పుడు ట్రెండ్‌గా కొనసాగుతోంది.

స్వతంత్రం కోసమే కాదు.. కొత్త అనుభవాల కోసం అన్వేషిస్తున్నారు నేటి మహిళలు. అదే ఈ ట్రెండ్ విస్తరిస్తుండటానికి కారణం' అన్నారు. ట్రావెల్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టాయ్), ఏపీ తెలంగాణా చాప్టర్ చైర్మన్ అయిన అజయ్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కెరీర్‌లో అవకాశాలని అందిపుచ్చుకోవాలంటే మహిళలు పలు ప్రాంతాలను అన్వేషించాల్సిందే అంటున్నారు. 'మాలాంటి మహిళలు వ్యాపార అవసరాల రీత్యా ట్రావెల్ చేయాల్సి వస్తుంది. ప్రతి సారీ తోడుండాలని కోరుకోవడం సాధ్యమయ్యే పని కాదు. బిజినెస్ ట్రావెల్ లేదంటే లీజర్ ట్రావెల్ ఏదైనా ఒంటరి ప్రయాణం మనకి స్ఫూర్తి కలిగిస్తుంది' అన్నారు నగర సోషలైట్ ఉష.

## ప్రయోజనాలెన్నో.. ఆనందమూ అంతే..!

సోలో ట్రావెలింగ్ వల్ల ప్రయోజనాలెన్నో ఉన్నాయని ట్రావెలర్, బ్లాగర్ పద్మిని అంటున్నారు. ఉద్యోగ రీత్యా బెంగళూరులో ఉంటున్న ఆమె సోలో ట్రావెల్ వల్ల ఇతరుల షెడ్యూల్స్‌తో పని చేయాల్సిన అవసరం లేదంటున్నారు. సాధారణంగా ఫ్యామిలీ లేదంటే లేడీస్ సోలో ట్రావెలర్ గ్రూప్‌లలో ఒక్కోసారి సమస్యలు వస్తుంటాయి. సోలో ట్రావెల్ వల్ల ఆఫ్ సీజన్‌లో సైతం ఆనందంగా ప్లాన్ చేసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. నిజానికి ప్రతి మహిళ సోలోగా ప్రయాణించాలన్నది ఇప్పటికే ఈ తరహా ప్రయాణం చేసిన వారి మాట. తమలో ఉన్న అనుమానాలు పోగొట్టుకోవడానికి, జీవితం పట్ల ఓ దృక్పథం ఏర్పరుచుకోవడానికి ఇవి ఉపయోగపడతాయంటున్నారు.

సాధారణంగా ఎంజాయ్ చేయటానికి వయసు పరిమితిలని చూస్తారు చాలామంది. కానీ ఇటీవలి కాలంలో టీనేజర్లు, మిడిల్ ఏజ్ ఉమెన్స్ మాత్రమే కాకుండా సీనియర్ సిటిజన్స్ కూడా లీజర్ టూర్స్‌ని ఇష్టపడుతున్నారని చెబుతున్నారు ట్రావెల్ ఆపరేటర్లు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచీ ఈ ట్రెండ్ పెరిగిందని చెబుతున్నారు రాజ్ ట్రావెల్స్ నిర్వాహకుడు ప్రవీణ్. ఒంటరిగా ప్రయాణించే మహిళలకి భద్రత సమస్య కానే కాదన్నది ఎక్కువ మంది భావిస్తుండటం కూడా ఈ తరహా ప్రయాణాలకి కారణమంటున్నారు.



## సోలో ట్రావెలర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సోలో ట్రావెలింగ్ ఎడ్వెంచర్‌సగా ఉన్నా అది సృష్టించే ఇబ్బందులూ చాలానే ఉంటాయి. సురక్షిత ప్రయాణం కోసం కొన్ని సూచనలు అనుసరించాల్సిందేనని చెబుతున్నారు ట్రావెల్ ఏజెంట్లు.
- మీరు సందర్శించబోయే ప్రదేశం గురించి తెలుసుకోవడంతో పాటుగా అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను ముందుగా తెలుసుకోవడం మంచిది.
- నగదు ఎప్పుడూ ఒకే చోట ఉంచుకోవడం మంచిది కాదు. విలువైన వస్తువులు ఎప్పుడూ విభిన్న ప్రదేశాలలో ఉంచాలి. అంటే ఇన్ సైడ్ పాకెట్ లేదంటే హిప్ పాకెట్, సాక్స్ లాంటి చోట. అనుకోని సంఘటనల్లో ఇబ్బందులను ఇది తొలగిస్తుంది.
- సోలో ట్రావెలర్‌గా వచ్చారని ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడాలి. మీరు ఒంటరిగా ప్రయాణిస్తున్నారనే విషయం తెలియని వ్యక్తులతో పంచుకోకూడదు.
- ప్రతి సారీ మ్యాప్ చూడటం లేదంటే అడ్రసలు అడగడం మంచిది కాదు. హోటల్ రూమ్ నుంచి బయటకు వచ్చేటప్పుడే కాస్త అవగాహన ఉంచుకోవడం అవసరం. మీ స్మార్ట్‌ఫోన్‌లో జీపీఎస్ వాడటం ద్వారా డైరెక్షన్స్ తెలుసుకోవచ్చు.
- అపరిచిత వ్యక్తులు చెప్పే మాటలు త్వరగా నమ్మొద్దు.
- ఇతర ప్రదేశాలకు వెళ్లినప్పుడు తక్కువలో వస్తుందని కాకుండా భద్రత పరంగా మంచి రేటింగ్ ఉన్న హోటల్స్‌లో స్టే చేయడం మంచిది.
- అత్యవసర నెంబర్స్‌ను మీ ఫోన్‌లో సేవ్ చేసుకోవడం మంచిది. ఎలాంటి విపత్కర పరిస్థితిల్లో అయినా అదిమంచి చేస్తుంది.
- లోకల్స్‌తో ఆత్మవిశ్వాసంతో మాట్లాడాలి. మొదటి సారి మీరు రావడమా అని ఎవరైనా అడిగితే కాదని గట్టిగానే చెప్పండి.
- సేఫ్టీ కిట్ వెంట తీసుకువెళ్లడం మరిచిపోవద్దు. వాటిలో పెప్పర్ స్ప్రే, స్విస్ నైఫ్, విజిల్ లాంటివి తప్పనిసరి.



# అజీర్ణం

### అజీర్ణం అంటే ఏమిటి?

డిస్పెప్సియా (అజీర్తి) అని కూడా పిలువబడే అజీర్ణం అనేది, భోజనం సమయంలో ఉబ్బర భావన, భోజనం తర్వాత అసౌకర్యవంతమైన ఉబ్బరం మరియు ఎగువ ఉదర భాగంలో మంట లేదా నొప్పితో సహా ఒకటి లేదా ఎక్కువ లక్షణాలను వివరించడానికి ఉపయోగించే ఒక పదం.

అజీర్ణం పెద్దలలో సాధారణం మరియు మరియు ఎప్పుడైనా ఒకసారి లేదా ప్రతి రోజు అంత తరచుగా సంభవించవచ్చు.

### ఏది అజీర్ణాన్ని కలిగిస్తుంది?

అజీర్ణం అనేది జీర్ణ వాహిక లోగ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్ (GERD), పెప్టిక్ అల్సర్ డిసీజ్ , క్యాన్సర్, క్లోమం లేదా పిత్త వాహికల యొక్క అసాధారణత వంటి ఒక పరిస్థితి వలన కలుగ వచ్చు. ఆ పరిస్థితి మెరుగుపడితే లేదా పరిష్కరించబడితే, అజీర్ణ లక్షణాలు సాధారణంగా మెరుగుపడతాయి.

కొన్నిసార్లు ఒక వ్యక్తి ఒక కారణం కనుగొనబడలేని అజీర్ణం ను కలిగి ఉంటాడు. ఫంక్షనల్ డిస్పెప్సియా అని పిలువబడే ఈ రకమైన అజీర్ణం, కడుపు చిన్న ప్రేగుతో కలిసే ప్రాంతంలో ఏర్పడుతుందని భావించబడుతోంది. అజీర్ణం అసాధారణ చలనమునకు సంబంధించినదై ఉండవచ్చు అది ఆహారాన్ని స్వీకరించేటప్పుడు, జీర్ణం చేసేటప్పుడు, మరియు చిన్న ప్రేగుకు తరలించేటప్పుడు కడుపు కండరం యొక్క పిండే లేదా సడలించే చర్య.

### అజీర్ణం యొక్క లక్షణాలు ఏమిటి?

అజీర్ణం ఉన్న చాలా మంది వ్యక్తులు ఈ క్రింది లక్షణాలలో ఒకటి కంటే ఎక్కువ వాటిని అనుభవించవచ్చు.

భోజన సమయంలో ఉబ్బరం. ఆ వ్యక్తికి భోజనం ప్రారంభించిన వెంటనే కడుపు అతిగా నిండినట్టు అనిపిస్తుంది మరియు భోజనాన్ని పూర్తి చేయలేరు.

భోజనం తర్వాత ఇబ్బందికరమైన ఉబ్బరం. ఆ వ్యక్తికి భోజనం తర్వాత అతిగా నిండినట్టు అనిపిస్తుంది ఆహారం చాలా ఎక్కువ సేపు కడుపు లో ఉన్నట్టుగా అనిపించవచ్చు.

ఛాతీ నొప్పి. ఛాతీ ప్రాంతం అనేది ఛాతీ ఎముక యొక్క దిగువ చివరి మరియు నాభి మధ్య ఉంటుంది. ఆ వ్యక్తి తేలికపాటి నుండి తీవ్రమైన ఛాతీ నొప్పిని ఎదుర్కొనవచ్చు.

ఛాతీలో మంట. ఆ వ్యక్తి ఛాతీ ప్రాంతంలో ఒక అసౌకర్యకరమైన వేడి అనుభూతిని అనుభవిస్తాడు.

అజీర్ణంతో సంభవించగల ఇతర, తక్కువ తరచుగా కనిపించే లక్షణాలు వికారం మరియు ఉబ్బరంకడుపులో ఒక అసౌకర్యమైన బిగువుగా ఉండు స్థితి. వికారం మరియు ఉబ్బరం అజీర్ణం కాక ఇతర కారణాల వలన ఉండవచ్చు.

కొన్నిసార్లు అజీర్ణం అనే పదం గుండెల్లో మంట అనే లక్షణం వర్ణించడము కొరకు వాడబడుతుంది, కాని ఇవి రెండు వేర్వేరు పరిస్థితులు. గుండెల్లో మంట అనేది మెడ లేదా వీపు దిశగా ప్రసరించే ఛాతిలో ఒక బాధాకరమైన మంట అనే అనుభూతి. గుండెల్లో మంట అనేది అన్నవాహిక లోకి ఎగతోయబడుతున్న ఉదర ఆమ్లం ద్వారా కలుగుతుంది మరియు అది GERD యొక్క ఒక లక్షణం కావచ్చు. ఒక వ్యక్తి అజీర్ణం మరియు గుండెల్లో మంట రెండింటి యొక్క లక్షణాలు కలిగి ఉండవచ్చు.

### అజీర్ణం ఎలా నిర్థారించబడుతుంది?

అజీర్ణంను నిర్థారించడానికి, డాక్టర్ వ్యక్తి యొక్క ప్రస్తుత లక్షణాలు మరియు వైద్య చరిత్ర గురించి అడుగుతాడు మరియు ఒక శారీరక పరీక్ష నిర్వహిస్తాడు. డాక్టర్ ఉదరం మరియు చిన్న ప్రేగు యొక్క ఎక్స్ రేలను ఆదేశించవచ్చు.

ఆంత్ర శూల వ్యాధి (పెప్టిక్ అల్సర్ డిసీజ్)ని కలుగచేసే బాక్టీరియా రకం అజీర్ణానికి కారణమని అనుమానిస్తే డాక్టర్ రక్తం, శ్వాస, లేదా మల పరీక్షలు నిర్వహించవచ్చు.

డాక్టర్ ఒక ఎగువ ఎండోస్కోపీ చేస్తారు. ఆ వ్యక్తి మగతగా అయ్యేందుకు సహాయం చేయడానికి మత్తు మందు ఇచ్చిన తర్వాత, డాక్టర్ ఒక ఎండోస్కోప్‌చివరలో ఒక లైట్ మరియు చిన్న కెమెరా ఉండే ఒక పొడవైన, సన్నని ట్యూబ్‌ను నోటి ద్వారా పంపిస్తాడు మరియు నెమ్మదిగా ఈసోఫేగస్ నుండి కడుపులోకి దానికి దిశను నిర్దేశిస్తాడు. డాక్టర్ ఏవైనా అసాధారణతల కోసం తనిఖీ చేయడానికి ఎండోస్కోప్ తో అన్నవాహిక మరియు కడుపును చూడవచ్చు. GERD లేదా ఇన్ఫెక్షన్ కారణంగా సంభావ్య నష్టం కోసం చూడటానికిడాక్టర్ జీవాణుపరీక్షలు (బయాప్సీలు) చెయ్యవచ్చుఒక సూక్ష్మదర్శినితో పరిశీలించడానికి కణజాల భాగాలను తీయడం.

అజీర్ణం మరింత తీవ్రమైన పరిస్థితి యొక్క ఒక సంకేతం కావచ్చు కాబట్టి, ప్రజలు ఈ క్రింది వాటిని ఎదుర్కొన్నట్లయితే వారు వెంటనే ఒక డాక్టర్ను కలవాలి

### తరచుగా వాంతులు

వాంతిలో రక్తం

బరువు కోల్పోవటం లేదా ఆకలి మందగించటం


నల్లని తారు వంటి విరేచనము

కష్టతరమైన లేదా బాధాకరమైన మింగడం

వక్షస్థలము కాని ఒక ప్రాంతంలో కడుపునొప్పి

శ్వాస ఆడకపోవుట, చెమట పట్టుట, లేదా దవడ, మెడ, లేదా భుజం కు ప్రసరించే నొప్పితో కూడిన అజీర్ణం

2 వారాల కంటే ఎక్కువ రోజులు కొనసాగే లక్షణాలు



### అజీర్ణానికి ఎలా చికిత్స చేస్తారు?

కొంతమంది ఈ క్రింది వాటి ద్వారా అజీర్ణం యొక్క లక్షణాల నుండి ఉపశమనాన్ని పొందవచ్చు

రోజంతా అనేక చిన్న, తక్కువకొవ్వు భోజనాలను నెమ్మదిగా తినడం

ధూమపానం చేయకుండా ఉండటం

కాఫీ, కార్బోనేటేడ్ పానీయాలు మరియు మద్యం తీసుకోవడం నుండి దూరంగా ఉండడం

కడుపు పొరను చికాకుపరచగలమందుల వాడకాన్ని ఆపటంఆస్పిరిన్ లేదా బాధనివారక మందులు వంటివి

తగినంత విశ్రాంతి పొందడం

ఉపశమన చికిత్సా లేదా యోగా వంటి మానసిక మరియు శారీరక ఒత్తిడి తగ్గించే మార్గాలను కనుగొనటం

డాక్టర్ ఆమ్ల ఉత్పత్తిని తగ్గించే లేదా చిన్న ప్రేగులోకి త్వరగా ఆహారాన్ని తరలించడానికి కడుపుకు సహాయం చేసే ఓవర్‌దికౌంటర్ యాంటాసిడ్లను లేదా మందులను సిఫారసు చేయవచ్చు. ఈ మందులలో చాలా వాటిని ఒక ప్రిస్కిప్షన్ లేకుండా కొనుగోలు చేయవచ్చు. నాన్ ప్రిస్కిప్షన్ మందులను, లేబుల్ మీద సిఫార్సు చేయబడిన మోతాదులో మరియు సమయ వ్యవధి పాటు మాత్రమే వాడాలి, ఒక డాక్టర్ వేరుగా సలహా ఇస్తే తప్ప.

యాంటాసిడ్లు సాధారణంగా అజీర్ణ లక్షణాల నుండి ఉపశమనానికి సిఫార్సు చేయబడే మొదటి మందులు. కడుపులోని ఆమ్లంను తటస్థం చేయడానికి హైడ్రాక్సైడ్ మరియు బైకార్బోనేట్ అయాన్లతో మార్కెట్ లో అనేక బ్రాండ్లు మూడు ప్రాథమిక లవణాలుమెగ్నీషియం, కాల్షియం, మరియు అల్యూమినియంయొక్క వివిధ మిశ్రమాల్ని ఉపయోగిస్తాయి. అయితే, యాంటాసిడ్లు దుష్ప్రభావాలను కలిగి ఉండవచ్చు. మెగ్నీషియం లవణం అతిసారానికి దారి తీయవచ్చు, మరియు అల్యూమినియం లవణం మలబద్ధకానికి కారణం కావచ్చు. ఈ ప్రభావాలను సమతుల్యం చెయ్యటానికి అల్యూమినియం మరియు మెగ్నీషియం లవణాలు తరచుగా ఒకే ఉత్పత్తిలో మిళితం చేయబడతాయి.

అవి మలబద్ధకానికి కారణం కాగలవు అయినప్పటికీ కాల్షియం కార్బోనేట్ యాంటాసిడ్లు కూడా కాల్షియం యొక్క అనుబంధ మూలం కావచ్చు.

H2 రిసెప్టర్ యంటాగోనిస్ట్ (H2RAs) లలో రనిటడీన్, సిమాటడీన్, ఫేమటడీన్, మరియు నిజైటడీన్ ఉంటాయి మరియు అవి ప్రిస్కిప్షన్ ద్వారా మరియు ప్రిస్కిప్షన్ లేకుండా (ఓవర్ ది కౌంటర్) అందుబాటులో ఉన్నాయి. H2RA లు ఉదర ఆమ్లం తగ్గించడం ద్వారా అజీర్ణం యొక్క లక్షణాలను చికిత్స చేస్తాయి. అవి యాంటాసిడ్ల కంటే ఎక్కువ కాలం పనిచేస్తాయి కానీ అంత వేగంగా కాదు. H2RA ల యొక్క దుష్ప్రభావాలలో తలనొప్పి, వికారం, వాంతులు, మలబద్ధకం, అతిసారం, మరియు అసాధారణ రక్తస్రావం లేదా కమిలిన గాయాలు ఉండవచ్చు.

ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్ (PPIs) లలో ఓమెప్రేజోల్, లాన్సో ప్రేజోల్, ప్యాంటోప్రేజోల్, రాబేప్రేజోల్, మరియు ఎసోమేప్రేజోల్ ఉంటాయి మరియు ప్రిస్కిప్షన్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. ప్యాంటోప్రేజోల్ ఓవర్ ది కౌంటర్ స్ట్రెంత్ లో కూడా అందుబాటులో ఉంది. H2RA లు కంటే బలమైనవి అయిన PPI లు, కడుపు ఆమ్లంను తగ్గించడం ద్వారా అజీర్ణం లక్షణాలను కూడా చికిత్స చేస్తాయి. GERD కూడా కలిగిన ప్రజలలో అజీర్ణ లక్షణాలకు చికిత్స చేయడంలో PPI లు అత్యంత ప్రభావవంతమైనవి. PPIs దుష్ప్రభావాలలో వెన్ను నొప్పి, నొప్పి, దగ్గు, తలనొప్పి, మైకము, పొత్తికడుపు నొప్పి, గ్యాస్, వికారం, వాంతులు, మలబద్ధకం, మరియు విరేచనాలు వంటివి వుంటాయి.

**డాక్టర్ అజీర్ణంను నిర్థారించడానికి ఎక్స్ రే లు; రక్త, శ్వాస, మరియు మల పరీక్షలు; మరియు జీవాణుపరీక్షలతో ఒక ఎగువ ఎండోస్కోపీ ని ఆదేశించవచ్చు. కొంతమంది కొన్ని జీవనశైలి మార్పులు చేయడం మరియు ఒత్తిడిని తగ్గించడం ద్వారా అజీర్ణం నుండి ఉపశమనాన్ని పొందవచ్చు.**

మెటక్లోప్రమైడ్ వంటి ప్రోకైనాటిక్స్ కడుపు చాలా నెమ్మదిగా ఖాళీ యగుటతో సమస్య గల వ్యక్తుల కోసం సహాయకరంగా ఉండవచ్చు. మెటక్లోప్రమైడ్ జీర్ణ వాహికలో కండరాల చర్యను కూడా మెరుగుపరుస్తుంది. ప్రోకైనాటిక్స్ అలసట, నిద్రపోవడం, నిరాశ, ఆతురత, మరియు బలవంతపు కండరాల కుదింపులు లేదా కదలిక వంటి వాటి ఉపయోగార్థాన్ని పరిమితం చేసే తరచుగా ఏర్పడే దుష్ప్రభావాలను కలిగి వుంటాయి.

ఒకవేళ పరీక్ష, పెప్టిక్ అల్సర్ డిసీజ్ (జీర్ణకారి పుండు వ్యాధి) ని కలుగచేసే బాక్టీరియా యొక్క రకాన్ని చూపిస్తే, డాక్టర్ ఆ పరిస్థితికి చికిత్స చేయడానికి యాంటిబయోటిక్స్ ను సూచించవచ్చు.

### గుర్తుంచుకోవలసిన పాయింట్లు

డిస్పెప్సియా (అజీర్తి) అని కూడా పిలువబడే అజీర్ణం అనేది, భోజనం సమయంలో ఉబ్బర భావన, భోజనం తర్వాత అసౌకర్యవంతమైన ఉబ్బరం మరియు ఎగువ ఉదర భాగంలో మంట లేదా నొప్పితో సహా ఒకటి లేదా ఎక్కువ లక్షణాలను వివరించడానికి ఉపయోగించే ఒక పదం.

అజీర్ణం అనేది జీర్ణ వాహిక లోగ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్ (GERD), పెప్టిక్ అల్సర్ డిసీజ్ , క్యాన్సర్, క్లోమం లేదా పిత్త వాహికల యొక్క అసాధారణత వంటి ఒక పరిస్థితి వలన కలుగవచ్చు.

## ప్రకృతి వైద్యం 1

**నిద్రలేమి:** రాత్రి సమయమునందు గోరువెచ్చగా గానీ, భరించగల వేడినీటితో శిరస్నానము చేయవలెను. రాత్రి సమయమునందు తేలికగా జీర్ణమగు ఆహార పదార్థములను భుజింపవలెను. పాదములకు శిరసునకు ఆముదము బాగా రాసి, నీరు పోసి నవనీతము చేసి రుద్దాలి.

**చెవిలో దురద, చెవిలో పుండు:** నువ్వుల నూనెలో చిన్నఉల్లి (వెల్లుల్లి) రెబ్బలు వేసి బాగా కాచి ఆ నూనె వడగట్టి దినమునకు రెండు పర్యాయములు వేయవలెను. 2 లేక 3 దినములకు ఒకసారి గ్లిజరిన్ వేసిన పుల్లకి దూదిని చుట్టి మెల్లగా తుడవవలెను. చెవిలో గుడ్డపీలిక అడ్డుపెట్టి చెవి అంతా స్టీమ్ ఆవిరి పట్టాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారపదార్థములలో ద్రవ పదార్థములనే సేవించాలి. శనగపిండి మాంసములేగాక నమలవలసి వచ్చే పదార్థములు సేవించుట మానటం అవసరము.

**కడుపునొప్పి:** శొంఠి పొడి, వాము పొడి, ధనియాల పొడి సమముగా తీసుకుని ఒక గ్లాసు నీటిలో వేసి మరగకాచి ఆ కషాయము సేవించినా కడుపు నొప్పి తగ్గును. చిటికెడు పరిమాణముగల పసుపు తగినంత, కొంచెము ఉప్పు ఒక గ్లాసు నీటిలో వేసి మరగకాచి చల్లారిన తర్వాత ఆ నీటిని సేవించినా కడుపు నొప్పి తగ్గును.

## ఆయుర్వేద చిట్కాలు 2

**వాతం:** వాతం అనగానే మనకి నొప్పి గుర్తొస్తుంది. కరెక్ట్‌గా మనకి నొప్పి తెలియాలంటే మన శరీరంలోని 'నెర్వస్ సిస్టం' పని చెయ్యాలి. కాబట్టి 'వాతం' అనే మాటని మనం అర్థం చేసుకోవడానికి శరీరంలోని మొత్తం 'నెర్వస్ సిస్టం' అధీనంలో ఉండి అన్ని క్రియలు వాతం వలన జరుగుతున్నాయి. అంతేకాకుండా మన శరీరంలో హార్మోన్ గ్రంథులు, మెటబాలిజమ్‌లో కొంతభాగం మన ఇంద్రియ వ్యవస్థలు కూడా 'వాతం' యొక్క ఆధీనంలోనే ఉంటాయి. మనం బయటి ప్రపంచంలో 'కమ్యూనికేట్' చెయ్యాలంటే వాతమే ముఖ్యమైనది. మనతో మనం కమ్యూనికేట్ చేసుకోవాలన్న ఈ వాతమే ప్రధానమే.

**కఫం:** శరీరంలోని జలధాతువు యొక్క అధిక్యతను కఫం అంటారు. దీనినే శ్లేష్మం అని కూడా అంటారు. మన శరీరంలోని సూక్ష్మ, స్థూలభాగాలన్ని ఒకదానితో మరొకటి సంబంధం ఏర్పరచుకోవడానికి శ్లేష్మమే కారణం. శరీరంలోని కఫం పెరగటం, తగ్గడం, జలతత్వంపైనే ఆధారపడి ఉంటాయి. అలాగే పంచభూతాలలోని పృథ్వి (భూమి) గుణం వలన కఫానికి 'స్థిరం' అనే గుణం ఏర్పడుతుంది. కఫం మనలోని 'ఓజస్సు' కి కారణం.

## ఆకుకూరలతో కలిగే మేలు 3

- సాధారణంగా వినియోగించే ఆకుకూరల్లో ఉండే పోషక విలువలు
- ఆకుకూరల్లో పోషక పదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. అందుకే శరీర
- పెరుగుదల, దృఢత్వానికి, చక్కని ఆరోగ్యానికి ఇవి చాలా ముఖ్యమైనవి.
- భారతదేశంలో అనేక రకాల ఆకుకూరలు వినియోగంలో ఉన్నాయి. వీటిలో పాలకూర, తోటకూర, గోంగూర, మెంతికూర, మునగాకులు, పుదీన తదితరాలు ప్రముఖమైనవి.
- ఆకుకూరలు ఎక్కువగా ఖనిజ పోషకాలు, ఇనుముధాతువు కలిగి ఉంటాయి. శరీరంలో ఇనుములోపం కారణంగా అనీమియా వ్యాధికి గురవుతారు. గర్భవతులు, బాలింతలు(పాలిచ్చే తల్లులు), పిల్లలు ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతారు.
- ప్రతిరోజూ తీసుకొనే ఆహారంలో ఆకుకూరలను తప్పకుండా చేర్చాలి. తద్వారా అనీమియాను నివారించి, చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చు.
- ఆకుకూరల్లో కాల్షియం, బీటాకెరోటిన్, విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటాయి.
- విటమిన్‌ఎ లోపం కారణంగా భారతదేశంలో ప్రతీ యేటా ఐదేళ్ళ లోపు వయస్సు పిల్లలు సుమారు 30 వేల మంది కంటిచూపును కోల్పోతున్నారు. ఆకుకూరలద్వారా లభించే కెరోటిన్ మనశరీరంలో విటమిన్‌ఎ గా మారి అంధత్వం రాకుండా చేస్తుంది.

## సంతోషకరమైన ఆరోగ్య జీవితానికి

# 40 చిట్కాలు

### ఆరోగ్యం

- పుష్కలంగా నీరు త్రాగండి.
- రాజు లాగా బ్రేక్ ఫాస్ట్ తీసుకోండి, ప్రిన్సు లాగా లంచ్ తీసుకోండి, బెగ్గర్ లాగా డిన్నర్ తీసుకోండి.
- చెట్లు మరియు మొక్కల మీద పెరిగే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోండి, మరియు మొక్కలలో తయారు కాబడే ఆహారాన్ని తక్కువగా తీసుకోండి.
- 3 E లతో జీవించండి – శక్తి (Energy), ఉత్సాహం (Enthusiasm) మరియు సానుభూతి (Empathy).
- ప్రార్థన మరియు పర్యాలోచనకోసం సమయాన్ని కేటాయించండి.
- ఎక్కువగా ఆటలు ఆడండి.
- మీరు గత సంవత్సరం కన్నా ఎక్కువ పుస్తకాలను చదవండి.
- ప్రతీ రోజు కనీసం 10 నిమిషాల పాటు మౌనంగా కూర్చోండి.
- 7 గంటల పాటు నిద్రపోండి.

### వ్యక్తిత్వం:

- ప్రతి రోజు 10–30 నిమిషాల పాటు నడవండి మరియు చిరునవ్వుతో నడవండి.
- మీ జీవితాన్ని ఇతరుల జీవితాలతో సరిపోల్చకండి. వారి ప్రయాణం దేని గురించి అని ఏ అవగాహన మీకు లేదు.
- ప్రతికూల ఆలోచనలు లేదా మీరు నియంత్రించలేని విషయాలను కలిగి ఉండొద్దు. బదులుగా అనుకూల ప్రస్తుత క్షణంలో మీ శక్తిని పెట్టుబడిగా పెట్టండి.
- అతిగా చేయొద్దు; మీ హద్దుల్లో వుండండి.
- మిమ్మల్ని మీరు ఎక్కువ సీరియస్ గా తీసుకోకండి; ఇంకెవ్వరూ చేయరు.
- పుకార్ల మీద మీ విలువైన శక్తిని వృథా చేయకండి.
- మీరు మేల్కొన్నప్పుడు ఎక్కువ కలలు కనండి.
- అసూయ వలన సమయం వృథా అవుతుంది. మీకు కావలసినవన్నీ మీకు ఇప్పటికే వున్నాయి.
- గతం యొక్క సమస్యలను మరిచిపోండి. అతని/ఆమె యొక్క గత తప్పులను మీ భాగస్వామికి గుర్తు చేయవద్దు. అది మీ ప్రస్తుత ఆనందాన్ని నాశనం చేస్తుంది.
- ఇతరులను అసహ్యించుకుంటూ సమయం వృథా చేయడానికి జీవితం చాలా చిన్నది. ఇతరులను అసహ్యించుకోకండి.
- అది మీ ప్రస్తుతాన్ని పాడుచేయకుండా ఉండడానికి, మీ గతాన్ని ప్రశాంతంగా ఉంచుకోండి.
- మీ సంతోషానికి మీరు తప్ప ఇతరులు ఎవ్వరూ బాధ్యులు కారు.
- జీవితం ఒక పాఠశాల మరియు మీరు నేర్చుకోవడానికి ఇక్కడ ఉన్నారు అని గ్రహించండి. సమస్యలు కనబడి దూరంగా వాడిపోవు ఆల్జీబ్రా తరగతి వంటి పాఠ్యాంశంలోని భాగంగా ఉంటాయి, కానీ మీరు నేర్చుకున్న పాఠాలు ఒక జీవితకాలం పాటు నిలిచిపోతాయి.
- ఎక్కువగా చిరునవ్వు చిందించండి మరియు నవ్వండి.
- ప్రతీ వాదనలో మీరే గెలవాలని లేదు. అనంగీకారాన్ని అంగీకరించండి.

### కమ్యూనిటీ

- తరచుగా మీ కుటుంబానికి కాల్ చేయండి.
- ప్రతీ రోజు ఇతరులకు ఏదో ఒక మంచి చేయండి.
- అందరినీ ప్రతీ దాని కొరకు క్షమించండి.
- 70 పైన & 6 లోపు వయస్సు కలిగిన వారితో సమయము గడపండి.
- కనీసం ముగ్గురు వ్యక్తులను ప్రతి రోజు నవ్వించడానికి ప్రయత్నించండి.
- ఇతర వ్యక్తులు మీ గురించి ఏమనుకుంటున్నారనేది నీకు అనవసరం.
- మీరు అనారోగ్యంగా వున్నప్పుడు మీ ఉద్యోగం మిమ్మల్నికాపాడదు. మీ కుటుంబము మరియు స్నేహితులు కాపాడుతారు. మీకు అందుబాటులో ఉంటారు.

### జీవితం

- సరైన పనులు చేయండి.
- ఉపయోగం లేనిదాన్ని, బాగా లేనిదాన్ని లేక ఆనందంగా లేనిదాన్ని వదిలి వేయండి.
- క్షమాగుణం అన్నింటినీ బాగుచేస్తుంది.
- ఒక పరిస్థితి ఎంత మంచిదైనా లేక చెడుదైనా, అది మారుతుంది.
- మీకు ఏవిధముగా అనిపించినా సరే, లేవండి, దుస్తులు వేసుకోండి మరియు బయటికి రండి.
- అత్యుత్తమమైనది ఇంకా రావలసి ఉంది.
- మీరు ఉదయం చురుకుగా మేల్కొన్నప్పుడు, దాన్ని అలాగే అంగీకరించవద్దు జీవితాన్ని అక్కున చేర్చుకోండి.
- మీ లోపల వుండేది ఎప్పుడూ సంతోషంగా వుంటుంది. కాబట్టి మీరు సంతోషంగా వుండండి.

**చివరిదైన ముఖ్యమైనది:**

- జీవితాన్ని ఆస్వాదించండి!







# త్వరలోనే సలార్-2 షూటింగ్

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'సలార్ పార్ట్-1: సీజ్ ఫైర్' గతేడాదిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకొని కలెక్షన్ల వర్షం కురిపించింది. దేవాగా ప్రభాస్, వరద రాజమన్నార్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ ఆకట్టుకున్నారు. దీని రెండో భాగం ఎప్పుడొస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ విషయంపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ అప్‌డేట్ ఇచ్చారు.

మరికొన్ని రోజుల్లో దీని షూటింగ్ ప్రారంభం కానుంది. ప్రశాంత్ నీల్ చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. 'సలార్2' కచ్చితంగా 2025లో విడుదలవుతుంది. తేదీ మాత్రం దర్శకనిర్మాతల నిర్ణయంపై ఆధారపడి ఉంది. దీనికి సంబంధించిన కొన్ని సీక్వెన్స్‌లను పూర్తి చేయడానికి నేను 'ఎల్2: ఎంపురాన్' నుంచి కొన్ని రోజులు బ్రేక్ తీసుకోవాలి' అని చెప్పారు. ఇటీవల నటుడు బాబీసింహా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సలార్ పార్ట్2 కథ సిద్ధంగా ఉందని.. ఏప్రిల్‌లో చిత్రీకరణను ప్రారంభించాలని భావిస్తున్నట్లు చెప్పిన విషయం తెలిసిందే. దీంతో త్వరలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్తుందని అభిమానులు భావిస్తున్నారు. పార్ట్ 2ను 'శౌర్యాంగ పర్వం' పేరుతో తెరకెక్కించనున్నారు. ఎన్నో ప్రశ్నలతో మొదటి భాగాన్ని ముగించిన ప్రశాంత్ నీల్.. రెండో పార్ట్‌లో వాటికి ఎలాంటి సమాధానాలు చెప్పనున్నారు. ప్రభాస్ ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ'లో నటిస్తున్నారు. దీని చిత్రీకరణ తుది భాగానికి చేరుకుంది. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం వేసవి కానుకగా మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీంతోపాటు మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్' లోనూ ప్రభాస్ నటిస్తున్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో ఇది తెరకెక్కుతోంది. హను రాఘవపూడితో ఓ సినిమా లైనప్‌లో ఉంది.

# బన్సాలీ హీరామండి ట్రైలర్ విడుదల



బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వస్తున్న తాజా వెబ్ సిరీస్ హీరామండి: ది డైమండ్ బజార్. ఈ సిరీస్‌తోనే డిజిటల్ ప్లాట్ ఫామ్‌లోకి అడుగు పెడుతున్నారు భన్సాలీ. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ మనీషా కొయిరాలా, సోనాక్షి సిన్హా, అదితి రావ్ హైదరీ, రిచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్‌లు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ ఓటీటీ ఎలాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ వెబ్ సిరీస్ మే 01 నుంచి అందుబాటులోకి రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడటంతో సిరీస్ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ గమనిస్తే.. ఇండిపెండెన్స్‌కు ముందు పాకిస్తాన్ లాహోర్‌లోని హీరామండి అనే ప్రాంతంలో వేశ్యలు ఉండగా.. ఈ ప్రాంతాన్ని మల్లికాజాన్ (మనీషా కొయిరాలా) పరిపాలిస్తుంటుంది.

అయితే ఈ ప్రాంతాన్ని తమ గుప్పట్లోకి తెచ్చుకోవాలని బ్రిటీష్ వాళ్లు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలోనే మల్లికాజాన్ (మనీషా కొయిరాలా) ఏం చేసింది. అన్నింటిని ఎదుర్కొని హీరామండిలో చివరకు ఎవరు రాజ్యమేలుతారు? అనే స్టోరీతో ఈ వెబ్ సిరీస్ వస్తుంది. ఈ చిత్రానికి భన్సాలీతో పాటు విభు పూరి, మితాక్షర కుమార్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా. ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.




## ఓటిటిలోకి వచ్చేస్తున్న

# గోపీచంద్ భీమా

టాలీవుడ్ మాచో స్టార్ గోపీచంద్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం 'భీమా'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సినిమాకు కన్నడ దర్శకుడు ఏ హర్ష దర్శకత్వం వహించగా.. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం మహా శివరాత్రి కానుకగా మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. అయితే ఈ సినిమా తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది.


ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఏప్రిల్ 25 నుంచి ఈ సినిమా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మించగా.. 'సలార్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించాడు. ప్రియాంక భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా అలరించిన ఇందులో వెన్నెల కిషోర్, రఘుబాబు, నాజర్, నరేష్ కీలకపాత్రల్లో నటించారు.



# స్పీడ్ పెంచిన శర్వానంద్


రెండేండ్లుగా సైలెంట్ గా ఉన్న యువ హీరో శర్వానంద్ సినిమాల వేగం పెంచారు. ఏకంగా నాలుగైదుచిత్రాలు లైన్‌లో పెట్టాడు. తాజాగా అదే కోవలో మరో కొత్త చిత్రాన్నికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. చివరగా 2022లో ఒకే ఒక జీవితం సినిమాలో కనిపించిన ఆయన ఇప్పటివరకు మరే సినిమాలోనూ కనిపించలేదు. ఈ చిత్రం తర్వాత పెళ్లి చేసుకుని ఓ ఇంటివాడైన శర్వా తాజాగా తండ్రిగా ప్రమోషన్ కూడా పొందిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మనమే అనే చిత్రం షూటింగ్ లో శర్వా బిజీగా ఉండగా.. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన పాట మంచి వ్యూస్ దక్కించుకుంది. తాజాగా తన జన్మదినం సందర్భంగా , 37 మరో రెండు చిత్రాలను ప్రకటించారు. ఇప్పుడు అదే కోవలో మరో కొత్త చిత్రాన్నికి గ్రాన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. గతంలో రానాతో ఘాజీ , వరుణ్ తేజ్‌తో అంతరిక్షం , విద్యుత్ జమ్వాల్ అనే బాలీవుడ్ చిత్రం రూపొందించిన యువ దర్శకుడు సంకల్ప్ రెడ్డి తాజాగా చాలా గ్యాప్ తర్వాత మరో సినిమా రూపొందించడానికి సిద్దమైనట్లు తెలుస్తోంది.సంకల్ప్ చెప్పిన కథ నచ్చడంతో శర్వానంద్ ఓకే చెప్పాడని ..ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెకక్కున్నట్లు, ఈ యేడాది చివరలో సెట్స్ పైకి రానునన్నట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.

# తనికెళ్ల భరణి సందేశాత్మక చిత్రం.. నిర్ణయం



టాలీవుడ్ సీనియర్ నటుడు తనికెళ్ల భరణి మరో సందేశాత్మక చిత్రంతో రాబోతున్నాడు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'నిర్ణయం'. ఈ సినిమాతో సంజయ్ కుమార్, అంజలి హీరోహీరోయిన్లుగా టాలీవుడ్‌కు పరిచయం అవుతుండగా.. జెన్నీ, పీవీ కృష్ణ ప్రసాద్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. అయితే తాజాగా ఈ మూవీ ఫిల్మ్ ఛాంబర్ లోని థియేటర్ లో ప్రివ్యూ కూడా పూర్తి చేసుకుంది. ఇక ఈ ప్రివ్యూ చూసిన పలువురు సినీ ప్రముఖులు మూవీ బాగుందని చిత్రయూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. 'నిర్ణయం'తో గతంలో అక్కినేని నాగార్జున యాక్షన్ ఫిల్మ్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు అదే టైటిల్ తో ఈ చిత్రం వస్తుంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు భరణి చెప్పుకోచ్చాడు. శివరావు సత్తెనపల్లి సమర్పణలో వస్తున్న ఈ చిత్రంలో 'బాహుబలి' హరిశ్చంద్ర రాయల, రఘునాథ రెడ్డి, జనార్ధన్ రావు (జెన్నీ) కీలక పాత్రల్లో నటించారు. సుద్దాల అశోక్ తేజ, కుల శేఖర్ ఈ సినిమాకు పాటలు అందించగా.. కృష్ణ సాయి సంగీతం అందించారు. త్వరలోనే చిత్రయూనిట్ ఈ సినిమా రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయనుంది.

# పెళ్లి గురించి ప్రచారం అక్కర్లేదనుకున్నాం: తాప్సీ



నటి తాప్సీఇటీవలే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని సీక్రెట్‌గా ఉంచడంపై ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అది పూర్తిగా వ్యక్తిగత వ్యవహారమన్నారు. 'నా వివాహానికి సంబంధించిన విషయాలను వెల్లడించి అందరిలో ఆసక్తి పెంచాలని అనుకోవడం లేదు. దాని గురించి అందరూ చర్చించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే బయటకు చెప్పలేదు. ఇది నా అభిప్రాయం మాత్రమే. ఈ విషయంలో నా భర్తకు మరో అభిప్రాయం ఉండొచ్చు. అందుకే మేము దీని గురించి మీడియా, సోషల్ మీడియాలో చెప్పలేదు. పెళ్లి చేసుకున్న సంగతిని ఎప్పటికీ రహస్యంగా ఉంచాలనే ఉద్దేశం మాకు లేదు. నా సన్నిహితులు, కుటుంబసభ్యులు మొదటి నుంచి దీనిలో భాగమయ్యారు. వాళ్లకు అన్నీ తెలుసు. వాళ్ల అంగీకారంతోనే చేసుకున్నాం. పెళ్లి అనేది జీవితంలో ఒకేసారి జరుగుతుంది. దాన్ని ఆనందంగా చేసుకోవాలని నిర్ణయించుకున్నా. ఆర్భాటాలకు చోటివ్వకుండా కొందరి సమక్షంలో ఒక్కటయ్యాం. నా పెళ్లి ఫొటోలు, వీడియోలను కూడా పంచుకోవడానికి ప్రస్తుతం సిద్ధంగా లేను. భవిష్యత్తులో అందరికీ షేర్ చేయాలనుకుంటే అప్పుడు పోస్ట్ చేస్తాను' అని చెప్పారు. మార్చి 23న ఉదయ్‌పూర్‌లో తాప్సీ-మథియాస్ బో వివాహం జరిగింది. ఇటీవల వీరి పెళ్లి వీడియో లీకవ్వగా అది వైరల్‌గా మారింది.



## పిల్లిని రక్షించేందుకు బావిలోకి దూకి
# ఐదుగురు మృతి

**అహ్మద్‌నగర్(మహారాష్ట్ర)(వెలుతురు):** ఓ పిల్లిని రక్షించేందుకు బావిలోకి దూకి ఐదుగురు మృతి చెందారు. ఈ విషాద సంఘటన మహారాష్ట్ర, అహ్మద్‌నగర్‌లోని వాడ్కి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో అర్ధరాత్రి పాడుబడిన బావిలో పడిపోయిన పిల్లిని కాపాడేందుకు ప్రయత్నించి మొదట ఒకరు బావిలోకి దూకారు. అతని కోసం మరోకరు.. అలా ఒకరు తర్వాత మరొకరు.. మొత్తం ఐదుగురు బావిలోకి దూకి చనిపోయారు. చివర్లో తాడు సాయంతో బావిలోకి దిగిన ప్రాణాలతో బయటపడ్డాడు. బాధితుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి.. బావిలో నుంచి మృతదేహాలను బయటకు తీసి పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బావిని బయోగ్యాస్ కోసం వినియోగిస్తున్నారని.. ఈ క్రమంలో అందులో పడిన వారు ఊరిపిరాడక మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు చెప్పారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిని మాణిక్ కాలే(65), మాణిక్ కుమారుడు సందీప్(36), అనిల్ కాలే(53), అనిల్ కుమారుడు బబ్లూ(28), బాబాసాహెబ్ గైక్వాడ్(36)లుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఎన్నికల రాజకీయాలకు వీరప్ప మొయిలీ స్వస్తి

**బెంగళూరు ఏప్రిల్ 10(వెలుతురు):** కాంగ్రెస్ సీనియర్ నేత, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలీ పార్టీ తనకు సర్వం ఇచ్చిందని, ఎన్నికల రాజకీయాలకు స్వస్తి పలుకుతున్నందుకు తనకు విచారం లేదని బుధవారం ప్రకటించారు. మాజీ కేంద్ర మంత్రి వీరప్ప మొయిలీ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చిక్కబళ్లాపూర్ నుంచి పోటీ చేయాలనే ఆసక్తితో ఉన్నారు. కానీ పార్టీ ఆయనకు టిక్కెట్ నిరాకరించింది. మొయిలీ 2009, 2014 పార్లమెంటరీ ఎన్నికల్లో ఆ నియోజకవర్గం



నుంచి గెలిచారు. కానీ 2019లో ఓడిపోయారు. '(ఎన్నికల రాజకీయాల నుంచి) రిటైర్ కావడానికి అది మంచి సాకు' అని ఆయన అన్నారు. ఎం మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ వంటి అదే వయస్సు ఉన్న పార్టీ నేతలు ఈ దఫా పోటీ చేయడం లేదు కనుక పోటీ చేయాలన్న ఆలోచన విరమించవలసిందని తనతో కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం చెప్పినప్పుడు తాను వెంటనే అంగీకరించానని 84 ఏళ్ల మొయిలీ తెలిపారు. మొయిలీ బెంగళూరులో 'పిటిఐ'తో మాట్లాడుతూ, 'నేను ఈ సారి చిక్కబళ్లాపూర్ నుంచి తిరిగి ఎన్నికయ్యేవాడినే' అని చెప్పారు. తాను నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తూనే ఉన్నానని, అయితే నియోజకవర్గం ప్రజలతో అనుబంధం తెంచుకోవడం కష్టం అని ఆయన చెప్పారు. తనను నిలబెట్టరాదన్న పార్టీ నిర్ణయం తనను బాధించలేదని ఆయన స్పష్టం చేశారు. అధిష్ఠానం నిర్ణయాలకు తాను ఎల్లప్పుడూ నిబద్ధమై ఉన్నట్లు మొయిలీ తెలిపారు. 'అధికారంపై తనకు వ్యామోహం ఉందనే అభిప్రాయం ప్రజలకు కలగరాదని అనుకుంటున్నాను. నేను పార్టీ కోసం పని చేస్తూనే ఉంటా. ఎన్నికల్లో పోటీ చేయను' అని మొయిలీ తెలిపారు.

## న్యాయవ్యవస్థను అపహాస్యం
# చేయడానికి ప్రయత్నిస్తున్నారు

### ఢిల్లీ హైకోర్టు అసహనం.. పిటిషనర్ సందీప్ కుమార్‌కు రూ.50 వేల ఫైన్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10(వెలుతురు):** దేశ రాజధాని ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అయిన తర్వాత ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలని కోరుతూ పదే పదే పిటిషన్లు దాఖలు అవుతుండటంపై ఢిల్లీ హైకోర్టు బుధవారం అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయస్థానం ఈ పిటిషన్లపై ఇదివరకే సమాధానం ఇచ్చిందని తెలిపింది. ఇది సీక్వెల్‌లను కలిగి ఉండే జేమ్స్ బాండ్ చిత్రం కాదని.. ఈ విషయంలో




"రిపీట్ లిటిగేషన్" ఉండకూడదని.. మళ్లీ మళ్లీ పిటిషన్‌లు దాఖలు చేయవద్దని స్పష్టం చేసింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. రాజకీయ చిక్కుముడిలోకి కోర్టును లాగాలని ప్రయత్నించి, వ్యవస్థను అపహాస్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ పిటిషనర్ సందీప్ కుమార్‌పై రూ.50 వేల ఫైన్ విధించింది."సీక్వెళ్లు ఉండటానికి ఇది జేమ్స్ బాండ్ సినిమా కాదు. లెఫ్టినెంట్ గవర్నర్ సమస్యను పరిష్కరిస్తారు. మమ్మల్ని రాజకీయాల్లోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారు" అని కోర్టు పేర్కొంది. రాజధానిలో గవర్నర్ పాలన విధించలేమని జస్టిస్ మన్మీత్ పీఎస్ అరోరాతో కూడిన ధర్మాసనం పునరుద్ఘాటించింది. మార్చి 28న అరవింద్ కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను కోర్టు కొట్టివేసింది.

## మతం, కులం పేరిట ప్రజల మధ్య
# డిఎంకె ఘర్షణలను రాజేస్తున్నారు

### డిఎంకె సారథ్యంలోని కూటమిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన ప్రధాని నరేంద్ర మోడీ

**వేలూరు(తమిళనాడు) ఏప్రిల్ 10 (వెలుతురు):**

తమిళనాడులోని అధికార డిఎంకె సారథ్యంలోని కూటమిపై ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని అధికార డిఎంకె పార్టీ దశాబ్దాలుగా సాగిస్తున్న ప్రమాదకర రాజకీయాలను తాను బయటపెడుతూనే ఉంటానని ఆయన ప్రకటించారు. మతం, కులం పేరిట ప్రజల మధ్య డిఎంకె ఘర్షణలను రాజేస్తోందని వేలూరులో ఒక ఎన్నికల సభనుద్దేశించి ప్రసంగిస్తూ మోడీ ఆరోపించారు. విభజించి పాలించు అనే డిఎంకె రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్న నాడు ఆ పార్టీకి రాష్ట్రంలో ఒక్క ఓటు కూడా దక్కదని ఆయన అన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ వెనుక డిఎంకె ఉందని ఆయన ఆరోపించారు. ఈ డ్రగ్ మాఫియాలకు ఎవరు రక్షణ కల్పిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎన్‌సిబి అరెస్టు చేసిన డ్రగ్ మాఫియా ఎవరి కుటుంబానికి చెందనదని ఆయన అన్నారు. కచ్చతీవు అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్, డిఎంకెపై ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ విషయమై అనేక ఏళ్లు ఆ రెండు పార్టీలు ప్రజలకు నిజాలు దాచాయని మోడీ ఆరోపించారు. కచ్చతీవు ద్వీపం సమీపానికి వెళ్లిన భారత మత్స్యకారులను శ్రీలంక అరెస్టు చేయడంపై ఈ రెండు పార్టీలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్నపుడు కచ్చతీవును శ్రీలంకకు అప్పగించేసిందని, ఈ నిర్ణయాన్ని ఏ క్యాబినెట్ తీసుకుందో, దీని వల్ల ఎవరు ప్రయోజనం పొందారో కాంగ్రెస్ పెదవి విప్పలేదని ఆయన



అన్నారు. గతకొన్నేళ్లలో అనేక మంది భారత మత్స్యకారులు అరెస్టయ్యాయని, దీనిపై కాంగ్రెస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తుంటారని ఆయన ఆరోపించారు. శ్రీలంకలో అరెస్టయిన భారత మత్స్యకారులను స్వదేశానికి తీసుకురావడానికి కేంద్రంలోని తమ ప్రభుత్వం ఎన్నోసార్లు చొరవచూపిందని ఆయన తెలిపారు. ఈ మత్స్యకారులను వాపసు తీసుకురావడానికి కేంద్రంలోని ఎన్‌డిఎ నిరంతరం శ్రమిస్తోందని ఆయన చెప్పారు. 1974లో కచ్చతీవు ద్వీపాన్ని కాంగ్రెస్ పార్టీ అనాలోచితంగా శ్రీలంకకు ధారాదత్తం చేసినట్లు తాజాగా బయటపడిందని మోడీ చెప్పారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నపుడు భారత్, శ్రీలంక మధ్య 1974లో కుదిరిన ఒప్పందంపై తమిళనాడు బిజెపి అధ్యక్షుడు కె అన్నామలై ఆర్‌టిఐ కింద అడిగిన ప్రశ్నకు వచ్చిన జవాబుతో అసలు వాస్తవాలు వెలుగుచూశాయని ఆయన చెప్పారు. జయలలితను అవమానించారు. దివంగత తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జె జయలలితని గుర్తు చేస్తూ డిఎంకెపై ప్రధాని మోడీ విరుచుకుపడ్డారు. మహిళలను అగౌరవపరిచే డిఎంకె రాష్ట్ర ప్రజలను ప్రాచీన భావాలతో బంధించిందని ఆయన ఆరోపించారు. జయలలిత పట్ల ఎలా వ్యవహరించారో, ఆమెపై ఎలాంటి నీచమైన వ్యాఖ్యలు చేశారో తనకు తెలుసునని ఆయన డిఎంకెను ఉద్దేశించి మండిపడ్డారు. మహిళలను తమిళనాడు గౌరవిస్తుందని, కాని ఇండియా కూటలో భాగస్వామి అయిన డిఎంకె గౌరవించదని ఆయన ఆరోపించారు. శక్తిని నాశనం చేస్తానని రాహుల్ గాంధీ చెప్పారని, సనాతన ధర్మాన్ని అంతం చేస్తానని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కుమారుడు(ఉదయనిధి స్టాలిన్) ప్రకటించారని ప్రధాని గుర్తు చేశారు. తమిళనాడును పాత ఆలోచనలతో, పాత రాజకీయాలతో ఉంచాలన్నదే డిఎంకె ధ్యేయమని, డిఎంకె కూడా ఒక కుటుంబ కంపెనీయేనంటూ ఆయన ఎద్దేవా చేశారు. తమిళనాడులోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఒకే దశలో పోలింగ్ జరగనున్నది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

### ద్వీపంలో ఎవరైనా నివిసిస్తారా: దిగ్విజయ సింగ్

కచ్చతీవు అంశాన్ని ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం తమిళనాడులోని వేలూరు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మళ్లీ ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడంపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు దిగ్విజయ సింగ్ స్పందించారు. ద్వీపంలో ఎవరైనా మనుషులు నివసిస్తారా అంటూ ఆయన ఎదురు ప్రశ్నించారు. మానవ ఆవాసయోగ్యం కాని ఆ ద్వీపంలో ఎవరైనా నివసిస్తారా అని తాను తెలుసుకోదలచినట్లు దిగ్విజయ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

## క్షమాపణ కాగితంపైనే ఉంది..
# వారి తీరు అందుకు విరుదంగా ఉంది

### రామ్‌దేవ్ బాబా 'బేషరతు క్షమాపణ'ను తిరస్కరించిన సుప్రీం కోర్టు

### పతంజలి ఉత్పత్తులకు లైసెన్స్ ఇచ్చినందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని తప్పు పట్టిన న్యాయస్తానం

### ఔషధ లైసెన్సింగ్ అధికారులు ముగ్గురిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10(వెలుతురు):**

పతంజలి ఔషధ ఉత్పత్తులపై తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించి బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ సమర్పించిన 'బేషరతు క్షమాపణ'ను సుప్రీం కోర్టు బుధవారం తిరస్కరించింది. న్యాయమూర్తులు హిమా కోహ్లి, అహ్సనుద్దీన్ అమానుల్లాహ్‌తో కూడిన ధర్మాసనం పతంజలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. వారి చర్యలు సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులను 'ఉద్దేశపూర్వకంగా, పదే పదే ఉల్లంఘించినవిగా' ఉన్నాయని బెంచ్ పేర్కొన్నది. పతంజలి వ్యవస్థాపకుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రజలు జీవితంలో పొరపాట్లు చేస్తుంటారని అన్నారు. అయితే, సర్వోన్నత న్యాయస్థానం న్యాయవాదిని విమర్శించింది. అటువంటి కేసులలో వ్యక్తులు ఇబ్బంది పడవలసి వస్తుందని బెంచ్ వ్యాఖ్యానించింది. 'మేము కళ్లు మూసుకుని కూర్చోలేదు & మేము ఈ కేసులో ఉదారంగా వ్యవహరించదలచుకోలేదు' అని బెంచ్ స్పష్టం చేసింది. బుధవారం విచారణ సమయంలో న్యాయవాది రోహత్గి పతంజలి, సంస్థ ఎండి ఆచార్య బాలకృష్ణ, సమర్పించిన రెండు అఫిడవిట్లు, బాబా రామ్‌దేవ్ సమర్పించిన అఫిడవిట్‌ను చదివి వినిపించారు. 'క్షమాపణ కాగితంపైనే ఉంది. వారి తీరు అందుకు విరుదంగా ఉంది. దీనిని మేము అంగీకరించేది లేదు. వాగ్దానాన్ని కావాలనే ఉల్లంఘించినట్లుగా మేము దీనిని పరిగణిస్తాం. అఫిడవిట్ తిరస్కరణతో పాటు వేరే చర్యకు సిద్ధంగా ఉండండి' అని సుప్రీం కోర్టు అన్నది. బెంచ్ బాబా రామ్‌దేవ్‌ను



కూడా తూర్పారబట్టింది. విదేశీ పర్యటన ప్లాన్లు ఉన్నందున కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని రామ్‌దేవ్ కోరి అఫిడవిట్‌లో వెనుక తేదీ టిక్కెట్‌ను పొందుపరచినందుకు బెంచ్ ఆక్షేపించింది. 'కోర్టు ధిక్కరణ వ్యవహారంలో విదేశీ ప్రయాణానికి నాకు ఒక టిక్కెట్ ఉందని చెప్పి మీరు మినహాయింపు కోరి ఆ తరువాత నాకు అది లేదని చెబుతున్నారు. మీరు ఈ ప్రక్రియను చాలా తేలికగా తీసుకుంటున్నారు' అని బెంచ్ హెచ్చరించింది. ఈ ఘటనను కోర్టులో 'అబద్ధపు సాక్ష్యం'గా బెంచ్ పేర్కొన్నది. క్షమాపణ అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించడానికి బదులు ముందుగా బయటకు వెల్లడి చేసినందుకు కూడా పతంజలిని బెంచ్ తప్పు పట్టింది. 'వారు ముందు మీడియాకు పంపారు. మంగళవారం రాత్రి 7.30 వరకు మా కోసం అప్‌లోడ్ చేయలేదు. వారికి ప్రచారంలో విశ్వాసం ఉందని స్పష్టం అవుతోంది' అని జస్టిస్ కోహ్లి అన్నారు. పతంజలి ఉత్పత్తులకు లైసెన్స్ ఇచ్చినందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని కూడా సుప్రీం కోర్టు తప్పు పట్టింది. ఔషధ లైసెన్సింగ్ అధికారులు ముగ్గురిని వెంటనే సస్పెండ్ చేయాలని కోర్టు ఆదేశించింది. 'వారు (పతంజలి) మీకు చేసిన ప్రకటనను ఉల్లంఘించినప్పుడు మీరు ఏమి చేశారు? కూర్చుని బొటనవేళ్లు విరుచుకున్నారా? మిమ్మల్ని మేము బతిమాలేందుకు వేచి ఉన్నారా' అని జస్టిస్ కోహ్లి ప్రశ్నించారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ ప్రాధికార సంస్థ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ధ్రువ్ మెహతాను జస్టిస్ అమానుల్లాహ్ ఉద్దేశిస్తూ, అధికారులను ఊరికే వదలిపెట్టేది లేదని హెచ్చరించారు.

'అధికారులకు 'విశ్వాసనీయమైన' పదం వాడడానికి మేము తీవ్ర అభ్యంతరం తెలియజేస్తున్నాం. మేము తేలికగా తీసుకోబోవడం లేదు. మిమ్మల్ని వదలిపెట్టం' అని జస్టిస్ అమానుల్లాహ్ చెప్పారు. సుప్రీంకోర్టు 'ఇప్పుడు హాస్యాస్పదం'గా మారిందని అంటూ లైసెన్సింగ్ ప్రాధికార సంస్థను బెంచ్ విమర్శించింది. 'మేము విలాస భవంతులలో కూర్చుంటామని జనం భావిస్తుంటారు. మీ అధికారులను మందలించాలి. మీరు పతంజలితో కుమ్మక్కు అయ్యారు' అని సర్వోన్నత న్యాయస్థానం ఆక్షేపించింది. ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ ప్రాధికార సంస్థ జాయింట్ డైరెక్టర్ మిథిలేశ్ కుమార్ తదుపరి చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో తదుపరి విచారణ ఈ నెల 16న ఉంటుంది. తమ ముందు హాజరు కావాలని బాబా రామ్‌దేవ్‌ను, ఆచార్య బాలకృష్ణను సుప్రీం కోర్టు కోరింది.

## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు
# మరో ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (వెలుతురు):**

మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తాజాగా మరో ఎదురుదెబ్బ తగిలింది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో తన లాయర్లను కలిసేందుకు అదనపు సమయం ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తిని ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు బుధవారం కొట్టివేసింది. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు వారానికి రెండుసార్లు మాత్రమే తన లాయర్లను కలవడానికి అనుమతి ఉంది. అయితే.. వారానికి ఐదు సార్లు కలిసేలా అనుమతి



ఇవ్వాలని ఆయన కోర్టుని కోరారు. ఆ విజ్ఞప్తిని న్యాయస్థానం రిజెక్ట్ చేయడంతో.. ఇంతకుముందులా వారానికి రెండుసార్లు మాత్రమే లాయర్లను కలవడానికి వీలుంటుంది. మరోవైపు.. తన అరెస్ట్, రిమాండ్‌ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేజ్రీవాల్‌కు నిరాశే ఎదురైంది. అరెస్టు, రిమాండ్ చట్టవిరుద్ధం కాదని.. మనీలాండరింగ్‌పై ఈడీ తగిన ఆధారాలు చూపించిందని.. గోవా ఎన్నికలకు డబ్బు ఇచ్చినట్లు అప్రూవర్ చెప్పారని హైకోర్టు స్పష్టం చేసింది. తమ ముంచు ఉంచిన ఫైల్స్, మెటీరియల్‌ని బట్టి చూస్తే.. 'మాండేట్ ఆఫ్ లా'ను అనుసరించిందని స్పష్టమవుతుందని తెలిపింది. ముఖ్యమంత్రికి ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం ఉండదని జస్టిస్ స్వర్ణకాంత శర్మతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది.


దీంతో.. కేజ్రీవాల్ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. ఈమేరకు.. సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసినట్లు కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వివేక్ జైన్ తెలిపారు. తన అరెస్ట్‌పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై కూడా ఆ పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదిలావుండగా.. కేజ్రీవాల్ ఆరెస్ట్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తమ నేతని ఎదుర్కొనే ధైర్యం లేకే ఇలా అరెస్ట్ చేయించారంటూ ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. తాజాగా ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఢిల్లీ ముఖ్యమంత్రిని జైల్లో ఉంచాలని కోరుకుంటోంది. రెండు రోజుల క్రితం కేజ్రీవాల్ తన లాయర్‌ని కలిశారు. అప్పుడు ఆయన ఓ సందేశం ఇచ్చారు.

ఎమ్మెల్యేలంతా తమ ప్రాంతాలకు వెళ్లి, ప్రజల సమస్యలను వినాలని ఆదేశించారు. దీని ఆధారంగా.. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా విచారణ జరిపిస్తున్నారు. కుటుంబ సభ్యులు, న్యాయవాదుల్ని కలవకుండా అడ్డుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారు" అని చెప్పుకొచ్చారు.

## ఎమ్మెల్యే పేర్నినాని, అతని అనుచరులపై
# కేసు నమోదు

**కృష్ణా జిల్లా, ఏప్రిల్ 10(వెలుతురు):**

జిల్లాలోని బందరు తాలుకా పోలీస్‌స్టేషన్ ముందు వైసీపీ ఎమ్మెల్యే పేర్నినాని ఆయన అనుచరులు చేసిన హంగామాపై పోలీసులు చర్యలకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే పేర్నినాని, అతని అనుచరులపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఐపీసీ 188, 143, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



నిన్న(మంగళవారం) వైసీపీ శ్రేణులతో కలిసి బందరు తాలుకా ఎస్ఐ చాణిక్యపై పేర్నినాని దౌర్జన్యానికి దిగారు. పోలీస్ స్టేషన్‌లో సీసీ ఫుటేజ్, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దీనిపై చిలకలపూడి పీఎస్‌లో తాలుకా పోలీసులు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా 144 సెక్షన్‌ను అతిక్రమించారని 188 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అలాగే ఉద్దేశ్యపూర్వకంగా పోలీస్ స్టేషన్ వద్ద గలాటా సృష్టించారని సెక్షన్ 143 కింద కేసు నమోదు అయ్యింది. సీసీ ఫుటేజ్, ఫర్నిచర్ ధ్వంసం చేసినందుకు సెక్షన్ 427 కింద పేర్ని నాని మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్టు సమాచారం. అలాగే మచిలీపట్నంలో ముగ్గురు వైసీపీ కార్పొరేటర్లపై కేసు నమోదు అయ్యింది. పోలీస్ స్టేషన్‌లో కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, మీర్ అస్గర్ అలీ, జవ్వాది రాంబాబు సీసీ ఫుటేజ్, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ముగ్గురు కార్పొరేటర్లపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో తాలుకా పోలీస్ స్టేషన్ సెంట్రీ కానిస్టేబుల్ హరికృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు కార్పొరేటర్లపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం ఉల్లిపాలెం నూకాలమ్మ తల్లి జాతరలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. టీడీపీ సానుభూతిపరులపై 50వ డివిజన్‌కు చెందిన వైసీపీ సానుభూతిపరులు దాడి చేశారు.

దీంతో టీడీపీ ఫిర్యాదు మేరకు వైసీపీ శ్రేణులపై పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన పేర్నినాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆయన.. ఎస్ఐ చాణిక్యతో దురుసుగా ప్రవర్తించారు. నానితో పాటు ఆయన కుమారుడు కూడా అత్యుత్సాహం ప్రదర్శించారు. తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారంటూ నిరసనకు దిగారు. టీడీపీకి ఎస్ఐ కొమ్ముకాస్తున్నారంటూ వైసీపీ ఎమ్మెల్యే ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ వద్ద పేర్నినాని హంగామాతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com